thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 308 కరీంనగర్ బుధవారం, 14 జనవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 10 వేల కోట్లతో క్షిపణుల కొనుగోలు

న్యూఢిల్లీ : గగనతలాన్ని శత్రు దుర్భేద్యంగా మార్చడానికి మనదేశం వేగంగా అడుగులు వేస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్ దాడులను సమర్థంగా తిప్పికొట్టిన ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థను మరింత విస్తరించ డానికి సిద్ధమైంది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్) దీనిని ఓ గేమ్‌చేంజర్‌గా అభివర్ణిస్తున్న నేపథ్యంలో మరో ఐదు ఎస్-400లను కొనుగోలు చేయనున్నారు. డిసెంబరు 5న జరిగే ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీలో వీటితో పాటు మరిన్ని క్షిపణుల కొనుగోలుకు ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. అలాగే రూ. 63 వేల కోట్లతో సుఖోయ్-30ఎంకేఐ యుద్ధవిమానాల ఆధునీకరణ కార్యక్రమానికి కూడా భారత్ సిద్ధమవుతోందని టైమ్స్ ఆఫ్ ఇండియా తన కథనంలో తెలిపింది.

ఆ కథనం ప్రకారం.. మరిన్ని ఎస్-400 స్క్వాడ్రన్‌లు కొనుగోలుకు ఇప్పటికే రక్షణ శాఖ సిద్ధమైంది. అలాగే పాక్‌తో యుద్ధం సమయంలో తరిగిపోయిన నిల్వలను మళ్లీ పెంచడానికి ఎస్-400 క్షిపణులను కూడా కొనుగోలు చేయాలని నిర్ణయించింది.

# తెలంగాణలోని విద్యార్థులకు గుడ్ న్యూస్

## ఉచితంగా కిట్... కిట్‌లో ఉండే 21 వస్తువులు



హైదరాబాద్ : తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గుడ్ న్యూస్. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోనే కిట్లు అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్దమైంది.

వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు తెరుచుకునే రోజే విద్యార్థులకు ఈ కిట్లను అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, పాఠశాల విద్యార్థులకు అందించే వస్తులకు సంబంధించి సెంట్రల్ ప్రొక్యూర్మెంట్‌పై ఉన్నతాధికారులతో సమీక్షించారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు కిట్ అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

**కిట్లలో ఉండే వస్తువులు ఇవే...** ఇకపోతే తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు అందించనున్న కిట్లలో ఏమేమి ఉంటాయనే వివరాలను ఓసారి తెలుసుకుందాం. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే కిట్లలో యూనిఫామ్‌తోపాటు స్కూల్ బెల్ట్, టై, షూస్, స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్, ఇతర వస్తువులను అందించేందుకు అవసరమైన ప్రొక్యూర్మెంట్ ప్రణాళికలు సిద్ధం చేశారు. ఒకటో తరగతి విద్యార్థులకు డిక్షనరీ ఇచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. వేసవి సెలవుల పాఠశాల తిరిగి ప్రారంభం కాగానే విద్యార్థులకు కిట్లను పంపిణీ చేయనున్నారు.

**నాణ్యత విషయంలో రాజీపడొద్దు...** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించనున్న 22 వస్తువులతో కూడిన కిట్‌కు సంబంధించి నాణ్యత విషయంలో రాజీపడొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు.వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు కిట్ అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల విషయంలో ఖర్చుకు వెనకాడొద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడొద్దని చెప్పుకొచ్చారు.

యూనిఫామ్ తో పాటు 21 వస్తువులతో కూడిన కిట్‌ను విద్యార్థులకు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులకు సంబంధించి పూర్తి వివరాలను అందించాలని అధికారులను ఆదేశించారు.

**21 వస్తువులతో కూడిన కిట్...** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించనున్న 22 వస్తువులతో కూడిన కిట్‌కు సంబంధించి నాణ్యత విషయంలో రాజీపడొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు కిట్ అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల విద్యార్థులకు అందించే వస్తువులకు సంబంధించి సెంట్రల్ ప్రొక్యూర్మెంట్‌పై ముఖ్యమంత్రి గారు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల విషయంలో ఖర్చుకు వెనకాడొద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడొద్దని తెలిపారు. యూనిఫామ్‌తో పాటు 21 వస్తువులతో కూడిన కిట్‌ను విద్యార్థులకు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులకు సంబంధించి పూర్తి వివరాలను అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి,వేం నరేందర్ రెడ్డి, స్పెషల్ సీఎస్ సబ్యసాచి ఘోష్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




హైదరాబాద్: తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను ప్రకటించింది. ఎన్నికలు జరగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 52,43,023 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించింది. వీరిలో 25,62,369 మంది పురుష ఓటర్లు కాగా.. 26,80,014 మంది మహిళా ఓటర్లు, 640 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. పట్టణ స్థానిక సంస్థల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉండటం గమనార్హం. నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 3,48,051 మంది ఓటర్లు ఉండగా.. కొత్తగూడెం కార్పొరేషన్‌లో అత్యల్పంగా 1,34,775 మంది ఓటర్లు ఉన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అత్యధికంగా 1,43,655 మంది ఓటర్లు ఉండగా.. అమరచింత మున్సిపాలిటీలో అత్యల్పంగా 9,147 మంది ఓటర్లు ఉన్నారు. రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం పురపాలకశాఖ కసరత్తు ముమ్మరం చేసింది. రిజర్వేషన్లు ఖరారైన తర్వాత నోటిఫికేషన్ విడుదల కానుంది. జనాభా ప్రాతిపదికన వార్డులు, డివిజన్లు, ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. మొత్తం ఎన్నికల పర్వంలో రిజర్వేషన్ల ప్రక్రియ అత్యంత కీలకం కావడంతో అధికారులు దీనిని సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో గడువు ముగిసిన 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల ఎన్నికలకు రంగం సిద్ధమైన సంగతి తెలిసిందే.




# కోడి పందేలకు అంతా రెడీ

సంక్రాంతి పండగ కోడి పందేలకు ఉమ్మడి గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో బరులు సిద్ధమయ్యాయి. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోనే ఈ ఏడాది వందలాది బరులు ఏర్పాటు చేశారు. ఒకప్పుడు ఓ గ్రామంలో కోడి పందెం బరి నిర్వహిస్తే అది చుట్టుపక్కల గ్రామాలకే పరిమితమయ్యేది. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. తమ బరికి మండలం, జిల్లా దాటి రాష్ట్రం, ఇతర రాష్ట్రాల ప్రజలూ రావాలని నిర్వాహకులు ఆశిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక బరులు ఏర్పాటు చేస్తున్నారు. అదే స్థాయిలో ప్రచారం చేస్తున్నారు. బరి ఏర్పాటు, నిర్వహణ ఎంతో శ్రమ, ఖర్చుతో కూడుకున్నది. అధికార పార్టీ పెద్దలను ఒప్పించాలి. పోలీసులను ప్రసన్నం చేసుకోవాలి. ఊరిలో బరి ఎక్కడ నిర్వహించాలి? అతిథులకు రూమ్‌లు, వంట వాళ్లు, షామియానాలు, స్టేజీ ఏర్పాట్లు, సెక్యూరిటీ, బౌన్సర్లు, కత్తులు, మద్యం, కార్ పార్కింగ్‌లు వంటి సదుపాయాలు ఎలా కల్పించాలి? తదితర విషయాల్లో సంక్రాంతి పండగకు ఆర్నెల్లు ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. ఒక బరి నిర్వహించాలంటే పది లక్షల నుంచి నుంచి మూడు కోట్ల వరకు ఖర్చవుతుంది. ఇప్పుడు కోడి పందేలంటే కోట్లలో వ్యాపారం. ప్రధానంగా ప్రజాప్రతినిధులు నేరుగా కాకుండా తమ వారితో వీటిని నిర్వహిస్తుంటారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం చుట్టు పక్కల ప్రాంతాలలో ఈసారి కోడి పందేలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు.

**భీమవరంలో భారీ బరులు...** భీమవరం చుట్టుపక్కల ప్రాంతాల్లో కొన్ని బరులలో ఒక్కొక్క దానికి రూ.3 కోట్లపైనే ఖర్చు చేశారు. బరి కోసం స్థల సేకరణ, చదును, స్టేజీల నిర్వహణ, షామియానా, వాటర్ బాటిల్స్, మద్యం, భోజనాలు, రూమ్‌లు, కోళ్లకు షామియానాలు, కార్ పార్కింగ్, సెక్యూరిటీ సిబ్బంది, బౌన్సర్లు, విద్యుత్ సౌకర్యం, ఏసీలు, జనరేటర్లు, కత్తులు, పూలదండలు, కూలీలు, కత్తులు కట్టేవారు, కోళ్లతో పందేలు జరిపే వారికి జీతభత్యాలు వంటివి అనేక ఖర్చులు ఉంటాయి.

**6 నెలల ముందే రూమ్‌లు బుకింగ్...** కోడి పందేలకు వచ్చే అతిథుల కోసం ప్రత్యేకంగా రూమ్‌లను బుక్ చేస్తారు. ప్రస్తుతం భీమవరంలో రూమ్ ఒక్కోటి.. మూడు రోజులకు 30 వేల నుంచి లక్ష రూపాయల వరకు పలుకుతోంది. మూడు నుంచి ఆరు నెలల ముందుగానే అడ్వాన్స్ చెల్లించి రూమ్‌లను అతి?థుల కోసం రిజర్వు చేస్తారు. రూమ్‌ల కోసం రూ.30 లక్షలపైనే ఖర్చు చేస్తున్నారు.

**సెక్యూరిటీ, బౌన్సర్లు...** కోడి పందేల సందర్భంగా క్రమశిక్షణగా ఉండేందుకు సెక్యూరిటీ, బౌన్సర్లను ఏర్పాటు చేసుకుంటారు. స్టేజీలు, టెంట్ల నిర్వహణకు సూపర్‌వైజర్లు ఉంటారు. అతి?థులకోసం కొన్నిచోట్ల కర్పూరందండలు ఏర్పాటు చేస్తారు. అవి ఒక్కోటి రూ.10 వేలు పలుకుతుంది.

**కోతాటకు వేలం...** కోడి పందేల బరుల వద్ద జూదానికి పెద్దపీట వేస్తారు. కోతాట నిర్వహణకు వేలం నిర్వహిస్తారు. ఎక్కువగా చెల్లించిన వారికి నిర్వహించుకునే విధంగా అనుమతి ఇస్తారు. వారు కోతాటను నిర్వహిస్తూ కేబుల్ (కొంత నగదు) వసూలు చేసుకుంటారు.

ఇది ప్రధాన ఆదాయ వనరు కావడంతో చాలా మంది పోటీ పడతారు. కోతాట ఆడేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది లక్షలాది రూపాయలతో వస్తారు. డెల్టా ప్రాంతంలో ఒక్క బరిలో కోతాట నిర్వహణకు రూ.1.20 కోట్లకు వేలంలో ధర పలికినట్లు సమాచారం.

**మామూళ్లు :** కోడి పందేల బరుల నిర్వహణకు అనధికారికంగా పోలీసుల అనుమతులు తప్పనిసరి. బరి స్థాయిని బట్టి నగదు, బైండోవర్‌కు వ్యక్తులను ఇవ్వవలసి ఉంటుంది.

ప్రస్తుతం సాధారణ బరికి 3 రోజులకు గాను రూ.1.50 లక్షలు, పెద్ద బరులకు రూ.10లక్షలు ఇస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. కత్తులతో పందేలు నిర్వహించినా, డింకీ పందేల(కత్తులు లేకుండా)ను నిర్వహించినా కేసులు కడుతున్నట్లు సమాచారం. కానిస్టేబుళ్లు, ఐడీ పార్టీ, విజిలెన్స్ ఇలా అనేక మంది బరులు వద్దకు వెళ్లి మరీ నగదు తెచ్చుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**స్టేటస్‌ను బట్టి మద్యం బ్రాండ్లు...** కోడి పందేలలో భాగంగా మద్యం కూడా ఉంటుంది. అతిథుల స్టేట్‌సను బట్టి వారికి ఇష్టమైన బ్రాండ్ అందజేస్తారు. మూడు రోజులు మద్యం ఏరులై పారుతుంది. ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసినచోట అందజేస్తారు. మద్యంలో మంచింగ్ కోసం రకరకాల వంటకాలు ఉంటాయి. మద్యం కోసం కొన్ని బరుల వద్ద రూ.20 లక్షల నుంచి 30 లక్షలు వరకు ఖర్చు చేస్తున్నారు.




# త్రిముఖ వ్యూహంతో రేవంతుడు!

## జిల్లాల పర్యటనలకు స్పష్టమైన రోడ్‌మ్యాప్ రెడీ!!

హైదరాబాద్ : మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనలకు స్పష్టమైన రోడ్‌మ్యాప్ ఖరారైంది. ఈసారి పర్యటనను త్రిముఖ వ్యూహంతో నిర్వహించనున్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, అలాగే ఉపాధి హామీ పథకం అంశంపై కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నిరసన సభలు నిర్వహించడమే ఈ వ్యూహంలోని ప్రధాన అంశాలు. ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మాగాంధీ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల వారీగా రెండు దఫాల పర్యటన షెడ్యూల్‌ను సీఎం ఖరారు చేశారు. బహిరంగ సభలతో పాటు వీలున్న చోట్ల కార్నర్ మీటింగ్లు నిర్వహిస్తూ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయనున్నారు.

**జనవరి 16 నుంచి తొలి విడత పర్యటన...** మొదటి విడత జిల్లాల పర్యటనను ఈ నెల 16 నుంచి ప్రారంభించనున్నారు. జనవరి 16, 17, 18 తేదీల్లో ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో సీఎం పర్యటించనున్నారు. ఈ పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడంతో పాటు పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించనున్నారు. నిర్మల్, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలకు కూడా హాజరవుతారు. జనవరి 16న నిర్మల్‌లో, 17న జడ్చర్లలో, 18న పాలేరు-ఖమ్మం ప్రాంతంలో సీఎం పర్యటన కొనసాగనుంది. అదే సమయంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని కూడా వేగవంతం చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు.

**విదేశీ పర్యటన షెడ్యూల్...** జనవరి 19న సీఎం మేడారం వెళ్లనున్నారు. అనంతరం అదే రోజు సింగపూర్, అమెరికా దేశాల పర్యటనకు బయలుదేరనున్నారు. ఫిబ్రవరి 1న హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. మరుసటి రోజు పరిస్థితిని బట్టి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

**ఫిబ్రవరి 3 నుంచి మలి విడత...** ఫిబ్రవరి 3 నుంచి రెండో విడత జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ విడతలో ఆరు రోజుల పాటు ఆరు ఉమ్మడి జిల్లాల్లో సీఎం పర్యటించనున్నట్లు సీఎంవో వర్గాలు వెల్లడించాయి. వరుసగా నల్లగొండ, కరీంనగర్, రంగారెడ్డి, వరంగల్, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ పర్యటనలో కూడా తొలి విడత తరహాలోనే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, అధికారిక కార్యక్రమాలు, పార్టీ కార్యకర్తలతో సమావేశాలు ఉంటాయి. కార్నర్ మీటింగ్లు, బహిరంగ సభల ద్వారా మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేయనున్నారు.

**ఉపాధి హామీపై నిరసన సభలు...** ఉపాధి హామీ పథకం విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఈ సభలను విజయవంతం చేయాల్సిన బాధ్యతను స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఆయా జిల్లాల మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులకు టీపీసీసీ అప్పగించనుంది. అయితే రెండో విడతలో చివరి రోజుల్లో సీఎం వెళ్లే మెదక్, నిజామాబాద్ జిల్లాలకు సంబంధించిన షెడ్యూల్ ఇంకా పూర్తిస్థాయిలో ఖరారు కావాల్సి ఉందని సమాచారం. మొత్తం మీద మున్సిపల్ ఎన్నికలకు ముందు జిల్లాల పర్యటనలతో రాజకీయంగా పూర్తి స్థాయిలో కదలిక తీసుకురావడమే సీఎం వ్యూహంగా కనిపిస్తోంది.





## మూడుసార్లు కర్రు కాల్చి వాత పెట్టినా.. బీఆర్ఎస్‌కు సోయ లేదు

భద్రాద్రి కొత్తగూడెం : మంగళవారం ( జనవరి 13 ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో పర్యటించారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన అనంతరం స్థానిక ఎన్నికల్లో గెలుపొందిన అధికార పార్టీ సర్పంచులను సన్మానించారు. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పనులు ఇందిరమ్మ ప్రభుత్వం చేస్తోంటే వాళ్లకు గిట్టడం లేదని అన్నారు. మూడు సార్లు కర్రు కాల్చి వాత పెట్టినా వాళ్లకు సోయ లేదని అన్నారు పొంగులేటి. నాలుగోసారి కూడా ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ పార్టీకి జనం చెంప చెళ్ళు మనిపిస్తారని అన్నారు. ఇంకో పదేళ్ల తర్వాత అయినా బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందేమో చూద్దామని అన్నారు పొంగులేటి. 200 ఏళ్లకు కూడా చెక్కుచెదరకుండా సమ్మక్క సారాలమ్మ దేవాలయం అభివృద్ధి చేశామని అన్నారు పొంగులేటి. గిరిజనులకు, గిరిజనేతరులకు సమ్మక్క సారాలమ్మ దీవెనలు ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో 72శాతం అభ్యర్థులను గెలిపించుకున్నామని... కాంగ్రెస్ పార్టీది పేదల ప్రభుత్వమని అన్నారు. అవకాశం వచ్చిన ప్రతిసారి అశ్వారావుపేట పరిస్థితులు సీఎం రేవంత్ దృష్టిలో పెడుతూనే ఉన్నానని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల పట్ల సీఎం రేవంత్ కు ప్రత్యేక శ్రద్ధ ఉందని అన్నారు పొంగులేటి. పేదవాడికి ఆత్మగౌరవాన్ని నిలిపేలా ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తున్నామని.. అశ్వారావుపేట కు అదనంగా వెయ్యి ఇళ్ళు కలిపి 4500 ఇందిరమ్మ ఇళ్ళు కేటాయించామని అన్నారు. ఇంకా అడుగడుగునా అక్క చెల్లెమ్మలు తమకు ఇళ్ళు రాలేదను అడుగుతున్నారని.. గత ప్రభుత్వ నిర్వాకం వల్లే ఇలాంటి పరిస్థితి దాపురించిందని అన్నారు పొంగులేటి.

ఉచిత కరెంటు, సన్నబియ్యమే కాక ఇంకా పేదవాడికి కావాల్సిన అన్ని అవసరాలు తీరుస్తామని అన్నారు పొంగులేటి.

కాంగ్రెస్ పెట్టని కోట లాంటిదని, రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తామని అన్నారు..నిస్వార్థంగా పేదవాడికి మంచిచేసే పనిలో సర్పంచ్ లు పాలు పంచుకోవాలని.. ఏ పేదవాడికి ఇబ్బంది పెట్టవద్దని అన్నారు పొంగులేటి.

## జాతర్ల సందడి షురూ.. సంక్రాంతికి తెలంగాణలో జరిగే జాతరలు ఇవే!

**కొత్త కొండ జాతర :** సంక్రాంతి పండుగ సమయంలో మాత్రమే జరిగే స్పెషల్ జాతరలో కొత్తకొండ జాతర ఒకటి. సమ్మక్క సారలమ్మ జాతర తర్వాత అతి పెద్ద జాతరగా ఇది పేరుగాంచింది. ఇక్కడ కొండ మీద కొలువై ఉన్న శ్రీ వీరభద్రస్వామి వారికి గుమ్మడికాయలు కోరమీసాలు ప్రత్యేకంగా సమర్పిస్తారు. భోగి పండుగ రోజున ఎడ్ల బండ్లు, ట్రాక్టర్స్‌లలో చాలా మంది భక్తులు కొత్తకొండకు బయల్దేరుతారు. ఈ జాతరకు దాదాపు 5 లక్షలకు పైగా భక్తులు వస్తారంట. తెలంగాణలో ఫేమస్ జాతరలో ఇదొక్కటి.

**కొమురవెల్లి మల్లన్న జాతర :** దాదాపు నెల రోజుల పాటు కొనసాగే ఈ జాతర గురించి ఎంత చెప్పినా తక్కువే. జనవరి సమయంలో మల్లన్న స్వామి ఆలయం మొత్తం భక్తులతో నిండిపోతుంది. ఇక్కడ పట్నాలు, పసుపు బండారితో స్వామి వారిని పూజించడం, గంగరేణి చెట్టుకింద పట్నాలు వేసి, శివసత్తుల ఆటలతో, ఒగ్గు కథలతో దద్దరిల్లిపోతుంది. ఇక్కడ మరో విశేషం ఏమిటంటే? ఇక్కడ శివుడు వ్యక్తి రూపంలో లింగ దర్శన ఇస్తాడు. తెలంగాణలోని అద్భుతమైన ఆలయాల్లో కొమురవెల్లి మల్లన్న స్వామి ఆలయం ఒకటి.

**ఐనవోలు జాతర :** తెలంగాణలోని ఫేమస్ ఆలయాల్లో ఐనవోలు జాతర కూడా ఒకటి. హన్మకొండ జిల్లాలో ఈ ఆలయం ఉంది. కాకతీయ కాలంలో నిర్మించిన ఈ గుడి, చాలా ప్రత్యేకతను కలిగి ఉంటుంది. ఇక్కడ మల్లిఖార్జున స్వామి కొలువుదీరాడు. ఇక్కడ కూడా పట్నాలు వేసి, బోనాలతో స్వామి వారికి మొక్కుల తీర్చుకుంటారు. చాలా వరకు ఐనవోలు మల్లిఖార్జున స్వామి వారిని దర్శించుకున్న తర్వాత కొమురవెల్లి మల్లిఖార్జున స్వామి వారిని దర్శించు కోవడం ఆనవాయితీ.

**సమ్మక్క , సారలమ్మ జాతర :** తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన జాతర సమ్మక్క సారలమ్మ జాతర. ఈ జాతర రెండు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. ఇక్కడ అమ్మవార్లు కుంకుమ భరణి రూపంలో దర్శనం ఇస్తారు. జంపన్న వాగు, చాలా ప్రత్యేకమైనది. వన బిడ్డల జన జారగా పేరుగాంచిన ఈ జాతరకు తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా చాలా మంది భక్తులు వస్తుంటారు. అమ్మవార్లకు బెల్లం నైవేద్యంగా సమర్పిస్తారు. ఇక జనవరి 28 నుంచి ఈ జాతర మొదలు కానుంది.

**నాగోబా జాతర :** ఆదిలాబాద్ జిల్లాలో జరిగ అతి పెద్ద జాతర నాగోబా జాతర. ఇది గిరిజనుల అతి పెద్ద పండుగ. ఇక్కడ గోండులు నాగేంద్రుడిని దేవుడిగా కొలుస్తూ ప్రత్యేక పూజలు చేస్తారు. దాదాపు 10 రోజుల పాటు చాలా ఘనంగా ఈ పండుగ జరుగుతుంది.



## ఆ రెండు కేసుల విచారణకు సజ్జనార్ నేతృత్వంలో సిట్

హైదరాబాద్: నారాయణపేట జిల్లా మద్దూర్, హైదరాబాద్ సీసీఎస్‌లో నమోదైన కేసులపై విచారణకు తెలంగాణ ప్రభుత్వం సిట్ ఏర్పాటుచేసింది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో 8 మందితో సిట్ ఏర్పాటు చేస్తూ డీజీపీ శివధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కావలి వెంకటేశ్ అనే వ్యక్తి సీఎం ఫొటోలను అసభ్యకరంగా రూపొందించి వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేశాడు. దీనిపై కాంగ్రెస్ నేత గూళ్ల నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈనెల 11న కేసు నమోదైంది. తాజాగా మహిళా ఐఏఎస్‌ను కించపరుస్తూ వార్తలను ప్రచారం చేయడంపై సీసీఎస్‌లో కేసు నమోదు చేశారు. ఐఏఎస్ అధికారుల సంఘం ఫిర్యాదు మేరకు రెండు తెలుగు న్యూస్ ఛానళ్లతో పాటు ఏడు యూట్యూబ్ ఛానళ్లపై బీఎన్ఎస్ 75, 78, 79, 351(1), 351(2) సెక్షన్ల కింద కేసులు పెట్టారు. ఈ రెండు కేసుల వ్యవహారంపై సిట్ దర్యాప్తు చేయనుంది. సిట్‌లో సభ్యులుగా నార్త్ రేంజ్ జాయింట్ సీపీ శ్వేత, చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్, హైదరాబాద్ అడ్మిన్ డీసీపీ వెంకటలక్ష్మి, సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు, విజిలెన్స్ అదనపు ఎస్పీ ప్రతాప్, సీసీఎస్ ఏసీపీ గురు రాఘవేంద్ర, సైబర్‌సెల్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రెడ్డి, సైబర్‌సెల్ ఎస్సై హరీశ్ ఉన్నారు.



## 18న మేడారంలో తెలంగాణ క్యాబినెట్ భేటీ

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని ఈసారి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మేడారంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ భేటీకి సంబంధించిన ఆసక్తికర వివరాలు ఇక్కడ ఉన్నాయి: 'సమ్మక్క సారలమ్మ మేడారం మహాజాతర' ఈ నెల 28న ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో, సంప్రదాయానికి భిన్నంగా జనవరి 18న సాయంత్రం 5 గంటలకు మేడారంలో క్యాబినెట్ సమావేశం జరగనుంది.

**సీఎం రేవంత్ రెడ్డి బిజీ షెడ్యూల్ (జనవరి 18-19):** జనవరి 18 ఉదయం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటన. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం: సీపీఐ వంద సంవత్సరాల వేడుకకు ముఖ్య అతిథిగా హాజరవుతారు. సాయంత్రం: మేడారం చేరుకుని మంత్రివర్గ సమావేశంలో పాల్గొంటారు. జనవరి 19 ఉదయం: మేడారం అమ్మవార్ల నూతన ప్రాంగణ ప్రారంభోత్సవం, దర్శనం అనంతరం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం. జనవరి 19 రాత్రి: పెట్టుబడుల సేకరణ కోసం స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు పయనం.

**క్యాబినెట్ చర్చించబోయే కీలక అంశాలు:** ఈ సమావేశంలో రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు: స్థానిక సంస్థల ఎన్నికలు: పురపాలక (మున్సిపల్) ఎన్నికల నోటిఫికేషన్, అలాగే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణపై కీలక నిర్ణయం. రాష్ట్ర బడ్జెట్: ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ ఉన్న నేపథ్యంలో, రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనపై శాఖల వారీగా దిశానిర్దేశం.

రైతు భరోసా: రైతులకు పెట్టుబడి సాయం (రైతు భరోసా) నిధుల విడుదలపై స్పష్టత. మౌలిక సదుపాయాలు: పట్టణాభివృద్ధి పథకాలు, హ్యామ్ (HAM) రోడ్ల నిర్మాణంపై చర్చ.



## ఎంపీ ఈటల, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మధ్య వాగ్వాదం

మచ్చబొల్లారం: మేడ్చల్ జిల్లా మచ్చబొల్లారంలో రైల్వే అండర్ బ్రిడ్జి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో భాజపా, బీఆర్ఎస్ నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు.

వంతెనకు నిధులు తామే తీసుకువచ్చామంటూ ఇరువర్గాలు వాదోపవాదాలు చేసుకున్నాయి. ఈ క్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను సముదాయించారు.

## ప్రపంచంలోనే అతిపెద్ద జాతర

మేడారం : ప్రపంచంలోనే అతిపెద్ద జాతర మేడారం అని మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం మరోసారి మేడారం జాతర పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడారు. ఈసారి జాతరకు రెండు కోట్లకు పైగానే భక్తులు వస్తారని అంచనా వేసినట్లు మంత్రి సీతక్క తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమ్మక్క-సారలమ్మతో భావోద్వేగ బంధం ఉందని చెప్పారు.




రూ.260 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. ఈనెల 18వ తేదీన మేడారం జాతరకు సీఎం రేవంత్ రెడ్డి రాబోతున్నారని వెల్లడించారు. మేడారంలోనే కేబినెట్ సమావేశం కూడా జరుగబోతోందని అన్నారు. ఈ మహా జాతరకు గత ప్రభుత్వం రూ.75 కోట్ల నుంచి రూ.100 కోట్లు కేటాయిస్తే తాము గద్దెల ప్రాంగణం పునర్నిర్మాణానికే రూ.101 కోట్లు, ఇతర ఏర్పాట్లకు రూ. 150 కోట్లు మంజూరు చేశామన్నారు. రెండు రోజుల్లో నిర్మాణాలన్నీ పూర్తి చేసి జాతరకు సిద్ధం చేయబోతున్నట్లు తెలిపారు. వైద్య, విద్యుత్తు, పంచాయతీ అధికారులు జాతర పూర్తయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. గద్దెల ప్రాంగణం వద్ద తొక్కిసలాట ఘటనలు తలెత్తకుండా ఉండేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తామన్నారు.

## కాంగ్రెస్‌లోకి కవిత ఎంట్రీపై పీసీసీ చీఫ్ క్లారిటీ

హైదరాబాద్ : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారంటూ కొద్దిరోజులుగా వస్తున్న వార్తలపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. మంగళవారం నాడు మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశమే లేదని స్పష్టం చేశారు. తెలంగాణాలో బీఆర్ఎస్ పార్టీకి గతం తప్ప.. భవిష్యత్తు లేదంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబ అవినీతి గురించి కవిత నిజాలు చెప్తున్నారన్నారు. తాము చేసిన ఆరోపణలపై కవిత సమాధానం రూపంలో రుజువైందని చెప్పారు. కవిత మాటలతో కేసీఆర్ అవినీతి నిజమని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని ఆయన చెప్పారు.

**గెలిచే అభ్యర్థులకే టికెట్....** సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణా ప్రయోజనాలే ముఖ్యమని.. ఒక్క నీటిబొట్టును కూడా వదలమని తేల్చిచెప్పారు. అజారుద్దీన్, కోదండరామ్ ఎమ్మెల్సీల విషయంలో మంచి స్పందన వస్తోందని నమ్ముతున్నట్లు తెలిపారు.

ఏప్రిల్‌లో కార్పొరేషన్ ఛైర్మన్లను భర్తీ చేస్తామని ప్రకటించారు. పదవులు తక్కువ అయ్యాయని... ఆశావహులు ఎక్కువ అయ్యారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ తరఫున ఒక కమిటీ వేస్తామని.. సర్వేల ఆధారంగా టికెట్ల ఇస్తామని చెప్పారు. గెలిచే అభ్యర్థులకే టికెట్ ఇస్తామని మహేశ్ కుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పొత్తుపై పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

**ఆ సెంటిమెంట్‌తో ఓట్లు అడగం..** బీజేపీని తెలంగాణాలో నమ్మే పరిస్థితి లేదన్నారు మహేశ్ కుమార్. మత రాజకీయాలు రాష్ట్రంలో నడవవని అన్నారు. రాముడికి, బీజేపీకి సంబంధమేంటి అని ఆయన ప్రశ్నించారు. తాము హిందూ ఆచారాలను పాటిస్తామని.. కానీ హిందూ సెంటిమెంట్‌తో ఓట్లు అడగమని తెలిపారు. తనకు, సీఎం రేవంత్ మధ్య మంచి సాన్నిహిత్యం ఉందన్నారు పీసీసీ చీఫ్. మంత్రులకు, సీఎంకు మధ్య ఎలాంటి గ్యాప్ లేదని మహేశ్ తేల్చిచెప్పారు. ఇతర మంత్రుల శాఖల్లో ముఖ్యమంత్రి తలదూర్చరన్నారు. మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నారని వెల్లడించారు. డీ సెంట్రలైజేషన్ కోసమే మేడారంలో క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేస్తున్నారని పీసీసీ చీఫ్ తెలిపారు.




**శాస్త్రీయంగా జిల్లాల పునర్విభజన...** కేసీఆర్.. కుమారుడికి ఒక జిల్లా, కూతురికి ఒక జిల్లా, అల్లుడికి ఒక జిల్లా ఇచ్చారని పీసీసీ చీఫ్ ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్ అశాస్త్రీయంగా జిల్లాలను విభజించారని మండిపడ్డారు. శాస్త్రీయంగా జిల్లాల పునర్విభజన చేయాలని కమిటీ వేస్తున్నామని తెలిపారు. సికింద్రాబాద్‌ను ఎవరు ముట్టుకున్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ గాబరాపడుతున్నారని ప్రశ్నించారు. వ్యక్తిగత జీవితాలతో ఆడుకునే హక్కు ఎవరికీ లేదన్నారు. మహిళా అధికారులపై ఆధారాలు లేకుండా వార్తలు రాస్తే ఎంత ఇబ్బంది పడతారో అర్థం చేసుకోవాలన్నారు.

సోషల్ మీడియాను కట్టడి చేయాలన్నారు. పదేళ్లలో వచ్చిన ఉద్యోగాలు ఎన్ని? రెండేళ్లలో ఇచ్చిన ఉద్యోగాలు ఎన్నో నిరుద్యోగులు అర్థం చేసుకోవాలని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో ఒంటరిగానే భాజపా పోటీ: రామచందర్‌రావు



హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు తెలిపారు. తమ పార్టీకి ఎవరైనా మద్దతిస్తే స్వాగతిస్తామన్నారు. జనసేన రాజకీయ పార్టీ అని.. పోటీ చేస్తే తప్పేముందని ప్రశ్నించారు.

హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. "భాజపా ఎదుగుదలను కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు అంగీకరించకుండా ఏదేదో మాట్లాడుతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు గులాబీ పార్టీకి అభ్యర్థులే దొరకలేదు. పంచాయతీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించాం. మున్సిపల్ ఎన్నికల్లోనూ సత్తా చాటుతాం. ఎంపీలు వారి నివాసాల్లో సమావేశం కావడంలో తప్పేముంది. నాకు వ్యతిరేకంగా భేటీ అయ్యారన్న విషయంపై సమాచారం లేదు. కవిత పార్టీ పెడతారో లేదో తెలియదు" అని రామచందర్‌రావు వ్యాఖ్యానించారు.




## కైట్ ఫెస్టివల్.. ఆ రూట్లలో ట్రాఫిక్ ఆంక్షలు..

**హైదరాబాద్, జనవరి 13: సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జనవరి 13 నుంచి 15 వరకు అంతర్జాతీయ కైట్స్, స్వీట్స్ ఫెస్టివల్ - 2026 జరుగనుంది. ఈ ఫెస్టివల్‌ని గ్రాండ్ సక్సెస్ చేసేందుకు అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్‌కు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. తాజాగా ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి పోలీసులు కీలక అడ్వైజరీ ప్రకటించారు. 13, 14, 15 తేదీల్లో పరేడ్ గ్రౌండ్స్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆక్షలు విధిస్తున్నట్లు సదరు ప్రకటనలో తెలిపారు. పలు రూట్లలో ట్రాఫిక్ మళ్లిస్తుండగా.. మరికొన్ని రూట్లను పూర్తిగా క్లోజ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా తేదీల్లో పరేడ్ గ్రౌండ్స్ పరిసర రహదారులను ప్రజలు వీలైనంత వరకు నివారించాలని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.**

చురకలు

## సంపాదకీయం

### చైనా నియంత్రణ.. అమెరికా హెచ్చరిక.. వాణిజ్య యుద్ధంలో మరో కోణం

అమెరికా , చైనా మధ్య వాణిజ్య రంగంలో ఉద్రిక్తతలు గత కొన్ని సంవత్సరాలుగా విస్తరించాయి. ముఖ్యంగా టారిఫ్‌లు, వాణిజ్య అడ్డంకులు, సాంకేతిక ఆంక్షలు ఈ రెండు ఆర్థిక శక్తుల మధ్య ఘర్షణలకు కారణంగా నిలుస్తున్నాయి. ఇప్పుడు ఈ పోరాటం మరో కీలక రంగంలోకి అరుదైన అయస్కాంత లోహాల సరఫరాలో దారితీస్తోంది. చైనా ప్రపంచవ్యాప్తంగా ఈ అరుదైన లోహాల ఉత్పత్తిలో దాదాపు 70 శాతం, వాటి శుద్ధిలో 90 శాతం నియంత్రిస్తుంది. ఈ గణాంకం చైనా స్థాయి ప్రభావాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది. అమెరికా పక్షాన ఈ ఆధిపత్యం తీవ్రమైన ఆందోళనకు దారి తీసింది. ఎందుకంటే ఇవి ఆధునిక సాంకేతికతలో, రక్షణ రంగంలో, హరిత శక్తి ఉత్పత్తిలో అత్యంత అవసరమైన మూల పదార్థాలు.

**అరుదైన అయస్కాంత లోహాలు – ఆధునిక సాంకేతికతకు వెన్నెముక...** ఈ లోహాల్లో ముఖ్యమైనవి నియోడైమియం , ప్రసోడైమియం , డిస్ప్రోసియం వంటి మూలకాలు. వీటి మిశ్రమాలతో తయారయ్యే "శాశ్వత అయస్కాంతాలు" రాబోయే టెక్నాలజీ విప్లవానికి మౌలిక భాగాలు. ఇవి ఎలక్ట్రిక్ వాహనాల మోటార్లలో, పవన విద్యుత్ టర్బైన్ల జనరేటర్లలో, కంప్యూటర్ హార్డ్ డిస్క్ డ్రైవ్‌లలో, స్పీకర్లు , హెడ్‌ఫోన్‌లలో విస్తృతంగా ఉపయోగిస్తారు. ఎలక్ట్రిక్ వాహనాలు బలమైన శాశ్వత అయస్కాంత మోటార్లతో అధిక సామర్థ్యం, తక్కువ శక్తి వినియోగాన్ని అందించడానికి ఈ లోహాలు కీలకం. డిఫెన్స్ రంగం: మిస్సైల్స్, ఫైటర్ జెట్లు, రాడార్లు, స్మార్ట్ బాంబుల్లో ఉపయోగించే సూక్ష్మ సెన్సార్లు.. మోటార్ల తయారీలో ఇవి తప్పనిసరి. వైద్య పరికరాలు: ఎంఆర్ఐ స్కానర్లు, పేస్‌మేకర్లు, హియరింగ్ డివైస్‌ల లో రేర్ ఎర్త్ ఎలిమెంట్లు అనివార్యమైనవి.

**పారిశ్రామిక వినియోగాలు:** హై పర్ఫార్మెన్స్ మోటార్లు, రోబోటిక్ వ్యవస్థలు, పవర్ టూల్స్ వంటి రంగాల్లో కూడా ఇవి ప్రధాన స్థానం పొందాయి.

**చైనా వ్యూహం – వాణిజ్యానికి ఆయుధంగా అరుదైన లోహాలు...** చైనా తన ప్రభావాన్ని పెంచుకునే ప్రయత్నంలో ఈ అర్థవంతమైన వనరులను "ట్రంప్ కార్డ్" గా ఉపయోగించడం ప్రారంభించింది. అమెరికా చైనాపై టారిఫ్‌లు విధించిన నేపథ్యంలో బీజింగ్ ఈ అరుదైన లోహాల ఎగుమతులను పరిమితం చేసే ప్రయత్నాల్లో ఉంది. ఇది కేవలం వాణిజ్య సమస్య కాదు, భౌగోళిక రాజకీయ ప్రభావాన్ని పెంచే ఆలోచన. అమెరికా, యూరోప్, జపాన్ వంటి దేశాలు ఈ లోహాల సరఫరాలో చైనాపై ఆధారపడటం, చైనాకు వ్యూహాత్మక అధికారాన్ని ఇస్తోంది. చైనా ఈ లోహాలను సరఫరా చేయనంత మాత్రాన ఆధునిక చిప్‌లు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు, మిలిటరీ తయారీ లైన్లు ఆగిపోయే ప్రమాదం ఉంది. దీనిని అమెరికా పెద్ద హెచ్చరికగా తీసుకుంది.

**ప్రపంచ వ్యూహాత్మక మార్పులు...** అమెరికా ప్రభుత్వం ఇప్పటినుంచే ప్రత్యామ్నాయ సరఫరా గొలుసులను ఏర్పరచడానికి దూకుడుగా ప్రయత్నిస్తోంది. ఆస్ట్రేలియా, కెనడా, ఇండియా, వియత్నాం వంటి దేశాల్లో అరుదైన లోహాల గనులను అభివృద్ధి చేసేందుకు పెట్టుబడులు పెడుతోంది. అదేవిధంగా రీసైక్లింగ్ టెక్నాలజీ ద్వారా వాడిన పరికరాల నుంచి రేర్ ఎర్త్ మూలకాలను తిరిగి పొందే దిశగా పరిశోధన జరుగుతోంది.

**భవిష్యత్తు దిశ...** అరుదైన అయస్కాంత లోహాలు కేవలం వాణిజ్య విలువ కలిగిన వనరులు కావు. ఇవి సాంకేతిక ఆధిపత్యం, రక్షణ భద్రత, గ్రీన్ ఎనర్జీ భవిష్యత్తుకి మూలాధారం. ఈ వనరులపై చైనాకున్న పట్టు, ప్రపంచ సమతౌల్యాన్ని మార్చే శక్తిగా మారింది. అమెరికా , ఇతర దేశాలు ఈ ఆధారపడటాన్ని తగ్గించుకోవడమే కాక, స్వావలంబనకు దిశగా కదలడం అనివార్యం అవుతోంది. అనగా 21వ శతాబ్దపు "వాణిజ్య యుద్ధాలు" ఇకపై కేవలం టారిఫ్‌లతో కాకుండా, అరుదైన ఖనిజాల ఆధిపత్యం తో నిర్ణయించబడతాయనడం తప్పు కాదు.


## పురాణ పురుషులు... మల్లాది చంద్ర శేఖరులు - జనవరి 14...మల్లాది వర్ధంతి



ఆయన పురాణ ప్రవచనం గావిస్తుంటే పండిత పామరులు మంత్రముగ్ధులయి తీరాల్సిందే. ధర్మసందేహాలు కార్యక్రమంలో శ్రోతల సందేహాలకు సమాధా నాలు చెబుతుంటే కార్యక్రమంలో లీనం కావాల్సిం దే. భద్రాచాల సీతారాముల కల్యాణానికిగాని, తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు గాని, శ్రీశైలంలో భ్రమరాంబా మల్లికార్జునుల కల్యాణానికి గానీ వ్యాఖ్యానం చేస్తుంటే శ్రోతలు తమ చెవులు అప్పగించాల్సిందే. ఆయన గళం నుంచి వెలువడే ప్రతిమాటా సప్రామాణికం, సవ్యాఖ్యాన సహితం...ఆయనే అభినవ వేదవ్యాస మహర్షిగా లబ్ధ ప్రతిష్టులైన పౌరాణిక సార్వభౌమ మల్లాది చంద్ర శేఖర శాస్త్రి. మల్లాది ప్రముఖ పండితులు, పురాణ ప్రవచకులు. ఆయన స్వరంలోని మాధుర్యం, రామాయణ, భారత, భాగవతాలపై ఆయనకున్న పట్టు కారణంగా పురాణ ప్రవచన ప్రముఖులలో ఆయన ప్రత్యేకతను సంతరించు కున్నారు. తన పదిహేనవ ఏట నుంచి ప్రారంభించిన ఈ ప్రవచన యజ్ఞం అసిధారా వ్రతంగా కొనసాగుతునే ఉంది. సహస్ర చంద్ర దర్శనం చేసుకున్నా, శత జయంతి వేడుకల సమయాన్ని సమీపిస్తున్నా, జీరవోని గొంతుతో, ఉపన్యాసం, హరికథ, నాటకం, పురాణం కలిపి శ్రోతలను ఆకట్టుకునే విధంగా చేస్తున్న ప్రవచనాలు ఆయన అసమాన ప్రతిభకు నిదర్శనాలు. మల్లాది దక్షిణామూర్తి దంపతులకు 1925 ఆగస్టు 22న భాద్రపద శుక్ల తృతీయ నాడు అర్ధరాత్రి, అంటే తెల్లవారితే వినాయక చవితి అనగా సనాతన సత్సంప్ర దాయం గల కుటుంబంలో ఆయన జన్మించారు. తాతగారు మల్లాది రామకృష్ణ విద్వత్ చయనుల వద్ద పెరిగిన క్రమంలో, నాయనమ్మ కృష్ణవేణి సోమిదమ్మ సాకగా, తాతగారే ఉపనయన సంస్కారం చేశారు. ఆయన వద్దనే తర్క ప్రకరణాలు, శ్రౌతస్మార్తాలు అభ్యసించారు. ఆయన పితృదేవులు దక్షిణామూర్తి శాస్త్రి పుష్పగిరి ఆస్థాన పండితులు. ఆర్ష సంప్రదాయాన్ని ఆయన వద్దనే అలవరచు కున్నారు. పెత్తండ్రి వీరరాఘవ శాస్త్రి తర్కవేదాంత పండితులు. పినతండ్రి హరిశంకర శాస్త్రి తెనాలిలో వేదవిద్యా పరీక్షాధికారిగా పని చేసేవారు. పినతండ్రి వద్దే వేదాధ్యయనం గావించి, కంభంపాటి రామ్మూర్తి శాస్త్రి వద్ద పూర్వ మీమాంస, వ్యాకరణం నేర్చుకున్నారు. తెలుగు మాత్రం వీధిబడిలో చదువు కున్నారు. తాతగారికి, మనమడు పురాణ ప్రవచనం చెప్పాలని కోరిక. ఆంగ్ల విద్య అభ్యసిస్తే, ఉద్యోగం చేస్తానంటారని ఎలాంటి పరీక్షలు రాయ నివ్వకుండా తాత జాగ్రత్త పడ్డారు. అయితే శాస్త్రికి పురాణాలు చెప్పడం ఇష్టం ఉండేది కాదు. అది గ్రహించిన తాతగారు "చూడు నాయనా, పురాణ ప్రవచనం చెప్పాలంటే సంస్కృత వాఙ్మయం తెలిసి ఉండాలి. నిశిత పరిశీలన కావాలి. అన్వయం చెప్పగలిగి ఉండాలి. వేదాంతం, తర్కం, ఛందస్సు తెలిసుండాలి. కాబట్టి దీన్ని అంత తేలికగా తీసేయకు" అని చెప్పేవారు. పదిహేడవ యేట తాత కాలం చేశారు. ఆయన దూరమైనా ఆయన సంకల్పం మాత్రం ఎప్పుడూ చంద్రశేఖర శాస్త్రిని అంటిపెట్టుకునే ఉంది. కొంత కాలం తరువాత బెజవాడ వెళ్లి వేదాంత శాస్త్రం చదవాలనే కోరికతో అమరావతి నుంచి గుంటూరు వెళ్ళారు. బస్టాండు కొచ్చాక పరిచయస్థులు కొందరు కనిపించి "పుష్పగిరి పీఠాధిపతులు ఇప్పుడు నరసరావు పేటలో ఉన్నారు. త్వరలో ఆయన మకాం మార్చేస్తారట. ఈలోగా నువ్వొకసారి వెళ్లి ఆయన దర్శనం చేసుకోవచ్చు" అని సలహా ఇచ్చారు. దాంతో వెంటనే నరసరావు పేటకు వెళ్ళి,స్వాముల వారి దర్శనం చేసుకోగానే పీఠాధిపతులు 'నువ్వు అమరావతిలో పురాణ ప్రవచనం చక్కగా చెప్పావని తెలిసింది. నాకు కూడా వినాలని ఉంది, ఇవ్వాళ ఇక్కడ పురాణం చెప్పు" అన్నారు. ఆ మాటలను ఆదేశంగా తీసుకుని ఆయన ముందు వాల్మీకి రామాయణం చెప్పారు. స్వామివారు చాలా సంతోషించి, నెలకు 40 రూపాయల గ్రాసం మీద పుష్పగిరి ఆస్థానంలో పురాణ పండితునిగా నియమించారు. ఆయనతో పాటే ఊరూరా తిరుగుతూ ఏడాదిన్నర పాటు చంద్ర శేఖర శాస్త్రి పురాణ ప్రవచనం చెప్పారు. తర్వాత పెత్తండ్రి మల్లాది వీరరాఘవ శాస్త్రి బెజవాడలో బ్రహ్మ సత్రయాగం జరుపుతుంటే ఆయన కోరిక మేరకు అక్కడ సుమారు సంవత్సరం పాటు ప్రవచనం చేశారు. ఆయన ఇరవై అయిదవ ఏట సీతారామ ప్రసన్నతో వివాహం జరిగింది. సరిగ్గా ఏడాది తర్వాత అంటే 1951లో ఆయనకు కొడుకు పుట్టాక తాతపై గల గౌరవంతో, జ్ఞాపకార్థం రామకృష్ణ అని పేరుపెట్టు కున్నారు. దివంగత ప్రధాని పాముల పర్తి నరసింహారావు, దివంగత ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, వంటి రాజకీయ ప్రముఖులతో పాటు చిత్తూరు వి.నాగయ్య, ఘంటసాల, ఎస్వీరంగారావు, కన్నాంబ వంటి వెండితెర నటీ నటులు ఆయన ప్రవచనాలను ఎంతో ఇష్టపడేవారు. ఒక సందర్భంలో చిత్తూరు నాగయ్య ఇంటికి పిలిచి భోజన వస్త్రాలతో సత్కరించి, చేతికి స్వర్ణకంకణం తొడగడం శాస్త్రి మరచి పోలేని జ్ఞాపకం. చాలామంది సినిమాలలో నటించమని అడిగితే ఇష్టం లేక తిరస్కరించారు. ఆయన ప్రవచనం చెబుతుండగా శ్రోతలు వింటున్నట్లుగా ఉండే దృశ్యాన్ని చిత్రీకరించాలని కొందరు దర్శకులు ప్రయత్నాలు చేసినా, ఎందుకనో అది కూడా వీలు పడక పోవడం యాదృచ్ఛికం. వందలాది రామాయణ, మహాభారత, భాగవత ప్రవచనాలూ నిర్వహించడమే కాకుండా, ప్రతియేటా ఉగాది నాడు పంచాంగ శ్రవణం చేసేవారు. దూరదర్శన్‌లో, సప్తగిరి చానల్‌లో ప్రవచనాలు కొనసాగించే ప్రయత్నం చేశారు. వయసు మీద పడుతుండడంతో, శారీరక శక్తి సన్నగిల్లి, ప్రయాణాలు చేయ లేకుండా ఉన్న కారణంగా 2011 జనవరి నుంచి పురాణ ప్రవచనాలు చెప్పడం క్రమంగా తగ్గించారు. శ్రీవేంకటేశ్వర భక్తిచానల్, సప్తగిరి చానల్ వారు తమ చానల్‌లో ప్రవచనం చెప్పవలసిందే అని పట్టు బట్టడంతో తమ ఇలవేల్పు పట్ల ఉన్న భక్తి, గౌరవం మేరకు వారిని కాదనలేక పోయారు. శోకరసమైతే దుఖంలో దుఃఖ సాగరంలో, హర్ష దాయకమైతే ఆనందంతో మమేకమై పరవశించి పోయే ఆయన ప్రవచనంలో లీనమయ్యే తీరు దశాబ్దాల ప్రవచన కాలంలో శ్రోతల, ప్రేక్షక జన బాహు ళ్యానికి సన్నిహితంగా ఉంచింది. మల్లాది చంద్రశేఖర శాస్త్రి సుదీర్ఘ పురాణ ప్రవచన ప్రస్థానంలో ఎందరో ప్రముఖులు, ప్రముఖ సంస్థలతో లెక్కలేనన్ని సన్మానాలు, సత్కారాలు, బిరుదులు పొందారు. అందులో ప్రముఖంగా తిరుమల తిరుపతి దేవస్థానాలలో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో స్వామి వారి కల్యాణ వ్యాఖ్యాతగా అభినవ వ్యాస బిరుదును పొందారు. శృంగేరి పీఠాధిపతి చంద్రశేఖర స్వామి ఆశీర్వచనంతో సవ్యసాచి బిరుదును, భీముని పట్నం సద్గురు శివానందమూర్తి నెలకొల్పిన సనాతన ధర్మట్రస్ట్ ద్వారా ఎమినెంట్ సిటిజన్ అవార్డును అందుకోవడమే కాక మాజీ ప్రధాని పి.వి నరసింహారావుతో సత్కారం అందుకున్నారు. 2005లో ప్రతిష్ఠాత్మక రాజా–లక్ష్మీ అవార్డు ద్వారా వచ్చిన లక్ష రూపాయల నగదును సనాతన ధర్మట్రస్టుకు విరాళమిచ్చారు. పురాణ ప్రవచన సాంప్రదాయం కొనసాగాలనే తపనతో, ఎందరో శిష్యులను తమ ఆశయానికి అనుగుణంగా తీర్చిదిద్దిన పరమ భాగవతోత్తములు చంద్రశేఖర శాస్త్రి... 96 ఏళ్ళ వయసులో జనవరి 14, 2022న వయోభారంతో పాంచభౌతిక కాయాన్ని వదిలి శివైక్యం చెందారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**


## ప్రతిభా శాలియైన ఆర్థిక వేత్త సి.డి.దేశ్‌ముఖ్ - జనవరి 14... తొలి రిజర్వు బ్యాంకు గవర్నర్ సి.డి.దేశ్‌ముఖ్ జయంతి



సి.డి.దేశ్‌ముఖ్ (జనవరి 14, 1896 – అక్టోబరు 2, 1982) పూర్తి పేరు చింతమన్ ద్వారకానాథ్ దేశ్‌ముఖ్ స్వతంత్ర భారత దేశపు తొలి రిజర్వ్ గవర్నర్‌గా నియమితులైన తొలి భారతీయుడిగా సిడి దేశ్‌ముఖ్‌ను ఎప్పటికీ గుర్తుంచు కుంటారు. భారతీయ నాటి కరెన్సీపై సిడి దేశ్ ముఖ్ సంతకాన్ని చూడవచ్చు. భారతీయ రిజర్వ్ బాంక్ మూడవ గవర్నర్, 1943, ఆగష్టు 11 నుంచి 1949, జూన్ 30 వరకు ఈ పదవిని నిర్వహించారు. ఆ తర్వాత దేశ్‌మఖ్ భారత దేశానికి ఆర్థిక మంత్రిగా నియమితులైనారు. అంతర్జాతీయ ద్రవ్యనిధిలో సంవత్సరానికి 30వేల డాలర్ల వేతనం కాదని దేశసేవకే తన జీవితాన్ని ఆయన అంకితం చేసిన గొప్ప సామాజిక సేవకుడు. ప్లానింగ్ కమిటీ సభ్యుడుగా ఉంటూనే ఆర్థికమంత్రిగా ఉన్నా ప్రతిభాశాలి. బొంబాయి నగరాన్ని కేంద్రం అధీనంలో ఉంచడం ఇష్టపడక దేశ్‌ముఖ్ మంత్రి పదవికి రాజీనామా చేసిన నిబద్ధత కలిగిన రాజకీయ నాయకులు. భారత ఆర్థికమంత్రులలో సి.డి. దేశ్‌ముఖ్ అత్యంత ప్రతిభావంతుడు. ఆయన హయాంలో దేశంలో విదేశీ మారక కొరతలేదు. లోటు బడ్జెటు ప్రస్తావన రాలేదు. ద్రవ్యోల్బణం రేటు వెర్రితలలు వేయలేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో మన రూపాయి విలువ తగ్గలేదు. ఇండియన్ సివిల్ సర్వీస్ సభ్యుడైన దేశ్‌ముఖ్ కు 1939 నుంచే రిజర్వ్ బ్యాంక్తో సంబంధం ఉంది. 1941లో రిజర్వ్ బ్యాంక్ డిప్యూటి గవర్నర్ గా నియమించ బడ్డారు. 1943లో. ఆ తర్వాత జేమ్స్ టేలర్ నుంచి 3 వ గవర్నర్ గా బాధ్యతలు తీసుకున్నారు. దేశ్‌ముఖ్ గవర్నర్ గా ఉన్న సమయంలో ప్రపంచంలో ముఖ్యమైన ఆర్థిక పరిణామాలు సంభవించాయి. 1943లో రిజర్వు బ్యాంకు గవర్నర్ టెయిలర్ మరణించగా, డిప్యూటీ గవర్నరుగా ఉన్న సి.డి. దేశ్‌ముఖ్‌ని ఏకగ్రీవంగా గవర్నరుగా ఎన్నుకున్నారు. రిజర్వు బ్యాంక్ గవర్నరుగా దేశ్‌ముఖ్ దేశానికి ఎంతో సేవ చేశారు. జూలై 1944లో జరిగిన బ్రెట్టన్ వుడ్స్ సమావేశంలో అతడు కూడా భారత దేశం తరపునన పాల్గొన్నారు. ఈ సమావేశమే అంతర్జాతీయ ద్రవ్య సంస్థ , ప్రపంచ బ్యాంకు ఏర్పడడానికి కారణమైంది. ఈ రెండు సంస్థల లోనూ దేశ్‌ముఖ్ బోర్డ్ ఆఫ్ గవర్నర్ గా పదేళ్ళ పాటు పనిచేశారు. 1950లో పారిస్లో జరిగిన ఈ రెండు సంస్థల వార్షిక సంయుక్త సమావేశంలో ఇతడు చైర్మెన్ గా వ్యవహరించారు. 1945లో సిమ్లా సమావేశంలో వైస్రాయ్ సభ సభ్యులంతా భారతీయులే ఉండాలని తీర్మానించారు. ఆ జాబితాలో ఆర్థిక సభ్యుడుగా దేశ్‌ముఖ్ పేరు వేయాలని ప్రయత్నించారు. కానీ దేశ్‌ముఖ్ తనకు రాజకీయాలు పడవని తప్పించు కున్నారు. 1950లో ప్లానింగ్ కమిషన్ ఏర్పడింది. ఆ బాధ్యత దేశ్‌ముఖ్ మీద పడింది. అదే సంవత్సరం డా. జాన్ మత్తయ్ ఆర్థికమంత్రిగా రాజీనామా ఇచ్చినప్పుడు దేశ్‌ముఖ్ ఆ స్థానం పొందారు. ప్లానింగ్ కమిటీ సభ్యుడుగా ఉంటూనే ఆర్థికమంత్రిగా ఉన్నారు. 1953 జనవరి 22న దేశ్‌ముఖ్ వివాహం దుర్గాబాయి తో జరిగింది. అది దేశంలో గొప్ప సంచలనం సృష్టించింది. వారి పెళ్లిపత్రంపై నెహ్రూ, కృపలానీ దంపతులు సాక్షులుగా సంతకాలు చేశారు. దుర్గాబాయ్‌తో వివాహం జరిగిన తర్వాత మొదటి జన్మదినాన్ని ఆయన తన ఇంట్లో చాలా నిరాడంబరంగా జరుపు కున్నారు. ఈ సంగతి నెహ్రూకు తెలిసి, తీరిక చేసుకొని నెహ్రూ వాళ్ల ఇంటికి వెళ్లారట. 'ఏం దుర్గాబాయ్! దేశ్‌ముఖ్ నీ భర్తే కావచ్చు.. నా క్యాబినెట్ మంత్రి సుమా!' అని చమత్కరించారట. ఆ దంపతులు ఇచ్చిన టీ బిస్కెట్ తీసుకుని నెహ్రూ మందహాసంతో వెళ్లిపోయారట. ఇలాంటి ఆప్యాయత ఈ రోజుల్లో కనిపించడం అరుదు. తన నియోజకవర్గం ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా బొంబాయి నగరాన్ని కేంద్రం అధీనంలో ఉంచడం ఇష్టపడక దేశ్‌ముఖ్ మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఆయన ఢిల్లీ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్‌గా ఆరేళ్లు చేశారు. దేశ్‌ముఖ్ సేవలను అంతర్జాతీయ ద్రవ్యనిధి వినియోగించు కోవాలని కోరినప్పుడు అందుకు ఆయన అంగీకరించ లేదు. అప్పటికే దేశ్‌ముఖ్ దంపతులు సంక్షేమ కార్యక్రమాలను దేశమంతా విస్తరించి ఉన్నారు. సంవత్సరానికి 30వేల డాలర్ల వేతనం కాదని దేశసేవకే తన జీవితాన్ని ఆయన అంకితం చేశారు. ఇన్ని ఉద్యోగాలు చేసిన ఆయన ఎల్లప్పుడూ నిర్ధనుడే. కూడబెట్టిన ధనమంతా పూణేలో ఉన్న ఇల్లు మాత్రమే. 1952లో దేశ్‌ముఖ్ విద్యనభ్యసించిన కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయపు జేసస్ కళాశాల నుంచి గౌరవ ఫెలోగా ఎన్నికైనారు. 1959లో ప్రభుత్వ సర్వీసు రంగంలో రామన్ మెగ్సేసే అవార్డును పిలిప్పీన్స్ కు చెందిన జోస్ అగ్విలార్ తో కల్సి సంయుక్తంగా పొందారు. 1975లో భారత ప్రభుత్వం పద్మ విభూషణ పురస్కారంతో సత్కరించగా, అదే సంవత్సరం ఆయన సతీమణి దుర్గాబాయి దేశ్‌ముఖ్ కూడా పద్మ విభూషణ్ పొందడం, భార్యా భర్తలు ఇద్దరూ ఒకే ఏడాది పురస్కార గ్రహీతలు కావడం విశేషం. 1982, అక్టోబరు 2న మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

## ఆంధ్రా భీష్మాచార్యులు న్యాపతి సుబ్బారావు - జనవరి 14 ...న్యాపతి సుబ్బారావు పంతులు 170 వ జయంతి



చికాగో సర్వ ధర్మ సమ్మేళనంలో పాల్గొని, భారత దేశానికి తిరిగి వచ్చిన స్వామి వివేకానంద యోగి పుంగవుడు మద్రాసు రేవులో కాలిడ గానే ఆయనను పూల మాలాలంకృతుల గావించి సాదరంగా ఆహ్వానించే అవకాశాన్ని పొందిన వ్యక్తి న్యాపతి సుబ్బా రావు. అంతేకాదు... వివేకానందుని ఆహ్వాన సభకు అధ్యక్షత వహిం చిన అరుదైన గౌరవం దక్కించు కున్న అదృష్ట వంతులు ఆయనే. భారతదేశములో ఒక విశిష్ట స్థానం కలిగి, దక్షిణ భారత దేశములో ఎక్కువ ప్రచురణ కలిగిన పత్రికగా, ప్రాచుర్యంలో ఉన్న ది హిందూ ఆంగ్ల దినపత్రికకు పత్రికను స్థాపించి ఇప్పటికి సుమారు 120 సంవత్సరాలు దాటింది. ఈ పత్రిక ఎలా ప్రారంభించ బడింది అంటే...తిరువయ్యారుకు చెందిన 23 ఏళ్ళ జి. సుబ్రమణియ అయ్యర్, ఆయన స్నేహితుడు, పచ్చయ్యప్ప కళాశాలలో ఆయన సహోద్యోగి, చెంగల్పట్టుకు చెందిన 21 ఏళ్ళ ఎం. వీరరాఘవా చారియర్ – నలుగురు న్యాయ శాస్త్ర విద్యార్థులు టి.టి. రంగాచారియర్, పి.వి. రంగా చారియర్, డి.కేశవ రావు పంత్, న్యాపతి సుబ్బారావు పంతులు (హిందూ స్థాపకుల్లో ఆంధ్రుడు) – వీళ్ళందరూ ట్రిప్లికేన్ సాహితీ సంఘం సభ్యులు. ఈ సంఘం అప్పటి బ్రిటిష్ ప్రభుత్వ నిరంకుశ వైఖరుల గురించి ప్రజలకు అవగాహన కలిగించడం, బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టడం లక్ష్యాలుగా ఏర్పడింది. ట్రిప్లికేన్ సిక్స్ అని పేరుబడ్డ ఆ ఆరుగురు యువకులు మొదట న్యూస్‌పేపర్ అనే సైక్లోస్టైల్ పక్షపత్రికను ప్రారంభించారు. చెన్నైలో ఆ పత్రికకు మంచి స్పందన లభించడంతో హిందూను వారపత్రికగా ప్రచురించడం మొదలు పెట్టారు. ది హిందూ పత్రిక స్థాపన సెప్టెంబర్ 20, 1878న జరిగినట్లు పేర్కొంటారు. అలా ది హిందూ ఆంగ్ల పత్రిక స్థాపనలో ఒక తెలుగు వారు ఉండడం విశేషం. ఏ ఐ సీ సీ ప్రధాన కార్యదర్శిగా నాలుగు పర్యాయాలు పని చేశారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆంధ్ర భీష్మ బిరుదాంకితులు, ప్రసిద్ధి స్వాతంత్ర్య సమర యోధుడు, సంస్కరణవాది, సాహిత్యవేత్త, పాత్రికేయుడు, న్యాపతి సుబ్బారావు పంతులు (1856, జనవరి 14 – 1941, జనవరి 15) మకర సంక్రాంతి రోజున నెల్లూరులో రాఘవరావు, రంగమ్మ దంపతులకు జన్మించారు. ఆ తరువాత కుటుంబం రాజ మండ్రికి మారింది. బాల్యం నుండే సుబ్బరావు విషయ పరిజ్ఞాన సముపార్జన పట్ల అమిత జిజ్ఞాస కలిగి ఉండి పేదరికం కారణంగా వీధిలాంతర్ల మసక వెలుతులో చదువు కొనసాగించారు. మెట్రిక్యు లేషన్ పాస్ అయ్యి అనంతరం మద్రాసు క్రైస్తవ కళాశాలలో చేరి స్కాలర్‌షిప్ సహాయంతో చదువుకుని 1876లో బిఎ డిగ్రీ పొందాడు. అనంతరం అధ్యాప కునిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించాడు. బోధనా వృత్తిలో కొనసాగుతూనే న్యాయవాద విద్యను అభ్యసించి 1879లో లా పట్టాను పొందాడు. ఉపాధ్యా యునిగా పనిచేస్తూ న్యాయవాద పట్టాను పొందటం అప్పట్లో అరుదైన విషయం. ఈ ఖ్యాతిని సాధించిన దక్షిణ భారత దేశం లోని అతి కొద్దిమందిలో ఒకరిగా కోస్తా జిల్లాల్లో తొలి వ్యక్తిగా ఆయన చరిత్ర సృష్టించారు. న్యాయ విద్యార్థిగా ఉండగానే 22 ఏళ్ళ ప్రాయంలో ఆయన ట్రిప్లికేన్ సిక్స్‌గా పిలువబడే నాటి సాహిత్య సంఘం సభ్యులు మరో ఐదుగురు సభ్యుల మిత్ర బృందంతో కలసి, జాతీయో ద్యమానికి సహకరించే ఉదాత్త లక్ష్యంతో, ది హిందూ జాతీయ ఆంగ్ల దినపత్రికను స్థాపించారు. అప్పట్లో భారత దేశంలో ప్రచురిత మయ్యే ఆంగ్ల పత్రికలన్నీ బ్రిటీష్ ప్రభుత్వం కనుసన్నలలోనే ఉండేవి. ఉమ్మడి మద్రాసు రాష్టంలో సుబ్బా రావు గౌరవ న్యాయమూర్తి గా, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేశారు. 1880లో న్యాపతి సుబ్బారావు మద్రాసు నుంచి రాజమండ్రి తిరిగివచ్చి అక్కడే స్థిరపడ్డారు. మరో 9 మంది న్యాయ వాదులతో కలిసి రాజమండ్రి బార్ అసోషి యేషన్ స్థాపించారు. రాజమండ్రిలో సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగంతో సన్నిహితంగా మెలగేవారు. వితంతు పునర్వి వాహాలు జరిపించడంలో వీరేశలింగానికి సుబ్బారావు పంతులు ఎంతగానో సహక రించారు. 1881లో స్థాపితమైన హితకారిణి సమాజం యొక్క మొదటి కార్యదర్శిగా నియమించ బడి నిర్వహణలో, కార్యకలాపాల విస్తరణలో విలువైన సేవలందిం చారు. 1885లో రాజమండ్రి పురపాలక సంఘానికి తొలి అనధికార ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. 1888 వరకూ ఆయన ఆ పదవిలో కొనసాగారు. ఆయన హయాంలోనే రాజమండ్రి ప్రజలకు తొలిసారి నల్లాల కనెక్షన్లు మంజూరు చేశారు. 1893లో ఆయన మద్రాసు ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు సభ్యునిగా ఎన్నికై సర్కారు జిల్లాలకు ప్రాతినిధ్యం వహించారు. ఈ పదవిలో ఆయన వరుసగా మూడు పర్యాయాలు ఎన్నికై 1899 వరకు కొనసాగారు. 1896లో ఆయన రాజమండ్రి లోని టౌన్ హాల్ ట్రస్టుబోర్డు కమిటీ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. కలకత్తాలోని టౌన్ హాలు తర్వాత దేశంలో అంతటి ప్రాముఖ్యత రాజమండ్రి టౌన్ హాల్‌కు ఉంది. దీనిని కందుకూరి వీరేశలింగం పంతులు స్థాపించటం వెనుక న్యాపతి వారి సహకారం ఎంతో ఉంది. సుబ్బారావు పంతులు రాజమండ్రి ఎలక్ట్రిక్ సప్లై కార్పొరేషన్‌ను స్థాపించి, విద్యుదు త్పాదన చేయడమే కాక తొలిసారిగా రాజమండ్రికి ఆ విద్యుత్ ను సరఫరా చేసి వెలుగులు నింపాడు. 1893లో ఆయన రాజమండ్రిలో చింతామణి పత్రికను పునరుద్ధరించి ప్రజలకు అందుబాటు లోకి తెచ్చారు. ఈ పత్రికకు కందుకూరి వీరేశలింగం పంతులు ఎడిటర్‌గా వ్యవహ రించారు. రచయితల్ని ఆర్థికంగా ప్రోత్సహించటం లక్ష్యంగా సుబ్బా రావు పంతులు నవలారచన అంశంగా వివిధ పోటీలు నిర్వహించే వారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం రచనా వ్యాసంగానికి సుబ్బారావు నైతికంగా, ఆర్థికంగా ఎంతో సహకరించారు. అదేవిధంగా హరికథ పితామహ ఆదిభట్ల నారాయణ దాసును రాజమండ్రి, పరిసర ప్రాంతాలకు పరిచయం చేసినది కూడా ఆయనే. 1922 ప్రాంతంలో రాజమండ్రిలో ఆంధ్ర చారిత్రక పరిశోధనా సంస్థ (ఇప్పుడు రాళ్ళబండి సుబ్బారావు పురావస్తు ప్రదర్శనశాలగా ఉన్నది) ఏర్పాటును న్యాపతి సుబ్బారావు పంతులు ఎంతగానో ప్రోత్సహించారు. 1897, ఫిబ్రవరి11న స్వామి వివేకానంద అంతర్జాతీయ మతాల సమావేశంలో ప్రసంగించి భారత దేశం తిరిగివస్తున్న సందర్భంలో ట్రిప్లికేన్ సిక్స్ మిత్రబృందం ఆయన్ను ఆహ్వానించ డానికి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున పురజనులు హాజరైన ఆ సమావేశంలో వివేకానందుని ఆహ్వాన సంఘానికి న్యాపతి సుబ్బారావును అధ్యక్షునిగా నియమించారు. వివేకానందుడు మద్రాసు రేవులో దిగగానే పూలమాల వేసి ఆహ్వానించిన తొలి వ్యక్తి సుబ్బారావే. ఆ మరు సటి రోజు విక్టోరియా హాల్లో వివేకానందునికి ఆహ్వాన సభ ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి14న మెరీనా బీచ్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో వివేకానందునితో పాటు సుబ్బా రావు పంతులు వేదికను అలంకరించారు. అలా ప్రారంభమైన వీరి స్నేహం సుబ్బా రావుపై గాఢమైన ప్రభావాన్ని వేసింది. 1903లో వివేకానందుని స్ఫూర్తితో, సుబ్బారావు రాజమండ్రి లో భగవద్గీత, సనాతన హిందూధర్మ ప్రచారానికై, హిందూ సమాజం అనే సంస్థను స్థాపించారు. 1898 నుంచి 1917 వరకూ భారత జాతీయ కాంగ్రెస్‌లో ఆయన కీలకమైన భూమికను పోషించారు. 1907లో వందేమాతర ఉద్యమ సందర్భంగా బిపిన్ చంద్రపాల్‌ను రాజమండ్రి ఆహ్వానించి అక్కడ ఉపన్యాసాలు ఇప్పించారు. విజయ వాడలో 1914 ఏప్రిల్ 11వ తేదీన జరిగిన రెండవ ఆంధ్ర మహాసభకు ఆయన అధ్యక్షత వహిస్తూ, మద్రాసు నుంచి ఆంధ్ర రాష్ట్ర విభజన కోసం చారిత్రాత్మకమైన పిలుపు నిచ్చారు. 1918 జనవరి 1వ తేదీన సుబ్బారావు పంతులు డిమాండ్ మేరకు ఆంధ్రప్రాంతానికి ప్రత్యేక ప్రాంతీయ కాంగ్రెస్ కౌన్సిల్‌ను అధిష్టానం ఏర్పాటు చేసింది. ఈ మండలికి న్యాపతి సుబ్బారావు పంతులు అధ్యక్షుడ య్యారు. అంతేగాక ఆయన అఖిలభారత కాంగ్రెసు కమిటీ ప్రధాన కార్యదర్శిగా నాలుగు పర్యాయాలు ఎన్నికై సేవలందిం చారు. సుబ్బారావు పంతులు 1941, జనవరి 15వ తేదీన మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# ఆరోగ్య భద్రతకు ఆరు సూత్రాలు



పరిగి : మహిళలు వివిధ రంగాల్లో ఎదిగేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తోంది. వడ్డీలేని రుణాలు అందిస్తూ ఆర్థిక ప్రగతికి తోడ్పడుతోంది. దీంతో వేలాది కుటుంబాలు స్వశక్తితో జీవిస్తూ జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకుంటున్నారు. పిల్లలను చక్కగా చదివిస్తున్నారు. పొదుపు ఒక్కటే ముఖ్యం కాదని, ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో కిశోర బాలికలకు సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా వివిధ అంశాలపై ప్రత్యేకించి పుస్తకాలు ముద్రిస్తోంది. వాటిని తల్లులు, పిల్లలకు ఇవ్వడం ద్వారా ఆరోగ్య విషయాలను తెలుసుకునేందుకు ఉపయోగపడనుంది. జిల్లాలో 657 గ్రామ సమాఖ్యల పరిధిలో 13,116 మంది కిశోర బాలికలున్నారు.

స్నేహ సంఘాలుగా నామకరణం..

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(సెర్ప్) ఐసీడీఎస్‌తో కలిసి పనిచేస్తోంది. 15-18 ఏళ్ల వయసున్న బాలికల కోసం ఏర్పాటు చేస్తున్న సంఘాలకు స్నేహ(ఎస్-సేఫ్టీ, ఎన్-న్యూట్రిషన్, ఈ-ఎంపవర్‌మెంట్, హెచ్-హెల్త్, ఎ-అడొలొసెన్స్) సంఘాలుగా నామకరణం చేసింది. గ్రామస్థాయి అనంతరం మండల, జిల్లాస్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారు.

**పలు అంశాలపై...**

కౌమార దశలో శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. అవగాహన లేమితో ఆందోళన పడుతుంటారు. మార్పులపై అవగాహన కల్పించనున్నారు. ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారు.

బాలల హక్కులు- సంరక్షణ, విద్యా నైపుణ్యాలు, ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు చేపడుతున్న పథకాలను వివరిస్తారు.

లింగపరమైన వివక్షను రూపుమాపేందుకు కృషి చేస్తారు. ఆడ, మగ సమానమన్న భావన కలిగిస్తారు. మానవ అక్రమ రవాణా, పరిణామాలపై అవగాహన

బాల్యవివాహాలతో జరిగే అనర్థాలను కళ్లకు కట్టినట్లు చెబుతారు.

ఆరోగ్యపరంగా ఎదురయ్యే సమస్యలపై చైతన్యం తెస్తారు.

పోషకాహార లోపంతో ఉత్పన్నమయ్యే సమస్యలు, వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుపుతారు. రక్తహీనతను ప్రత్యేక పట్టిక ద్వారా వివరిస్తారు.

కిశోర బాలికల్లో సహజంగా ఆత్మన్యూనతా భావం ఉంటుంది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారిలో ఇది స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామ, మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. నాయకత్వ లక్షణాలు పెంపొందేలా ప్రోత్సహిస్తారు.

**విద్య, ఆరోగ్య విషయాలపై...**

– శ్రీనివాస్, డీఆర్డీఓ, వికారాబాద్

కిశోర బాలికల్లోని భయాన్ని పోగొట్టడం, విద్య, ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించడం కోసం స్నేహ సంఘాలను ఏర్పాటు చేస్తున్నాం. మండల స్థాయిలోనూ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తాం.

# పుర బరి.. పార్టీల గురి

పరిగి: పురపాలిక ఎన్నికలపై ఆయా ప్రధాన పార్టీలు గురి పెట్టాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను విశ్లేషించుకున్న నాయకులు.. పుర బరిలో సమర్థులను నిలిపేందుకు సమాయత్తమవుతున్నారు. ఎలాగైనా అధ్యక్ష పీఠం దక్కించుకోవాలని ఉత్సుకత చూపుతున్నాయి. ఇందుకోసం పార్టీలో మంచి పేరు, వ్యక్తిత్వం కలిగిన వారిని ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యాయి. పార్టీ బలం కొంత తోడైతే వ్యక్తిగతం కలిసి వస్తే విజయానికి బాటలు పడతాయని భావిస్తున్నాయి. ఈ క్రమంలోనే పార్టీ సమావేశాలను నిర్వహిస్తూ ఆశావహుల అభిప్రాయాలు కోరుతున్నాయి. ఛైర్మన్ పీఠాన్ని దక్కించుకుంటే పట్టణ ప్రాంతాలపై మరింత పట్టు ఉంటుందని, రానున్న ఎన్నికల్లోనూ సత్తా చాటేందుకు అవకాశముంటుందని నాయకులు అంటున్నారు.



**ఖర్చులు ఎలాగబ్బా..**

ఛైర్మన్ పదవిని ఆశిస్తున్న వారు మిగతా సభ్యుల ఎన్నికకు కొంత ఆర్థికంగా సాయపడాలని చెబుతుండడంతో ఆశావహుల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లు మారుతోంది. భారాస, కాంగ్రెస్ పోటాపోటీగా సమావేశాలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నాయి. పరిగి, కొడంగల్ ప్రాంతాల్లో భాజపా పట్టు లేకపోవడంతో తాండూరు, వికారాబాద్ ప్రాంతాల్లో కనీసం కొన్ని వార్డు స్థానాల్లోనైనా పోటీ చేయాలని ప్రణాళిక రచిస్తోంది. ఎవరికి వారు ఖర్చులు పెట్టుకుంటే భారం ఉండదని భావిస్తున్నా.. ఛైర్మన్ పదవి ఎంపిక విషయంలో తేడాలొస్తే ఇబ్బందికరమని అంతర్గతంగా ఆలోచనలో పడ్డారు.

# వలస ఉపాధి.. బతుకులు సమాధి

మిర్యాలగూడ :వారంతా ఎక్కడో పుట్టారు..బతుకుదెరువు కోసం..రాష్ట్రం కాని రాష్ట్రానికి వచ్చారు. అక్కడి నుంచి మరో రాష్ట్రానికి పనిపై వెళ్తూ మధ్యలోనే మృత్యు ఒడికి చేరుకున్నారు. తమ భార్యా, పిల్లలు, తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని భాష కాని భాష మాట్లాడే ప్రాంతానికి వలస వచ్చి ప్రమాదాలతో మధ్యలోనే ఆరిపోతున్న వలస దీపాలు ఉమ్మడి జిల్లాలో ఎన్నో ఉన్నాయి.

శుక్రవారం మిర్యాలగూడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బిహార్‌కు చెందిన ముగ్గురు వలస కూలీలు మృతి చెందడంతో పాటు మరో ముగ్గురికి గాయాలు కావడంతో వారి కుటుంబాలకు తీరని అన్యాయం జరిగింది. వీరిలో ఒకరికి భార్య, ఐదుగురు సంతానం కాగా మరొకరికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంకో యువకుడు అవివాహితుడు.



భార్య, పిల్లలకు ఏ లోటు రాకుండా చూసుకోవాలని ఎన్ని కష్టాలు పడినా ఇక్కడే ఉండి పనులు చేసుకుంటున్న ఆ కూలీల ఆశలను రోడ్డు ప్రమాదం చిన్నాభిన్నం చేసింది. మరోవైపు తన తల్లిదండ్రులను పోషించుకునేందుకు పద్దెనిమిదేళ్ల యువకుడు ఇక్కడికి వచ్చి కష్టపడటం కాలానికి నచ్చలేదేమో..అతడినీ బలి తీసుకుంది.

చలి నుంచి రక్షణ కోసమో..మరేదైనా కారణమో కానీ..మార్బుల్ రాళ్ల ముందు పడుకుంటే అకస్మాత్తుగా బ్రేక్ వేస్తే ముందుకు వస్తాయని గ్రహించలేకపోయారో కానీ ఈ ప్రమాదంలో మార్బుల్స్ యమ కింకరుల్లా దూసుకొచ్చి వారి ఆశలను కాలగర్భంలో పడేశాయి. భార్యా, పిల్లలు చూసేందుకు సైతం ఇబ్బంది పడే స్థితిలో శరీర అవయవాలు బయటకు వచ్చేలా సంభవించిన ఈ మరణం వారి కుటుంబాలకు తీరని శోకం మిగిల్చింది.

# కక్కుర్తి.. వయా 'మద్య'వర్తి..!



సూర్యాపేట : శాంతిభద్రతలను పరిరక్షస్తూ..అక్రమ వ్యాపారాలను అరికట్టేందుకు పోలీస్ యంత్రాంగం విశేష కృషి చేస్తోంది. ప్రజలకు చక్కటి సేవలు అందించాలని ఉన్నతాధికారులు పదేపదే సమావేశాల్లో చెబుతున్నా.. కొంత మంది సిబ్బంది దారి తప్పి కాసుల వేటపై దృష్టిసారించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని చాలా మండలాల్లోని పోలీసులు మద్యం దుకాణాల నుంచి మామూళు తీసుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. సర్కారు వారికి నెలనెలా జీతం బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లుగా..దుకాణాదారులు ముడుపులు ముట్టజెప్పాల్సిందే అన్న ప్రచారం జరుగుతోంది. ఇందుకు ఒక వ్యక్తి మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.

**అంతా చూసుకుంటాం:** గత డిసెంబరు 1 నుంచి కొత్త మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 329 ఉన్నాయి. వీటి వద్ద అల్లర్లు..ఇంకేమైనా జరిగితే కూడా మీకు ఏం కాకుండా మేమే చూసుకుంటామని..అందుకు మీరు నెలనెలా కొంత ఇస్తే సరిపోతుందని కొన్ని మండలాల్లోని ఎస్‌హెచ్‌వోలు మద్యం దుకాణదారులతో బేరసారాలు కుదుర్చుకున్నట్లు తెలిసింది.

మండలాల్లో ఉన్న ఒక్కో దుకాణం నుంచి రూ.20 వేల నుంచి 25 వేల వరకు ఇవ్వాలని..పట్టణ ప్రాంతాల్లోని వాటి నుంచి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు తీసుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. సూర్యాపేట డివిజన్ పరిధిలోని ఒక మండల కేంద్రంలోని దుకాణాల నుంచి అంతకు ముందు దుకాణాదారుల నుంచి నెలకు రూ.15 వేల వరకు తీసుకున్న పోలీసులు ఇప్పుడు రూ.20 వేల చొప్పున తీసుకుంటున్నారు. మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని పోలీసులు ఒక్కో దుకాణం నుంచి నెలకు రూ.25 వేల చొప్పున ఖరారు చేసుకుని ఆ డబ్బులను కూడా రెండు, మూడు నెలలకోసారి తీసుకుంటున్నట్లు సమాచారం. ఇలా ఉమ్మడి జిల్లాలో నెలకు దాదాపు రూ.60 లక్షల వరకు వసూళ్లకు పాల్పడుతున్నారు.

'మద్యం షాపుల నుంచి పోలీస్‌స్టేషన్లకు లంచాలు ఇస్తున్నట్లు సమాచారం లేదు. నెలవారీ మామూళ్లు అనేది ఎక్కడా లేదు. మద్యం దుకాణాల నుంచి పోలీసులకు లంచాలు ఇస్తున్నట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని' ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు.

**ఫిర్యాదుల పేరుతో..:**

ఇవ్వని వారుంటే ఒకటి, రెండు నెలల పాటు చూస్తారు. ఆ తర్వాత మధ్యవర్తిగా వ్యవహరించే వ్యక్తిని వారి వద్దకు పంపిస్తారు. అయినా వారు వినకుంటే రంగంలోకి దిగి మీ దుకాణం వల్ల ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందని..మందుబాబుల వల్ల చుట్టు పక్కల వ్యాపారులకు ఇబ్బందిగా మారుతుందనే ఫిర్యాదులు వస్తున్నాయని భయపెడుతూ తమకు అనుకూలంగా మార్చుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారమంతా ఉన్నతాధికారులకు తెలిసిందేనంటూ ప్రచారం కూడా జరుగుతోంది.


# బ'స్వాహా'రాజ్!!

నల్గొండ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'భూభారతి' పోర్టల్‌లోని 'ఎడిట్' ఆప్షన్ లొసుగులను ఆసరాగా చేసుకుని భూ రిజిస్ట్రేషన్ల రుసుం రూపంలో చెల్లించాల్సిన రూ.లక్షల సొమ్మును రూ.వందల్లోకి మార్చి ఖజానాకు 'గండి' కొట్టిన సీఎస్‌సీ సెంటర్ ఆపరేటర్ బస్వరాజును జనగామ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. జనగామ పోలీసులు, స్థానికుల కథనం మేరకు... యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం గౌరాయిపల్లికి చెందిన బస్వరాజుకు మీ సేవ తరహాలో పౌర, రెవెన్యూ సేవలు అందించేందుకు ఉద్దేశించిన కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ) ఐదేళ్ల క్రితం మంజూరైంది. నిబంధనల ప్రకారం అతను అక్కడే సేవలు అందించాల్సి ఉండగా.. ప్రస్తుతం యాదగిరిగుట్ట పట్టణంలో ఓ ప్రజాప్రతినిధి భవనం పక్కనే షట్టర్ అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్నాడు.

**జల్సాలు..విలాసాలు**

భూభారతి పోర్టల్‌కు సంబంధించి అతనికి ప్రత్యేకంగా సీసీఎల్‌ఏ నుంచి అనుమతులు లేకున్నప్పటికీ.. అధికార పార్టీకి చెందిన కొందరి అండదండలతో రెవెన్యూశాఖ వ్యవస్థను కుదిపేశాడు. జనవరి 7న జనగామ జిల్లా పోలీస్‌స్టేషన్‌లో స్థానిక తహసీల్దార్ ఇంద్రవెల్లి హుస్సేన్ సీఎస్‌సీ ఆపరేటర్ల అక్రమాలపై స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేయగా.. అందులో బస్వరాజ్ ప్రధాన భూమిక పోషిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. తహసీల్దార్ గుర్తించిన ఎనిమిది డాక్యుమెంట్లకు రూ.8.68 లక్షలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉండగా ఈ ఆపరేటర్ రూ.13,307 మాత్రమే చెల్లించినట్లు పోర్టల్‌లో, ఖజానాలో చూపిస్తోంది. భూభారతి పోర్టల్‌లో ఎడిట్ ఆప్షన్ సాధారణ సీఎస్‌సీ సెంటర్ ఆపరేటర్‌కు సరిదిద్దడం సాధ్యం కాదని, సీసీఎల్‌ఏ సిబ్బంది, స్థానిక రెవెన్యూ అధికారులతో పాటు రాజకీయ నాయకుల అండదండలు ఉంటే తప్ప ఒక ఆపరేటర్ ధైర్యంగా రూ.లక్షల్లో నిధులు కాజేసేందుకు ముందుకు రారని ఓ సీఎస్‌సీ సెంటర్ నిర్వాహకుడుతో పేర్కొన్నారు. ఏం జరిగింది నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్, వరంగల్ ఉమ్మడి జిల్లాలకు చెందిన పలు విలువైన భూముల రిజిస్ట్రేషన్ సమయంలో ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ విలువ ఆధారంగా రుసుం చెల్లించాల్సి ఉంటుంది. రూ.లక్షల్లో రుసుం చెల్లించాల్సి ఉన్న భూములకు భూభారతి పోర్టల్‌లో ఎడిట్ ఆప్షన్ వినియోగించుకుని రూ.వేలల్లో చూపించేలా మార్చేవాడు. వినియోగదారుల నుంచి రూ.లక్షలు తీసుకుని ప్రభుత్వ ఖజానాకు రూ.వందల్లో రుసుములు చెల్లించాడు. రెండు రోజుల నుంచి అతను నిర్వహిస్తున్న కేంద్రంలో సేవలు నిలిపివేయడంతో అతని బాధితులు లబోదిబోమంటున్నారు. తమ రిజిస్ట్రేషన్లు సక్రమంగా జరిగాయో లేదోనని ఆందోళనకు గురవుతున్నారు.

# ఇవ్వాలి.. నిరుద్యోగ భృతి



మిర్యాలగూడ : ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి తక్షణమే విడుదల చేయాలని ఉద్యోగార్థులు కోరుతున్నారు. అన్ని ఉద్యోగాలను నోటిఫికేషన్ ద్వారానే భర్తీ చేయాలని పదోన్నతుల ద్వారా భర్తీ చేయడం వల్ల తాము అవకాశాలు కోల్పోతున్నామని పలువురు వాపోయారు. మరో వైపు గ్రంథలయాల్లో మరుగుదొడ్లు సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధ్వర్యంలో నిర్వహించిన 'నిరుద్యోగులతో కాసేపు' కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడలోని మేరెడ్డి రాంచంద్రారెడ్డి స్మారక గ్రంథలయంలోని ఉద్యోగార్థులు పలు అంశాలు వెల్లడించారు.

**గ్రంథలయాల్లో వసతులు కల్పించాలి...** గ్రంథలయాల్లో సరిపడా సిలబస్ పుస్తకాలను అందుబాటులోకి తేవడంతో పాటు మరుగుదొడ్లు, ఇన్వర్టర్, మధ్యాహ్న భోజనం, మంచినీరు తదితర సౌకర్యాలు కల్పించాలని అభ్యర్థులు కోరుతున్నారు. కానిస్టేబుల్ ఉద్యోగ అర్హత పరీక్షలో నెగెటివ్ మార్కులు తొలగించడంతో పాటు జీవో 46ను సైతం తీసివేయాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలను మొత్తం నోటిఫికేషన్ల ద్వారానే భర్తీ చేయాలని డీఎస్సీ అభ్యర్థులు కోరుతున్నారు.

**నిరుద్యోగులతో కాసేపు..అభిప్రాయాలు ఇలా..**

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తగ్గించాలి. – కలకొండ రవి, నక్క వెంకటేష్.

గ్రూప్-4 ఉద్యోగాల్లో గణితం సిలబస్‌ను తగ్గించాలి. బీఈడీ అర్హత కలిగిన వారికి సైతం ఎస్జీటీ ఉద్యోగాలకు అనుమతించాలి.

– మంజుల, స్వాతి. ఉద్యోగ అర్హత వయస్సు పెంచడంతో పాటు ఉద్యోగ విరమణ వయస్సు తగ్గించాలి. – రాంబాబు, లవన్‌కుమార్.

కానిస్టేబుల్ ఉద్యోగ అర్హత పరీక్షలో నెగిటివ్ మార్కులు తొలగించడంతో పాటు జీవో సంఖ్య 46ను రద్దు చేయాలి. – స్వప్న, అశ్విని.

# స్కూల్ కాంప్లెక్స్‌లకు.. సాంకేతిక సొబగు..!

మధిర : స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలకు సంబంధించిన సమాచారంతోపాటు, రిపోర్టులు, కాంప్లెక్స్ సమావేశాలకు సంబంధించిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు పంపించాలంటే పాఠశాలల సముదాయ ప్రధానోపాధ్యాయులు ఇప్పటివరకు పలు ఇబ్బందులు పడేవారు. ప్రధానంగా ప్రైవేటు నెట్ సెంటర్ల చుట్టూ తిరిగి నివేదికలు, వేతన బిల్లులు చేయించాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ ఇబ్బందులు తొలగనున్నాయి. తమ పాఠశాల నుంచే త్వరితగతిన నివేదికలు పంపించనున్నారు. ప్రభుత్వం సర్వశిక్ష అభియాన్ ద్వారా జిల్లాలోని ప్రతి స్కూల్ కాంప్లెక్స్‌కు ఒక కంప్యూటర్, ప్రింటర్ అందించింది. దీంతో కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలకు సాంకేతికంగా వెసులుబాటు కలిగింది.

**తొలగనున్న ఇక్కట్లు..**

ఖమ్మం జిల్లాలో మొత్తం 81స్కూల్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. ఒక్కో కాంప్లెక్స్ పరిధిలో 10నుంచి 20వరకు పాఠశాలలు ఉన్నాయి. 35నుంచి 50 మంది వరకు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అలాగే ఒక్కో కాంప్లెక్సు పరిధిలో 350 నుంచి 500మంది వరకు విద్యార్థులున్నారు. బాణాపురం కాంప్లెక్సు పరిధిలోనే 11 పాఠశాలలుండగా 427 మంది విద్యార్థులున్నారు. మధిర మండలంలో నాలుగు కాంప్లెక్సులున్నాయి. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు తరచూ తమ పరిధిలోని పాఠశాలలను పరిశీలించాల్సి ఉంటుంది. ఉపాధ్యాయుల బోధన విధానం, పాఠ్యప్రణాళిక రాస్తున్నారా? బోధనోపకరణాలు వాడుతున్నారా? తదితర పలు అంశాలను పరిశీలిస్తారు. పాఠశాలల సముదాయ సమావేశ వివరాలతోపాటు వాటి నిర్వహణ, యూడైస్, లిప్, విద్యాసంబంధ కార్యకలపాల నిర్వహణ పూర్తి వివరాల నివేదికను ఉన్నతాధికారులకు తరచూ పంపాలి. ప్రస్తుతం ప్రతి స్కూల్ కాంప్లెక్స్‌కు ఒక కంప్యూటర్, ప్రింటర్ అందుబాటులోకి రావడంతో వారికి ఇబ్బంది తొలగనుంది.

**వెసులుబాటు కలగనుంది**

-ఏఎంవో పి.ప్రభాకర్‌రెడ్డి

నూతన కంప్యూటర్లు ఏర్పాటుతో మాకు వెసులుబాటు కలగనుంది. వ్యయప్రయాసలూ తగ్గుతాయి. కాంప్లెక్సుల పరిధిలో నివేదికలను అక్కడికక్కడే తయారు చేసుకుని అందించే సౌలభ్యం కలిగింది. ఉపాధ్యాయులకూ కొంత సౌలభ్యంగా ఉంటుంది.

# అన్నదాతలకు ఆనందం 'బోనస్'

ఖమ్మం : అధిక వర్షాలు, పైరు చేతికొచ్చే సమయంలో కురిసిన మొంథ తుపాను ధాటికి పంటనష్టం వాటిల్లినా.. వేగంగా చెల్లింపులు జరగటంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు బోనస్ విడుదల చేస్తుండటంతో అన్నదాతలు హర్షిస్తున్నారు. ఇప్పటివరకు ఖమ్మం జిల్లాలో కొన్న వడ్లకు 95శాతం, భద్రాద్రి జిల్లాలో 94 శాతం చెల్లింపులు జరగటం విశేషం. బోనస్ డబ్బులు జమయ్యేందుకు రెండు వారాల నుంచి నెల రోజుల సమయం పడుతోంది. ఖమ్మం జిల్లాలో 46శాతం, భద్రాద్రి జిల్లాలో 20శాతం మంది రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమయ్యాయి.

ముగింపు దశకు ధాన్యం సేకరణ

ఖమ్మం జిల్లాలో 59,877 మంది రైతులు పండించిన 3,35,107 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికారులు కొని మిల్లులకు తరలించారు. 56,401 మంది రైతులకు చెందిన 3,17,549 మెట్రిక్ టన్నుల ధాన్యానికి బిల్లులు చెల్లించారు. మరో 3,476 మందికి రూ.43.15 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉంది. వీరి వడ్లను మిల్లులకు తరలించినా.. ట్యాబ్ ఎంట్రీ జరగకపోవటం, ట్రక్ షీట్ పెండింగ్‌లో ఉండటం తదితర కారణాలతో బిల్లులు ఆగిపోయాయి. పీఏసీఎస్, డీఆర్డీఏ పరిధిలో కొన్న ధాన్యానికి 95శాతానికి పైగా, డీసీఎంఎస్, మెప్మా పరిధిలో 92శాతం వరకు చెల్లింపులు జరిగాయి. ఈనెలాఖరు వరకు కొనుగోళ్లు పూర్తయ్యే ఆస్కారముంది. 'చివరి రైతు వరకు ధాన్యం కొన్నాక కేంద్రాలను మూసేస్తాం' అని పౌరసరఫరాలశాఖ డీఎం శ్రీలత తెలిపారు. భద్రాద్రి జిల్లాలో మరో 1,152 మంది కర్షకులకు సంబంధించి 6,928 మెట్రిక్ టన్నుల వడ్లకు రూ.16.55కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఖమ్మం జిల్లాలో 52,552 మంది రైతులకు రూ.148.41కోట్ల బోనస్ చెల్లించాలి. ఇప్పటివరకు 22,083 మంది ఖాతాల్లో రూ.68.33కోట్లు జమయ్యాయి. భద్రాద్రి జిల్లాలో 19,622 మంది రైతులకు రూ.56.95కోట్ల బోనస్ చెల్లించాల్సి ఉండగా 3,453 మంది ఖాతాల్లో రూ.11.44కోట్లు జమయ్యాయి. మిగతా వారికి కొద్దిరోజుల్లో అందే అవకాశముంది. నాపేరు చీకటి ఉపేందర్. మాది కూసుమంచి మండలం నర్సింహుల గూడెం. వానాకాలంలో మాకున్న నాలుగెకరాలతోపాటు ఎనిమిదెకరాలను కౌలుకు తీసుకొని బీపీటీ రకం వరి సాగుచేశాను. ఎకరాకు కౌలు రూ.20వేలు కలుపుకొని రూ.40వేల చొప్పున పెట్టుబడి పెట్టాను. 40 బస్తాలు ఉంచుకొని 34 మెట్రిక్ టన్నుల ధాన్యన్ని ఐకేపీ కేంద్రంలో విక్రయిస్తే వారంలోనే బిల్లులు వచ్చాయి. కొద్దిరోజులకే బోనస్ కింద రూ.1.70 లక్షల జమైనందుకు సంతోషంగా ఉంది. ఖర్చులు పోనూ యాసంగిలో పెట్టుబడికి సరిపోయేలా డబ్బులు పోగయ్యాయి.

# మణుగూరులో భళా.. సత్తుపల్లిలో డీలా..!

సత్తుపల్లి : సత్తుపల్లిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల స్థాపన కలగానే మిగిలింది. ప్రభుత్వం సత్తుపల్లిలో కళాశాలను ఏర్పాటు చేయనుందని 2023లో విడుదలైన ప్రకటనతో ఈ ప్రాంత విద్యార్థుల్లో ఆశలు చిగురించాయి. అప్పట్లో మణుగూరు, సత్తుపల్లి ప్రాంతాలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు(జీఓ) జారీ అయ్యాయి. అనంతరం సాంకేతిక విద్యామండలి నుంచి అధికారులు సత్తుపల్లిని సందర్శించి కళాశాల స్థాపనకు అవసరమైన మౌలిక వసతులపై అధ్యయనం చేశారు. కళాశాల నిర్మాణానికి ఐదు ఎకరాలకు తగ్గకుండా భూమి సమకూర్చాల్సి ఉంటుంది. సత్తుపల్లిలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీ, కిష్టాపురం ప్రాంతాల్లో స్థలం లభ్యతపై ఆరా తీశారు. అలాగే వేంసూరు మండలంలోని కొన్ని ప్రాంతాల్లో, పెనుబల్లి మండలం యడ్లబంజర్, కల్లూరు ఎన్‌ఎస్పీ ప్రాంతాల్లోనూ స్థలాలను అధికారులు పరిశీలించారు. నిర్దిష్టంగా స్థలాన్ని ఎంపిక చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపితే పరిపాలనా పరమైన అనుమతులతో పాటు బడ్జెట్, సిబ్బంది, పోస్టుల కేటాయింపు వంటివి పొందవచ్చు.

సత్తుపల్లితో పాటు మంజూరైన మణుగూరులో ప్రస్తుతం కళాశాల తరగతులూ నడుస్తున్నాయి. సత్తుపల్లిలో స్థలం దొరకదన్న నిర్ధారణకు అధికారులు వచ్చినట్లు తెలుస్తోంది. కల్లూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి స్థలాన్ని గుర్తించారు. అదే ప్రాంతంలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్నీ ఎంపిక చేసే అవకాశాన్ని అధికారులు పరిశీలించాల్సి ఉంది. పెనుబల్లి మండలం అడవిమల్లేలలో లంకాసాగర్ మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టు నిర్మాణ సమయంలో 30 ఎకరాలకు పైగానే స్థలాన్ని సేకరించారు. ఇప్పటికే అక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సాంఘిక సంక్షమ బాలికల గురుకుల పాఠశాల, రైతువేదిక, రెండు పడకల గదుల ఇళ్లకు కొంత స్థలాన్ని కేటాయించి వినియోగించినా.. ఇంకా సుమారు పదెకరాల భూమి ఖాళీగానే ఉంది. అందులో ఐదెకరాల్లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు ఉపయోగించవచ్చునని గ్రామస్థులు చెబుతున్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రత్యేక దృష్టి సారించి సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్తే అనుమతులు లభించవచ్చునని విద్యారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఇచ్చుకో.. కట్టుకో.. ఇక కుదరదు

హైదరాబాద్: ఇల్లు నిర్మిస్తే.. ఆ దారి నిండా ఇటుక, ఇసుక, మట్టి వేయడం.. ఆ ప్రాంత అధికారికి అంతోఇంతో ఇచ్చేసి జబర్దస్తీ చేయడం.. కాలనీవాసులు గట్టిగా అడిగితే బెదిరించడం ఇక కుదరదు. ఏకంగా జీహెచ్ఎంసీ చట్ట సవరణకు ప్రతిపాదనలు చేసింది. రేపోమాపో ఆదేశాలు రానున్నాయి.

లక్ష్యం నగరంలో రహదారి కాలుష్యాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్లపై ఇసుక, ఇటుకలు, మట్టి వంటి నిర్మాణ సామగ్రిని వేయడం, విక్రయించడంపై నిషేధం విధించేందుకు రంగం సిద్ధం చేసింది. భారీ జరిమానాలు విధించడం, ఉల్లంఘనులకు ఏడాది జైలుశిక్ష పడేట్టు జీహెచ్ఎంసీ చట్టంలో సవరణలు రాబోతున్నాయి.

**ప్రతిపాదనలు ఇలా..**

జీహెచ్ఎంసీ చట్టంలోని ఆర్టికల్ 112(2), (3,), (20), (25), ఆర్టికల్



115(39) ప్రకారం.. జులై 15, 2025న అప్పటి పురపాలకశాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ, హైడ్రా కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు సమావేశమై.. చేర్పులు, మార్పులపై పలు నిర్ణయాలు తీసుకున్నారు. రహదారులు, రద్దీ ప్రాంతాల్లో పాదచారులు, వాహనదారులు చెత్త పడేసేందుకు చిన్న డబ్బాలను ఏర్పాటు చేయడం, వ్యర్థాల నిల్వకు తాత్కాలిక ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను అందుబాటులోకి తేవడం, చెత్త నిర్వహణ కేంద్రాలను పెంచనున్నారు.

ఇసుక, ఇటుకలు, కంకర, మట్టి, ఇతర నిర్మాణ సామగ్రిని రహదారులు, కాలిబాటలపై అమ్మడాన్ని నిషేధిస్తున్నారు.

భవన నిర్మాణానికి సంబంధించిన వ్యర్థాలను అనధికారికంగా తరలించడం, ఇష్టానుసారం డంపింగ్ చేయడంపై నిషేధం ఉంటుంది. నిర్మాణ వ్యర్థాలను జీహెచ్ఎంసీ అనుమతి లేకుండా తరలించే వాహనాలకు మొదటి తప్పుగా రూ.లక్ష జరిమానా. ఒక వేళ ఆ వ్యర్థాలను నాలాలు, చెరువులు, రోడ్లు, కాలిబాటలు, ప్రజలు తిరిగే చోట పడేస్తే.. రెట్టింపు జరిమానా విధిస్తారు.

రెండు, అంతకు మించి తప్పిదాలకు పాల్పడితే రూ.5లక్షల జరిమానా, ఏడాది వరకు జైలు శిక్ష ఉండేలా సవరణ చేస్తున్నారు.

జీహెచ్ఎంసీ వెలుపల కూడా వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకునే అధికారాన్ని కార్పొరేషన్‌కు కల్పిస్తారు. ఒకసారి ఉపయోగించి పడేసే ప్లాస్టిక్ వస్తువుల విక్రయం, వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తూ సెక్షన్ 487-ఏను జీహెచ్ఎంసీ చట్టంలో చేర్చనున్నారు.

# ఆయనదే 'గుత్తా'ధిపత్యం!

హైదరాబాద్ : శేరిలింగంపల్లి జోన్ పరిధిలో ఎంటమాలజీ విభాగంలో ఒప్పంద కార్మికుల సరఫరా కోసం టెండర్ పిలిచారు. నలుగురు గుత్తేదారులు పోటీపడ్డారు. 15శాతం నుంచి 24 శాతం వరకు తక్కువ ధరలకు టెండర్‌లు దాఖలు చేశారు. ఒక గుత్తేదారు మాత్రం నామమాత్రంగా తక్కువ ధరకు టెండర్ వేశారు. మిగిలిన గుత్తేదారులపై అనర్హత వేటు వేసేందుకు ఉన్నత స్థాయిలో పైరవీలు జరుగుతున్నాయి. తనకే టెండర్ దక్కేలా చక్రం తిప్పుతున్నారు.


జీహెచ్ఎంసీలో ఎక్కడైనా సరే ఆయన టెండర్ వేస్తే దక్కాల్సిందే. ఉన్నత స్థాయి అధికారులు సైతం అతనికే మొగ్గు చూపుతున్నారు. అతని కోసం జోన్‌కొక నిబంధన పెడుతున్నారు. ప్రధాన కార్యాలయంలోని ఓ సీఈ స్థాయి అధికారి అండదండలు పుష్కలంగా ఉన్నాయి. ఇటీవల గుత్తేదారులంతా ఆయనపై ఫిర్యాదు చేశారు. 'ఈ ఒక్కసారికి వదిలేయండి..' అంటూ ఆ అధికారి గుత్తేదారులకు నచ్చజెప్పారంటే.. పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

భారీ నజరానాలు..

ప్రధానంగా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఎల్‌బీనగర్, ఖైరతాబాద్ జోన్లలో ఆ గుత్తేదారుదే హవా. ఒక్క పాతబస్తీ జోలికి మాత్రం వెళ్లడం లేదు. టెండర్లన్నీ ఎక్సెస్‌కు (అధిక రేట్లకు) దక్కించుకుంటున్నారు. అధికారులకు నజరానాలు ఇస్తున్నారు.

ఆ గుత్తేదారు ఓ పేరుతో సంస్థను స్థాపించారు. ఓ మహిళను భాగస్వామిగా చేర్చుకొని వ్యక్తిగత పాన్‌కార్డును జత పరుస్తున్నారు. సంస్థ పాన్‌కార్డు అయితే.. 1శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వ్యక్తిగత పాన్‌కార్డుతో0.5శాతం మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. ఆ విధంగా రూ.కోట్లలో పన్ను ఎగవేస్తున్నారు.

ప్రధాన కార్యాలయంలో ఉండే ఓ చీఫ్ అధికారి పూర్తిస్థాయి సహకారం ఉంది. టెండర్లలో మతలబులు సృష్టించి మిగిలిన వారిపై అనర్హత



వేటు వేసే పని ఆయన తీసుకుంటున్నారు.

జోనుకో నిబంధన..!

ఖైరతాబాద్ జోన్ పరిధిలో టెండర్లకు టర్నోవర్ మెలిక పెట్టి చిన్న గుత్తేదారులపై అనర్హత వేటు వేయించారు. మిగిలిన ప్రాంతాల్లో దీన్ని అమలు చేయలేదు.

ఎల్‌బీనగర్ జోన్‌లో అడిషనల్ సెక్యూరిటీ డిపాజిట్‌లో మతలబు పెట్టారు. ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ కూడా తనకు అనుకూలంగా మలుచుకున్నారు.

కూకట్‌పల్లి జోన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో అన్‌కండిషనల్ సాల్వెన్సీ సర్టిఫికెట్ జత పర్చాలనే కొత్త నిబంధన పెట్టి కొంతమందిపై వేటు వేయించారు. ఇదే నిబంధన ఇతర జోన్లలో వర్తింపజేయలేదు.

జీహెచ్ఎంసీలో మొత్తం ఒప్పంద కార్మికులకు గత ఏడాది బడ్జెట్‌లో రూ.632 కోట్లు వెచ్చించారు. దీనిలో సగం దుర్వినియోగం అవుతున్నాయన్న ఫిర్యాదులు ఉన్నాయి. విజిలెన్సు విచారణ కూడా జరిగింది.

# బీటీపీఎస్.. బొగ్గు నిల్వలు 'లెస్'



మణుగూరు : భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రం(బీటీపీఎస్)లో బొగ్గు నిల్వలు అడుగంటాయి. కేవలం రెండు, మూడు రోజులకు సరిపడా 46వేల టన్నుల బొగ్గు మాత్రమే నిల్వ ఉంది. బీటీపీఎస్‌లో నాలుగు యూనిట్ల నుంచి 1,080 మెగావాట్ల విద్యుదుత్పత్తికి రోజుకు 14,500 టన్నుల బొగ్గు అవసరం. అయితే భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 15 రోజులకు సరిపడా 2 లక్షల టన్నుల బొగ్గు బీటీపీఎస్‌లో నిల్వ ఉండాలి. అయితే తక్కువ బొగ్గు నిల్వ ఉండటంతో విద్యుదుత్పత్తిపై ప్రభావం పడనుంది. ఎప్పుడు అత్యవసర పరిస్థితి ఏర్పడుతుందోనని ఇంజినీర్లకు సంక్రాంతి సెలవులను ఉన్నతాధికారులు రద్దు చేశారు. కూతవేటు దూరంలోని మణుగూరు గనుల నుంచి బీటీపీఎస్‌కు బొగ్గు రవాణా జరుగుతుంది. అయితే అక్కడి నుంచి నాణ్యమైన బొగ్గు సరఫరా కావటం లేదని తీసుకోవటం లేదు. అందుకే బొగ్గు కొరత ఏర్పడింది. విద్యుదుత్పత్తికి జీ-9, 10 స్థాయి కలిగిన బొగ్గు వినియోగిస్తారు. మణుగూరు గనుల నుంచి ఆ స్థాయి నాణ్యత కలిగిన బొగ్గు ఉత్పత్తి కావటం లేదు. గతంలో మణుగూరు ఓసీ గని నుంచి బీటీపీఎస్‌కు జీ-9, 10 నాణ్యత కలిగిన బొగ్గు రవాణా అయ్యేది. అయితే గనిలో బొగ్గు వెలికితీసే ఓబీ కంపెనీ ఒప్పంద గడువు ముగియటం, మళ్లీ కొత్త ఓబీ కంపెనీతో సింగరేణి ఒప్పందం కుదుర్చుకునేందుకు కొద్దినెలల సమయం పట్టింది. ఆ వ్యవధిలో మణుగూరు ఓసీ గని నుంచి బీటీపీఎస్‌కు బొగ్గు రవాణా జరగలేదు. ఓసీ-4లోనూ జీ-9 నాణ్యత కలిగిన బొగ్గు ఉత్పత్తి అవుతుంది. అయితే నీరు నిలిచిందని బొగ్గును ఓబీ కంపెనీ వెలికితీయటం లేదు. ఇలా ఈ రెండు గనుల నుంచి జీ-9, 10 నాణ్యత కలిగిన బొగ్గు సరఫరా కాకపోవటంతో బీటీపీఎస్‌లో నిల్వలు అడుగంటాయి. **భూపాలపల్లి నుంచి సరఫరా**బీటీపీఎస్‌కు బొగ్గు కొరత ఏర్పడిన నేపథ్య ంలో సమస్య జటిలం కాకుండా జెన్కో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. భూపాలపల్లి నుంచి బొగ్గు రవాణా చేసుకునేందుకు సింగరేణితో ఒప్పందం కుదుర్చుకుంది. రోజుకు 2వేల టన్నుల చొప్పున మొత్తమ్మీద 3 లక్షల టన్నుల బొగ్గు భూపాలపల్లి నుంచి రోడ్డుమార్గాన బీటీపీఎస్‌కు సరఫరా కానుంది. మూడు రోజుల్లో ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. 'బీటీపీఎస్‌లో బొగ్గు నిల్వలు తక్కువైనా ప్రస్తుతాని కి వచ్చిన ఇబ్బందులేమీ లేవు. నాణ్యత లేకపోవటం వల్లే మణుగూరు గనుల నుంచి బొగ్గును తీసుకోవటం లేదు. బొగ్గు నిల్వలు పెరిగేలా ఇతర ప్రాంతం నుంచి దిగుమతి చేసుకుంటాం' అని సీఈ బిచ్చన్నకు తెలిపారు.

# కలిసికట్టుగా.. గెలిచేట్టుగా..!




ఖమ్మం : కబడ్డీ పోటీల్లో ఖమ్మం జిల్లా మహిళల జట్టు అద్భుత విజయాలు సాధిస్తోంది. 2021 నుంచి రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటుతోంది. ఈ విజయాల వెనుక ఖమ్మం గ్రామీణ మండలం మద్దులపల్లిలోని సాంఘిక సంక్షమశాఖ మహిళా డిగ్రీ కళాశాల వెన్నుదన్నుగా నిలుస్తోంది. జిల్లా మహిళల కబడ్డీ జట్టులో సింహభాగం క్రీడాకారిణులు ఈ కళాశాలకు చెందినవారే కావటం విశేషం.

**తొమ్మిది మంది ఈ కళాశాలకు చెందినవారే**

ఇటీవల కరీంనగర్‌లో జరిగిన సీనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఖమ్మం జిల్లా మహిళా జట్టుకు కాంస్య పతకం దక్కింది. ఈ జట్టులో 12 మంది క్రీడాకారిణులు ఉండగా అందులో తొమ్మిది మంది మద్దులపల్లిలోని సాంఘిక సంక్షమశాఖ మహిళా డిగ్రీ కళాశాలకు చెందినవారే. తాజాగా పతకాలు సాధిస్తున్న జిల్లా జట్టులో కె.భవానీ (బీపీఈడీ), బి.ప్రియాంక (బీపీఈడీ), ఎం.కుసుమ (యుజీఈడీ), ఎస్.పూజిత (పీజీ) ఉన్నారు. వీరందరూ ఈ కళాశాలలో చదువుకున్న వారే. ప్రస్తుతం ఇక్కడ డిగ్రీ విద్యనభ్యసిస్తున్న జి.కావ్యశ్రీ, ఎం.మేఘన, ఎం.సువన్య, ఎన్.భావన, టి.అన్విత సైతం ఇదే జట్టులో సభ్యులుగా కొనసాగుతున్నారు. మిగిలిన ముగ్గురు క్రీడాకారిణులు ఎస్.సిరి, కృష్ణవేణి, ఎస్.ఆసిని కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందినవారు. భావన, పూజిత, కుసుమ, ప్రియాంక ఇప్పటికే జాతీయ పోటీల్లో రాణించారు.

**మార్పు వచ్చింది ఇలా..**అంతర్జాతీయ క్రీడాకారిణి శివజ్యోతిని మద్దులపల్లి సాంఘిక సంక్షమశాఖ మహిళా డిగ్రీ కళాశాల కోచ్‌గా నియమించినప్పటి నుంచి ఇక్కడి విద్యార్థినులు కబడ్డీ క్రీడలో రాటుదేలుతున్నారు. కోచ్‌గా ఉన్న శివజ్యోతి 12 సీనియర్ నేషనల్ టోర్నీల్లో రాణించారు. ఆరుసార్లు భారత కబడ్డీ శిబిరంలో శిక్షణ పొందారు. ఓసారి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి అంతర్జాతీయ టోర్నీలో ఆడారు. ఎప్పుడు జూనియర్, సీనియర్ జట్ల ఎంపికలు జరిగినా ఈ కళాశాల క్రీడాకారులు, పూర్వ క్రీడాకారులు రంగంలోకి దిగి ప్రతిభ చాటుతున్నారు.

# తూకాల్లో 'అర'గదీస్తూ.. మోసాల్లో ఇరగదీస్తూ..!



ఖమ్మం : ఖమ్మం నగరంలో ఇటీవల తూనికలు, కొలతలశాఖ అధికారులు చేపల విక్రయ దుకాణాలపై తనిఖీలు చేశారు. ఓ దుకాణంలో రెండు కిలోల తూకం బాట్(రాయి) కిలోన్నర బరువు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. సదరు ఇనుప బాట్(రాయి)ని కిందిభాగంలో అరకిలో వరకు అరగదీసినట్లు తేల్చారు. ఇలా 14 చేపల దుకాణాలను తనిఖీ చేయగా ప్రతిచోటా ఇదేవిధంగా రెండు కిలోలకు అరకిలో తక్కువ బరువు కలిగిన తూకం రాళ్లు బయటపడ్డాయి. ఇక్కడ చేపల విక్రేతలందరూ ముఠాగా ఏర్పడి కొన్నేళ్లుగా తూకాల్లో మోసాలకు పాల్పడుతుండటం గమనార్హం. ప్రస్తుతం కిలో చేపల ధర రూ.160 పలుకుతోంది. కిలోకు పావు కిలో తక్కువగా ఉండటం వల్ల ఈలెక్కన వినియోగదారులు కిలోకు రూ.40 వరకు నష్టపోతున్నారు. రెండు కిలోల చేపలు కొంటే వినియోగదారులపై అదనంగా రూ.80 భారం పడుతోంది. కిలో ధర ఎక్కువ పలికే చేపలు విక్రయిస్తే నిర్వాహకులకు మరింత లాభాలు సమకూరుతాయి. తమకు వచ్చే కమీషన్ కూడా కలుపుకొంటే సగానికి సగం లాభం పొందుతున్నట్లే. కమీషన్ కంటే మోసాల ద్వారా ఎక్కువ ఆదాయం వస్తుండటంతో అందరూ ఇదే విధానం అమలుచేస్తున్నారు. ప్రతి ఆదివారం ఖమ్మం నగరంలో రూ.లక్షల్లో చేపల వ్యాపారం జరుగుతుంది.

**ఎలక్ట్రానిక్ కాంటాల్లో చిప్ అమర్చి...**

ఏన్కూరు, తల్లాడ మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన పత్తి వ్యాపారులు సైతం ముఠాలుగా ఏర్పడి రైతులను మోసగిస్తున్నారు. ఏన్కూరు, నర్సింహారావుపేట, అన్నారుగూడెం, బాలప్పేట, తల్లాడ తదితర ప్రాంతాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో పత్తి వ్యాపారులు ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట తదితర జిల్లాలకు టాటాఏస్ వాహనాలు తీసుకెళ్లి రైతుల నుంచి పత్తి కొంటారు. ఎలక్ట్రానిక్ కాంటాలో ప్రత్యేకంగా చిప్ అమర్చి పత్తి కాంటా వేసే సమయంలో తమ జేబులో రహస్యంగా ఉన్న రిమోట్ ద్వారా ఆపరేట్ చేస్తారు. ఇలా ప్రతి క్వింటాకు 20కిలోల బరువు తగ్గుతుంది. క్వింటా పత్తికి ప్రభుత్వం మద్దతు ధర రూ.8,110 ప్రకటించింది. తూకంలో 20కిలోలు తగ్గటం వల్ల ప్రతి క్వింటాకు రైతులు సుమారు రూ.1,600 వరకు నష్టపోతున్నారు. కమీషన్ ద్వారా వ్యాపారులు మరికొంత లాభం పొందుతున్నారు. ఇలా ప్రతి క్వింటాకు రూ.2,000 వరకు రైతులను దగా చేస్తున్నారు. ఏన్కూరు, తల్లాడ మండలాల్లో ఆరుగురు పత్తి వ్యాపారులపై తూనికలు, కొలతలశాఖ అధికారులు, పోలీసులు ఇటీవల క్రిమినల్ కేసులు నమోదుచేసిన విషయం విదితమే. 'వినియోగదారులకు తూకాలపై అవగాహన ముఖ్యం. కిలో బాట్ల వెనకాల లీగల్ మెట్రాలజీ శాఖ స్టాంప్ ఉంటుంది. ఎక్కడైనా మోసాలు జరిగినట్లు తెలిస్తే ఫిర్యాదు చేయాలి' అని ఖమ్మం జిల్లా తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

# తీరనున్న రిజిస్ట్రేషన్ కష్టాలు.. వాహనాల డీలర్లకే బాధ్యతలు

తాండూరు : కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ కోసం ఇకపై ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లి వేచి చూడాల్సిన పనిలేదు. తాత్కాలిక రిజిస్ట్రేషన్(టీఆర్) లాగే.. శాశ్వత రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చే బాధ్యతలను ప్రభుత్వం షోరూం డీలర్లకు అప్పగించనుంది. ఇందుకోసం రవాణాశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ ప్రక్రియ వచ్చేనెల నుంచి అమలయ్యే అవకాశముందని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు.

**నాలుగు నియోజకవర్గాల పరిధిలో..**

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో వివిధ కంపెనీలకు సంబంధించిన ద్విచక్రవాహన షోరూంలు 16, నాలుగు చక్రాల డీలర్ షోరూంలు 8 ఉన్నాయి. వీటితోపాటు హైదరాబాద్ డీలర్‌షిప్ పరిధిలో ఇక్కడ సబ్‌డీలర్ షోరూంలున్నాయి. తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ పరిధిలో రోజూ సుమారు 30- 40 ద్విచక్ర, 6-8 నాలుగు చక్రాల వాహనాలు విక్రయాలవుతున్నాయి.

**సమయం.. ఖర్చు ఆదా..**

అన్ని పన్నులు షోరూం డీలరు ముందే వసూలు చేస్తున్నా.. తాత్కాలిక రిజిస్ట్రేషన్ పత్రం మాత్రమే ఇచ్చేవారు. అన్ని పత్రాలు తీసుకొని రిజిస్ట్రేషన్‌కు ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. రాకపోకలు, రవాణా ఖర్చులు, సమయం వృథ అయ్యేది. ముఖ్యంగా మధ్యవర్తుల ప్రమేయం మరీ ఎక్కువగా ఉండేది. ఇకపై ఆ సమస్య తీరనుంది. డీలరు వద్దే శాశ్వత రిజిస్ట్రేషన్ కానుంది.

ఫ్యాన్సీ నంబరు కావాలంటే అదనం..



ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనానికి కోరుకున్న.. లేదంటే ఫ్యాన్సీ నంబరు కావాలంటే తాత్కాలిక రిజిస్ట్రేషన్‌తోపాటు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. రవాణాశాఖ నిబంధనలు, అదనపు రుసుం చెల్లిస్తే కావాల్సిన నంబరును రవాణాశాఖ అధికారులు కేటాయిస్తారు. ఇందుకోసం సమయం పడుతుంది.

ప్రభుత్వానిది మంచి నిర్ణయం..-రమేశ్ గుప్తా, తాండూరు

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిది. కొత్త వాహనం తీసుకున్న తరవాత చాలా మంది వాహనదారులు రిజిస్ట్రేషన్ల కోసం ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలిక, శాశ్వత రిజిస్ట్రేషన్ విషయంలో డీలర్లు బాధ్యతగా వ్యవహరిస్తారు.


సర్కారు ఆదేశాలొచ్చాయి..-వెంకట్‌రెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి, వికారాబాద్ డీలర్ల వద్దనే రిజిస్ట్రేషన్ చేయించుకునే కొత్త విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలని నిర్ణయించింది. తాత్కాలిక, శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం అవసరమైన అన్ని పత్రాలను ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. మా కార్యాలయంలో అన్ని పత్రాలు పరిశీలించి ఆమోదం తెలుపుతాం. కొత్త సాఫ్ట్‌వేర్ వచ్చాక ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది.

# అదనపు లోడ్‌కు ఓసీ ఉండాల్సిందే

హైదరాబాద్: నగరంలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అనుమతులు.. అక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసీ) లేకున్నా నిబంధనలకు విరుద్ధంగా ఇన్నాళ్లు అడ్డగోలుగా విద్యుత్తు కనెక్షన్లు జారీ చేశారు. నకిలీ ఓసీతో కొందరు గుత్తేదారులు, అధికారులు కలిసి చేసిన అరాచకం అంతా ఇంతా కాదు. ఈ అక్రమాలను అరికట్టేందుకు టీజీఎస్పీడీసీఎల్ కొన్నాళ్లుగా విద్యుత్తు కనెక్షన్ల జారీని కఠినతరం చేసింది. గతంలో ఇచ్చిన కనెక్షన్లపై ఫిర్యాదుల ఆధారంగా విచారణ, బాధ్యులైన సిబ్బంది, అధికారులకు మెమోలు జారీ చేస్తుండటంతో ఇప్పుడు నిబంధనల మేరకు ఉంటే కొత్త కనెక్షన్ అంటున్నారు. దీంతో గ్రేటర్‌లోని పది సర్కిళ్ల పరిధిలో సరైన పత్రాలు లేని దరఖాస్తులను డిస్కం పెండింగ్‌లో పెట్టింది. గడిచిన కొన్ని నెలల్లో వీటి సంఖ్య వేలకు చేరింది. అది కర్మన్‌ఘాట్‌లో పదేళ్ల క్రితం భవనం. ఆ రోజుల్లో అవసరాన్ని బట్టి పరిమిత లోడ్‌తో విద్యుత్తు కనెక్షన్లు తీసుకున్నారు. ఇటీవల వినియో గం పెరిగింది. ఇప్పుడు 160 కేవీఏ అదనపు లోడ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అదనపు లోడ్ అయినా సరే అక్యుపెన్సీ సర్టిఫికెట్ సమర్పించాల్సిందేనని టీజీఎస్పీడీసీఎల్ అధికారులు చెబుతున్నారు. ఓసీ సమర్పించకపోవడంతో నెలలుగా దరఖాస్తు పెండింగ్‌లోనే ఉంది.

**నోటరీలపై సందిగ్ధం..**

నగరంలో చాలా వరకు నోటరీ పత్రాలను స్థలాలను కొనుగోలు చేసినవారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. వీరికి సైతం రిజిస్టర్డ్ డాక్యుమెంట్‌తో పోలిస్తే స్వల్పంగా ఎక్కువ ఛార్జీలు వసూలు చేసి



ఇది వరకు కనెక్షన్లు ఇచ్చేవారు. ఇప్పుడు వీటికి సైతం కనెక్షన్లు జారీ చేయడం లేదు. ఇవ్వాలని కొందరు అధికారులు, వద్దని మరికొందరు అంటున్నారు. సందిగ్ధం నెలకొంది. సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలో పదుల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని స్పష్టత కోసం కార్పొరేట్ కార్యాలయాన్ని సంప్రదిస్తున్నట్లు ఓ అధికారి 'ఈనాడు'కు తెలిపారు.

**జంట జలాశయ పరిధిలోనూ..**

జంట జలాశయాలను పరిరక్షించేందుకు దశాబ్దాల క్రితం ప్రభుత్వం జీవో111 జారీచేసింది. వీటిపరిధిలో నిర్మాణాలకు స్థానిక సంస్థలు అనుమతులు ఇవ్వడం లేదు. అయినా పలు భవనాలు వెలిశాయి. ఇటీవల కట్టిన భవనాలకు విద్యుత్తు కనెక్షన్ కావాలని దరఖాస్తు చేసుకోగా.. నిబంధనల మేరకు అనుమతుల పత్రాలు, 10 మీటర్ల కంటే ఎత్తైన భవనాలైతే ఓసీ సమర్పిస్తేనే కనెక్షన్ అని అధికారులు పెండింగ్‌లో పెడుతున్నారు. నిబంధనలను కఠినంగా అమలు చేస్తుండటంతో శంషాబాద్, మొయినాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్త కనెక్షన్లు జారీ నిల్చిపోయింది.

**మరెలా?** విద్యుత్తు కనీస అవసరం కాబట్టి ఒక కనెక్షన్‌ను అది కూడా తాత్కాలిక కేటగిరి-8 కింద జారీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకు యూనిట్‌కు రూ.12 చొప్పున వసూలు చేస్తున్నారు

## కోడి కూసింది... కాసులు కురిశాయి

అచ్యుతాపురం : సంక్రాంతి సందర్భంగా కోడి పుంజుల ధరలు అమాంతం పెరిగాయి. ఇది పెంపకందారుల ముఖాల్లో ఆనందం నింపింది. అచ్యుతాపురంలో శుక్రవారం జరిగిన వారపుసంతకు భారీగా నాటుకోళ్ళు విక్రయానికి వచ్చాయి. వీటి కోసమే ఎదురుచూస్తున్నాం అన్నట్లు పందెంరాయుళ్ళు కొనుగోలుకు పోటీపడ్డారు. సాధారణ రోజుల్లో రూ. మూడు వేలు పలికే కోడిపుంజులు రూ. 10 వేల వరకు పలికాయి. కోడిపెట్టలు సైతం రూ. 1000 నుంచి రూ. మూడు వేలు వరకు ధర చెల్లించి మాంసం ప్రియులు కొనుగోలు చేశారు. పండగ సంత కావడంతో మహిళలు అధిక సంఖ్యలో కనిపించారు. ఇప్పటి వరకూ గోదావరి జిల్లాలకే ప్రత్యేకంగా నిలిచిన ఈ పందెం పుంజుల పెంపకం, శిక్షణ క్రమంగా



మన జిల్లాలోనూ వ్యాప్తి చెందుతోంది. బుచ్చెయ్యపేట మండలం లింగాపుపాలెంపుర అగ్రహారం గ్రామంలో ఔత్సాహికులు ప్రత్యేకంగా వీటిని పెంచుతున్నారు.

**సంత కళకళ..** నక్కపల్లి వారపు సంత శుక్రవారం క్రయ, విక్రయదారులతో కళకళలాడింది. పండగ ముందు జరిగిన సంత కావడంతో ప్రధానంగా మేకలు, గొర్రెలు, కోళ్ళ వద్ద రద్దీ నెలకొంది. ఇక్కడకు పక్క జిల్లాల నుంచి అనేక మంది వచ్చారు. ముఖ్యంగా నాటుజీవాల ధరలు భారీగా ఉన్నాయి. నాటు కోళ్ళ ధరలైతే మరీ దారుణం. కేజీ బరువుండే సాధారణ కోడి రూ.రెండు వేలకుపైగా పలికింది. ఇక పందెం కోసం తెచ్చినవి రూ. ఏడెనిమిది వేల వరకు పలికాయి. కొందరు ఖరీదుతో సంబంధం లేకుండా వీటిని ఉత్సాహంగా కొనుగోలు చేసుకుని వెళ్లారు.

## కంచేస్తాం.. పంచేస్తాం!!

పీఎంపాలెం : జీవీఎంసీ, రెవెన్యూ శాఖల మధ్య కొరవడిన సమన్వయం ఆక్రమణదారులకు వరంగా మారుతోంది. కళ్లముందు ఇష్టారీతిన కబ్జాలు జరుగుతున్నా తమది కాదన్నట్లు వ్యవహరిస్తు చర్యలకు వెనకడుగు వేస్తున్నారు. దీంతో రూ..కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు అక్రమార్కుల పరమవుతున్నాయి.

పీఎంపాలెం హౌసింగ్‌బోర్డు కాలనీ ఎల్ఐజీ నివాసాల వద్ద అటవీ శాఖ ప్రహరీకి చేరువగా సుమారు రూ. 10 కోట్లు విలువ చేసే ప్రభుత్వ ఖాళీ స్థలం ఉంది. ఆర్‌హెచ్ కాలనీ నీళ్ల ట్యాంకు నుంచి సాయిబాబా ఆలయం వరకు ఉన్న ఈ భూమిని కొందరు కబ్జా చేసి ఇళ్ల స్థలాలుగా హద్దులు వేసుకుని రాత్రికి రాత్రి ఇనుప కంచెలు ఏర్పాటు చేశారు. మరికొందరు కంటైనర్లు ఏర్పాటు చేశారు. కొందరు వైకాపా నాయకుల ప్రోద్బలంతో, పేదల ముసుగులో ఈ ఆక్రమణలకు తెరతీసినట్లు



సమాచారం. సుమారు 30కి పైగా ప్లాట్లు వేయడంతో పాటు నేడో రేపో పక్కాగా రేకుల షెడ్లు నిర్మించేందుకు రంగం సిద్ధం చేసుకుంటు న్నారు. గత 20 రోజులుగా బహిరంగంగా ఈ కబ్జాల తంతు జరుగుతున్నా జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఇక్కడి విషయంపై ఆయా శాఖల ఉన్నతాధికారులకు, కింది స్థాయి అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా ఇంత వరకు ఎలాంటి చర్యలకు ఉపక్రమించక పోవడంపై విమర్శలొస్తున్నాయి.

## పరుగున వచ్చేలా.. ప్రాణం నిలిపేలా..

నక్కపల్లి : రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులు.. అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బంది పడే జనాలకు అత్యవసర వైద్య సేవలు అందించే 108 నూతన వాహనాలు రహదారులపై పరుగులు తీస్తున్నాయి. కాల్ రాగానే రయ్‌మంటూ వెళ్తున్న కొన్ని వాహనాల్లో అధునాతన సదుపాయాలూ ఉన్నాయి. జిల్లాకు ఇటీవల కొత్తగా పలు వాహనాలు రాగా వీటిలో సేవలు మెరుగుపడ్డాయి. జిల్లా పరిధిలోని 24 మండలాల పరిధిలో ప్రస్తుతం 22 వాహనాల ద్వారా అత్యవసర వైద్య సేవలంది స్తున్నారు. ఏ ప్రమాదం జరిగినా, ఎవరైనా తీవ్ర అస్వస్థతకు గురైనా సమాచారం అందితే అక్కడకు చేరుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటి సేవలను మరింత మెరుగుపరిచారు. మరమ్మతుకు చేరుకున్న వాహనాల స్థానే కొత్తవి చేర్చారు. రాష్ట్ర వ్యాప్తంగా వందల వాహనాలు కేటాయించగా, జిల్లాకు 12 వాహనాలు చేరాయి. ప్రస్తుతం పాత, కొత్త వాహనాలు సేవలందిస్తున్నాయి.

**ఆరుచోట్ల ఏఎల్ఎస్‌లు**

జిల్లాలో అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు (ఏఎల్ఎస్) వాహనాలు ఆరు ఉన్నాయి. ప్రభుత్వం ప్రస్తుతం కేటాయించిన వాటిలో కండిషన్ బాగాలేని మూడు వాహనాలను మార్పు చేసి, కొత్త వాటిని అందించింది. మిగిలినవన్నీ బేసిక్ లైఫ్ సపోర్టు (బీఎల్ఎస్) వాహనాలే. అన్ని వాహనాల్లో ప్రాణవాయువు, బీపీ మిషన్, సెక్షన్ ఆపరేటర్, మోనిటర్, స్ట్రెచర్, వీల్‌ఛైర్ తదితర సామగ్రి ఉండగా..ఏఎల్ఎస్‌లో వీటితో పాటు వెంటిలేటర్, ఆటో మెటిక్ డీఫిబ్రిలేటర్ (గుండె పోటు బాధితులను రక్షించే పరికరాలు) ఉంటాయి.

**నూతన వాహనాలు వచ్చిన ప్రాంతాలు**

ఏఎల్ఎస్‌లు (3): నక్కపల్లి, నర్సీపట్నం, కె.కోటపాడు.

బీఎల్ఎస్‌లు (9): ఎస్.రాయవరం, గొలుగొండ, నాతవరం, దేవరాపల్లి, చీడికాడ, రావికమతం, మాకవరపాలెం, అచ్యుతాపురం, ఎలమంచిలి

**కొత్త వాటికి ప్రతిపాదనలు**

అంబులెన్స్‌ల్లో చాలావరకు ఎక్కువ దూరం తిరిగినవి జీవనకాలం ముగుస్తుండటంతో ప్రభుత్వం కొత్తవి కేటాయించింది. త్వరలో ఎలమంచిలి, మాకవరపాలేనికి ఏఎల్ఎస్ వాహనాలను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. జిల్లాలో మునగపాక, రాంబిల్లికి వాహనాల్లేవు. వీటికోసం కలెక్టర్ ప్రతిపాదనలు పంపించాం. అనమతులు రాగానే ఇక్కడ నుంచి 108 వాహనాలు తిరుగుతాయి. వి.త్రినాథ్, జిల్లా మేనేజరు

## వీరు ఏకగ్రీవమై.. వారు మరిచారు ఏకమై



తాడేపల్లిగూడెం : పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం మరో మూడు నెలల్లో ముగియనుంది. ఏకగ్రీవ పంచాయతీలకు మాత్రం నేటికీ ప్రోత్సాహక నిధులు మంజూరు కాలేదు. పంచాయతీలను ఏకగ్రీవం చేసుకుంటే గ్రామాల్ని అభివృద్ధి చేసుకోవచ్చని పలుచోట్ల రాజకీయాలకతీతంగా నాయకులంతా ఏకతాటిపైకి వచ్చారు. కానీ, గత వైకాపా ప్రభుత్వం పైసా విదల్చలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలైనా ప్రోత్సాహక నిధులు ఊసెత్తలేదు. ఫలితంగా ఏకగ్రీవ పంచాయతీలపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోంది.

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉంగుటూరు మండలం కాగుపాడు పంచాయతీ ఏకగ్రీవమైంది. ఈ పంచాయతీకి ఏకగ్రీవ నిధులు రూ.5 లక్షలు విడుదల కావాల్సి ఉండగా.. గత వైకాపా ప్రభుత్వం రూపాయి కూడా ఇవ్వలేదు. ఈ నిధులు విడుదలైతే గ్రామస్థులు పుంత దారిని అభివృద్ధి చేయించుకోవాలని భావించారు. కానీ, వారి ఆశలు అడియాసలయ్యాయి.

ఎదురుచూపులే మిగిలాయి..కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు జమ చేస్తోంది. దీంతో ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహకాలు విడుదల చేస్తుందని ఆయా గ్రామాల సర్పంచులు ఆశలు పెట్టుకున్నారు. మరోసారి ఎదురుచూపులే మిగిలాయి. ఏప్రిల్ మొదటి వారంలో పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. అప్పటికైనా ప్రోత్సాహక నిధులు విడుదల చేస్తారో లేదోనని ఏకగ్రీవ పంచాయతీల సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 99..**

ఉమ్మడి జిల్లాలో 2021 ఫిబ్రవరిలో 892 పంచాయతీలు, 9,660 వార్డు స్థానాలకు నాలుగు విడతల్లో ఎన్నికలు నిర్వహించారు. ఏకగ్రీవమైతే జనాభా ఆధారంగా ప్రోత్సాహకం అందిస్తామని అప్పటి వైకాపా ప్రభుత్వం ప్రకటించింది. 99 పంచాయతీల్లో ప్రజలు ప్రథమ పౌరుడిని ఏకగ్రీవం చేసుకున్నారు. వీటికి ప్రభుత్వం సుమారు రూ.6 కోట్లు మంజూరు చేయాల్సి ఉంది. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేసిన వైకాపా ప్రభుత్వం.. చివరికి రిక్తహస్తం అందించింది.

## ఇక్కడ జీవితాలనే మలుపు తిప్పేస్తోంది



భీమవరం : ఇక్కడికొచ్చేటప్పటికి అందరికీ హడలే. కొత్త వారైతే ప్రమాదం బారిన పడటమే. అదే జిల్లా కేంద్రం భీమవరం నుంచి కృష్ణా జిల్లాకు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న కల్వర్టు.

గొల్లవానితిప్ప రోడ్డు నుంచి 216 నంబరు జాతీయ రహదారిపై మచిలీపట్నం మీదుగా విజయవాడ వెళ్లే మార్గం కావడంతో నిత్యం వాహన రద్దీ ఉంటోంది. దాంతో నెలలో తక్కువంటే రెండు ప్రమాదాలు జరుగుతున్నాయి.ప్రాధాన్యం ఇదీ.. కార్లు, ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు రోజుకు రెండు వేలకు పైగా తిరుగుతాయి. ఆక్వా ఉత్పత్తులను తరలించే కంటైనర్లకు ఇదే ప్రధాన మార్గం. ఇతర జిల్లాల నుంచి తాడేపల్లిగూడెం ప్రధాన మార్కెట్‌కు సరకులు ఇటు నుంచే తీసుకెళ్తారు. సమస్య ఏమిటంటే.. రహదారి పొడవునా లోసరి–గూట్లపాడు పంట కాలువ ఉంది. దీనికి భీమవరం రామలక్ష్మణ్‌నగర్ దగ్గర కల్వర్టును దాదాపు 80 ఏళ్ల కిందట నిర్మించారు. అదీ కూడా అప్పట్లో రైతుల అవసరార్థం నిర్మించారు. అదే ఇప్పటికీ సేవలందిస్తోంది. **కారణాలు ఇవే..**

రహదారి విస్తరణకు తగ్గట్టుగా వంతెన లేదు.

ఇరుకుగా ఉండటంతో పాటు మలుపులో గుంతలు.


ఇక్కడ విద్యుత్తు స్తంభాలు ఉన్నా లైట్లు వెలగవు.

భీమవరం యనమదుర్రు గట్టు వైపున పొదలు కప్పేయడంతో కల్వర్టు కనిపించదు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం మరో కారణం.

అధికారులు ఏమన్నారంటే.. పొదల అడ్డంకులు లేకుండా చేస్తామని, స్తంభాలకు వీధిదీపాలు బిగిస్తామని పురపాలక కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. వంతెన నిర్మాణానికి సీఆర్ఎఫ్ నిధులు మంజూరయ్యాయని ర.భ.శాఖ ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. పనులు వెంటనే చేపడతామని వివరించారు.

గత అయిదేళ్లలోప్రమాదాలు 94

## జలవనరులో కబ్జా జలగలు!



ఒంగోలు : నాటి పెద్దలు ముందు చూపుతో మనకు అందించిన జలవనరును సంరక్షించేవారు లేకుండా పోయారు. ప్రజల అవసరాలకు తవ్విన జిల్లా కేంద్రం మార్కాపురంలోని చెరువు విషయంలో నిర్లక్ష్యం వహించడంతో ఆక్రమణలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. మరోవైపు చెరువులో నీటి నిల్వలు తగ్గిపోయి ఉపయోగం లేకుండాపోతోంది. మార్కాపురం ప్రాంతంలో 1,100పైగా ఎకరాలకు సాగునీరందించేం దుకు 584 ఎకరాల విస్తీర్ణంలో చెరువును తవ్వారు. ఇందులో 0.2 టీఎంసీల నీటిని నింపే అవకాశం ఉంది. చెరువుకు నీటిని తీసుకొచ్చే సప్లయి ఛానల్ ఆక్రమణలతో కుదించుకుని పోవడంతో నానాటికి నీటి లభ్యత తగ్గి పోతోంది. ప్రధానంగా మాల్యవంతెనపాడు నుంచి గుండ్లకమ్మ నీరు చెరువులోకి రావాల్సి ఉండగా 8 మీటర్ల మేర ఉండాల్సిన కాలువ చిన్నదిగా మారి నీరు పారక చెరువు నిండడంలేదు. ఈ ఏడాది మొంథ తుపాను ప్రభావంతో భారీ వర్షాలకు అలుగు పారుతుంది. లేకపోతే భారీ చెరువు ఏటా కుంటను తలపిస్తుంటుంది. చెరువు చుట్టుపక్కల స్థిరాస్తి వ్యాపారుల వెంచర్లు భారీగా పెరిగిపోవడం, ప్రధానంగా చెరువు అభివృద్ధిపై దృష్టి సారించకపోవడంతో అక్రమణలు అంతకంతకూ పెరిగిపోయి చెరువు కాలగర్భంలో కలిసిపోయే పరిస్థితి నెలకొంది. నాటి పాలకులు దూరదృష్టితో ప్రజలకు మేలు చేయాలని ఆలోచిస్తే నేటి పెద్దలు మాత్రం చెరువును నీటితో నింపితే వెంచర్లు మునిగిపోతాయని నీటిని నింపే ప్రయత్నం కూడా చేయకపోవడం గమనార్హం.

**నిధులొచ్చినా.. పట్టించుకోలేదు**

చెరువు కట్టను ట్యాంకు బండ్ మాదిరి అభివృద్ధి చేస్తామని నాయకులు గొప్పగా చెబుతున్నారు. ఆచరణలో మాత్రం అడుగు ముందుకు పడడం లేదు. నాటి ప్రభుత్వ హయాంలో చెరువు కట్ట రెండు కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.10 కోట్ల మేర నిధులు కేటాయించారు. నాటి పెద్దలు శ్రద్ధ చూపకపోవడంతో పనులు మొదలుకాలేదు. తాజాగా తిరిగి ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. వీటిని ఎంత వరకు ముందుకు తీసుకెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కేవలం సాగునీటి అవసరాలకే చెరువు నీటిని వినియోగిస్తున్నారు. అదే చెరువును శుభ్రపరిస్తే మార్కా పురం పట్టణ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చవచ్చు. చెరువు నీటిని రక్షిత తాగునీటి పథకం ద్వారా క్లోరినేషన్ చేసి ప్రజలకు అందించవచ్చు. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాల్సి ఉంది.

## అనధికార లోడు... ఆదాయం బోలెడు

విద్యుత్తుశాఖ అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ ఇస్తూ ప్రభుత్వం చేసిన ప్రకటనకు చక్కటి స్పందన లభించింది. గతేడాది మార్చి 1వ తేదీ నుంచి డిసెంబరు నెలాఖరు వరకు దరఖాస్తులు స్వీకరించారు. ప్రస్తుతం ఇంట్లో పెరిగిన ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకానికి అనుగుణంగా అదనపు లోడు చెల్లించారు. ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని 50,909 విద్యుత్తు సర్వీసులకు సంబంధించి క్రమబద్ధీకరణ దరఖాస్తు నిమిత్తం 84,977 కిలోవాట్ల అదనపు లోడుకు రూ.10,45,91,460 మేర నగదు జమ చేశారు. ఇంట్లోని విద్యుత్తు పరికరాల వినియోగం ఆధారంగా లోడు అంచనా వేశారు. ఒక్కో కిలో వాట్‌కు రూ.1,250 చొప్పున ఎంత అదనపు లోడు ఉన్నా క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ ఇచ్చారు. దీంతో ఎక్కువ మంది వినియోగదారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు.

**పెరిగిన విద్యుత్తు వినియోగం**

కొత్తగా విద్యుత్తు కనెక్షన్ మంజూరు నిమిత్తం గ్రామాల్లో ప్రస్తుతం కనీసం కిలో వాట్, పట్టణాల్లో రెండు కిలోవాట్ చొప్పున దరఖాస్తు చేయిస్తున్నారు. పదేళ్ల కిందట గృహాల్లో ఉండే ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం ఆధారంగా 0.5 కిలోవాట్ లోడ్‌కు మాత్రమే రుసుం చెల్లించేవారు. కాలక్రమేణా రైస్ కుక్కర్ నుంచి వాషింగ్ మిషన్, ఏసీ, రిఫ్రిజిరేటర్..ఇలా ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం పెరిగింది. ప్రత్యేకించి వేసవి కాలంలో ఎండ తీవ్రత దృష్ట్యా రేకుల ఇంట్లో నివాసిస్తున్న వారు కూడా ఏసీ వినియోగిస్తుండడంతో లో ఓల్టేజీ సమస్య పెరిగింది. దానికి అనుగుణంగా అవసరమైన చోట పరివర్తకాలు ఏర్పాటు చేయడంలో అధికారులు జాప్యం చేశారు. జిల్లావ్యాప్తంగా విద్యుత్తు అధికారుల బృందాలు తనిఖీలు నిర్వహించి అదనపు లోడు రుసుం విధిస్తున్నారు. మా ఇంట్లో అన్ని వస్తువులు లేవు...రుసుం తగ్గించాలంటూ..పునఃపరిశీలనకు కొందరు అర్జీ పెట్టడం...మరికొందరు రుసుం చెల్లించడంలో జాప్యం చేస్తున్నారు. దీంతో అదనపు లోడు నియంత్రికలు ఏర్పాటుకు నిధుల సమస్య వెంటాడుతోంది. తాజాగా ఖజానాకు నిధులు సమకూరడంతో నాణ్యమైన విద్యుత్తును అందించే దిశగా అవసరమైన చోట పరివర్తకాలు ఏర్పాటు చేయనున్నారు.

## దిగొచ్చిన గుడ్డు ధర

ఎలమంచిలి : జిల్లాలో కోడిగుడ్ల ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. గతనెలలో రికార్డు స్థాయిలో ధర పలికిన గుడ్డు మళ్లీ అదే స్థాయిలో తగ్గింది. వంద గుడ్ల ధర రూ. 775 నుంచి రూ.575కి దిగివచ్చింది. రిటైల్‌గా ఒక్కొక్కటి రూ. 2 వరకు తగ్గడంతో రైతులకు మళ్లీ నష్టాలు ప్రారంభం అయ్యాయి. మన రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి పెరగడం, చలికాలంలో గుడ్డు వినియోగం ఎక్కువగా ఉండటంలో డిసెంబరు 22 నాటికి ధర రికార్డు స్థాయికి చేరుకుంది. నెలాఖరు వరకూ అదే ధర కొనసాగింది. జనవరి నుంచి మళ్లీ తగ్గుముఖం పట్టింది. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి కోల్‌కతా, అసోం, బిహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ ప్రాంతాలకు గుడ్లు ఎక్కువగా ఎగుమతి అవుతాయి. ప్రస్తుతం అక్కడా ఉత్పత్తి పెరగడంతో ధర తగ్గిందని పెంపకందారులు చెబుతున్నారు

**ఆనందం లేకుండా పోయింది**

గుడ్డు ధర పెరిగింది మంచి లాభాలు వస్తున్నాయన్న ఆనందం లేకుండా పోయింది. ఒక్క నెల మాత్రమే ధర బాగుంది. ఇదే ధర మరో రెండు



నెలలు ఉంటే బాగుండేది. లాభాల బాట పడుతున్న రైతులు ఒక్కసారిగా మళ్లీ నష్టాల్లోకి పోయారు. చలికి పెద్దవి, పిల్లకోళ్లు చనిపోవడంతో ఆర్థికంగా నష్టపోయాం. ఎగుమతులు తగ్గడంతో ధర తగ్గిపోయింది. పాపారెడ్డి, పౌల్ట్రీ రైతు ఎలమంచిలి

ఉమ్మడి విశాఖ జిల్లాలో గుడ్లు పెట్టే కోళ్లు : 21 లక్షలు

రోజుకు ఉత్పత్తి : 20 లక్షలు

ఒక్కో కోడికి సగటున అవుతున్న ఖర్చు : రూ. 370

ఏడాదిలో కోడిపెట్టే గుడ్ల సంఖ్య : 340

గుడ్డుకు రైతు సగటున పెడుతున్న ఖర్చు : రూ.5.10

రైతుకు లభిస్తున్న ధర : రూ. 5.75

చిల్లరన మార్కెట్‌లో ధర : రూ. 7

## కంది రైతు కంట కన్నీళ్లు

కర్నూలు : మద్దతు ధరతో కందులు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ఊరించింది. చాలా ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఉన్న ప్రాంతాల్లో అంతంతమాత్రమే కొనుగోళు సాగుతుండటంతో రైతులు మార్కెట్‌కు సరకును తరలిస్తున్నారు. ఇదే అవకాశంగా వ్యాపారులు ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. తమ సమస్యను అధికారులకు విన్నవిస్తే గిట్టుబాటు కాకుంటే వెనక్కు తీసుకెళ్లండని సలహా ఇచ్చారు. సరకును ఇంటికి తీసుకెళ్లలేక.. తక్కువ ధరకు అమ్ముకోలేక అన్నదాతలు నరకయాతన అనుభవిస్తున్నారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం కందుల దిగుబడులు పోటెత్తాయి. కర్నూలు జిల్లాతోపాటు అనంతపురం జిల్లా నుంచి రైతులు సరకు తీసుకొచ్చారు. వరుసగా మూడు, నాలులు రోజులు వస్తుండటంతో రైతులు సరకును భారీగా తీసుకొచ్చారు.

4,254 క్వింటాళ్ల దిగుబడులు రాగా క్వింటా కనిష్ఠ ధర రూ.2,000, మధ్యస్థ ధర రూ.6,789, గరిష్ఠ ధర రూ.7,300 పలికింది. మార్కెట్కు పెద్ద ఎత్తున దిగుబడులు రావడంతో వ్యాపారులు సిండికేటయ్యారు. క్వింటాపై రూ.300 నుంచి రూ.500 వరకు ధర తగ్గించి కొనుగోలు చేశారు. మధ్యస్థ ధర పేరుతో ఎక్కువగా క్వింటా రూ.3 వేలకు కొనుగోలు చేస్తున్నారు.వ్యాపారుల తీరును నిరసిస్తూ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద రైతులు ఆందోళన చేశారు. ఇంత జరుగుతున్నా ఏ ఒక్క అధికారి పరిశీలన చేయలేదు. వ్యాపారులకే మద్దతు పలికారు. నాణ్యత ప్రమాణాలు లేవని.. సరకు పచ్చిగా ఉందంటూ క్వింటా రూ.3,000, రూ.3,500కు కొనుగోలు చేయడం దారుణమని రైతులు మండిపడ్డారు."మీకు నచ్చితే విక్రయించండి.. లేకుంటే వెనక్కు తీసుకెళ్లండి" అని మార్కెట్ కమిటీ అధికారులు తెగేసి చెప్పడంతో అన్నదాతలు బిత్తరపోయారు. అధికారులు వ్యాపారుల వైపు మాట్లాడటంతో అన్నదాతలు తీవ్రంగా మండిపడ్డారు.

**కొర్రీలు పెట్టి ధరలో కోత**

ప్రభుత్వ మద్దతు ధర రూ.8 వేలు ఉండగా.. మార్కెట్‌లో క్వింటా రూ.6,400కు కొనుగోలు చేయడం దారుణమని డోన్ మండలం కొత్తకోట గ్రామ రైతు డి.శాంతరాజు పేర్కొన్నారు. తమ పంటను క్వింటా రూ.6,300కు అడిగారని శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సరకు నాసిరకంగా ఉందంటూ క్వింటా రూ.3,200కు కొనుగోలు చేస్తున్నారని సురేష్ వాపోయారు.

## కందుల కొనుగోలుకు కసరత్తు!

ఒంగోలు : కంది పంట ఈనెలాఖరు నుంచి రైతుల చేతికందనుంది. దిగుబడులొచ్చిన వెంటనే దళారుల మాయజాలంతో ధరలు అమాంతం పతనమవుతున్నాయి. రైతులకు కష్టాలు ఎదురవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కందులు కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే రైతుల నమోదు ప్రక్రియ ప్రారంభించింది.వర్షాధారంగా పంటలు పండే జిల్లాలో కందులు అత్యధిక విస్తీర్ణంలో సాగవుతున్నాయి. గతేడాది ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.7,650 ఉండగా, బయట మార్కెట్‌లో మాత్రం వ్యాపారులు రూ.6,600 చొప్పున కొనుగోలు చేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా గతేడాది 26 వేల మెట్రిక్ టన్నుల కందులను రైతుల నుంచి సేకరించింది. ఈ ఏడాది ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో సంయుక్త కలెక్టర్ గోపాలకృష్ణ మార్క్‌ఫెడ్, వ్యవసాయశాఖ, సహకారసంఘాల అధికారులతో సమావేశాలు నిర్వహించారు. ఈ నెల 13న మరోసారి సమావేశం నిర్వహించి ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలనేదానిపై నిర్ణయం తీసుకోనున్నారు. కందుల సేకరణ విషయమై రైతు సేవా కేంద్రాల్లో రైతులు తమ వివరాలు నమోదు చేయిస్తున్నారు. ఇప్పటివరకు 600 మంది వరకు రైతులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ ఏడాది తొలి విడతలో 12 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతులు వచ్చాయి.

రూ.8 వేలు మద్దతు ధర జిల్లాలోని సహకార సంఘాల్లో 40 నుంచి 45 కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఒక్కో రైతు నుంచి రోజుకు 40 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయనున్నారు. తేమ శాతం 12 శాతం ఉంటే ప్రభుత్వం పెంచిన మద్దతు ధర ప్రకారం క్వింటాకు రూ.8,000 ఇవ్వనున్నారు. ఈ మేరకు సొసైటీల్లో తేమ శాతం తూచే యంత్రాలు, జల్లెడలు, బయోమెట్రిక్ పరికరాలు సిద్ధం చేస్తున్నారు. రైతుల ఖాతాలోనే నేరుగా నగదు జమ చేయనున్నారు. సీఎం యాప్‌లో నమోదు ఈ–క్రాప్‌లో పంట వివరాలు నమోదు చేయించుకున్న కంది రైతులు తన పంటను విక్రయించుకునేందుకు ముఖ్యమంత్రి యాప్‌లో వివరాలు పేర్కొనాలి.

# చిట్టిచేతులతో గట్టి ఎత్తులు

హిందూపురం : బాల్యం అంటే బడికి వెళ్లటం ఇంటికి చేరుకొన్న వెంటనే ఆటల్లో మునిగి తేలటం ఇది ప్రతి విద్యార్థి చేసే పనులు.. అయితే హిందూపురం పట్టణం ముక్కడిపేటకు చెందిన కె.సాయిఈశ్వర్ ఒకటో తరగతి నుంచే చదరంగంపై మక్కువ పెంచుకొన్నాడు. శిక్షణ పొంది బెంగళూరు, కర్నూలులో జరిగిన పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాడు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతూ తల్లిదండ్రులు శ్వేత, శ్రీహర్ష ప్రోత్సాహంతో ఆన్‌లైన్‌లో కోచ్ గోపీనాథ్ నుంచి మెలకువలను నేర్చుకుని ఆటలో ఆరితేరాడు.

**అంతర్జాతీయ రేటింగ్‌లో..**



సాయిఈశ్వర్ ఇప్పటికే అనేక పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటగా గత డిసెంబరులో బెంగళూరులో జరిగిన 'కన్నూర్ బి లో 1800క్లాసిక్ టోర్నమెంటలో ఈఎల్‌ఓ 1569 రేటింగ్ సాధించాడు. గతేడాది తుమకూరులో నవంబరు 30న జరిగిన అంతర్జాతీయ రాపిడ్ టోర్నమెంట్లో ఈఎల్‌ఓ 1410 రేటింగ్ సాధించాడు. భవిష్యత్తులో గ్రాండ్‌మాస్టర్ స్థాయికి ఎదగాలని ముంబయికి చెందిన కోచ్‌తో ఆన్‌లైన్‌లో శిక్షణ తీసుకుంటానని చెబుతున్నాడు ఈ బుడతడు.

# ఎర్రబారిన కుశస్థలి

నగరి : నగరి కుశస్థలి నదిలో రెండ్రోజులుగా మునుపెన్నడూ లేనివిధంగా డైయింగ్ యూనిట్ల నుంచి విడుదలయ్యే రసాయనాల రంగునీటి వ్యర్థాలు ఏరులై పారుతున్నాయి. నది కాస్త ఎర్రనదిగా మారింది. దీంతో సాగు, భూగర్భ జలాలతో తాగునీటి అవసరాలు తీర్చుతున్న నది ప్రమాదకరంగా మారుతోంది. రసాయనాల కాలుష్యంపై ఇటీవలే ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ధర్నా చేసి తమ అభ్యంతరాలు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదని స్థానికులు వాపోతున్నారు.

**తమిళనాడు నుంచి వచ్చి..**

కొందరి స్వార్థం, వారి ఆదాయం కోసం తమిళనాడు నుంచి వస్త్రాలు నగరికి తెచ్చి ఇక్కడ రంగులద్ది, ఆ విషపూరిత నీటిని నదిలో వదులుతున్నారు. కేవలం అద్దెకు డైయింగ్ యూనిట్లు నడుపుతున్న వారి కారణంగా లక్షల లీటర్ల రసాయనాల వ్యర్థాలు ఇలా నదిలో ప్రవహిస్తున్నాయి. వాస్తవానికి రంగునీటిని శుద్ధి చేయాల్సిన ఈటీపీ



మూలనపడ్డాయి. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నది: కుశస్థలి ప్రాంతం: నగరి, సత్యవేడు నియోజకవర్గాలు (ఒక్క పిచ్చాటూరు మండలం)

దీనికింద ప్రాజెక్టులు: సత్రవాడ, బుగ్గ

వీటి కింద అనుసంధాన చెరువులు: 43

మొత్తం ఆయకట్టు: ఆరువేల ఎకరాలు పైనే

తాగునీటి అవసరాలు: 15 గ్రామాలకు

డైయింగ్ యూనిట్లు: మాన్యువల్- 43, యంత్రాలు-16

నిత్యం వెలువడే రసాయనాలు: 10 లక్షల లీటర్లపైనే

# కొండను కొల్లగొట్టి.. భూమిని చెరబట్టి

చిత్తూరు : మండలంలో కాస్త పలుకుబడి ఉండే చోటామోటా నాయకులు రాజకీయంగా.. రెవెన్యూ అధికారులను తమ గుప్పిట్లో పెట్టుకుని చిత్తూరు నగర సరిహద్దు గ్రామాల్లో భూ ఆక్రమణకు పాల్పడుతున్నారు. ఇందుకు ఉదాహరణే చిత్తూరు గ్రామీణ మండలంలోని గువ్వకల్లు పంచాయతీ దిగువకండ్రిగ. వైకాపా హయాంలో ఈ పంచాయతీల్లో దాదాపు 15 ఎకరాల మేర భూ ఆక్రమణకు పాల్పడిన ఘటనలు అనేకంలో ప్రచురితమైన వరుస కథనాలతో అధికారులు భూ ఆక్రమణకు కళ్లెం వేశారు. తాజాగా ఓ వ్యక్తి తన మామిడి తోట సమీప కొండ గుట్టపై కన్నేశాడు. ఐదెకరాల భూమి తన తోటలో కలుపుకొనేందుకు పథకం వేశాడు. తహసీల్దార్ కార్యాలయంలో ఓ కింది స్థాయి సిబ్బంది అండతో కొండను తొలిచి, ఆపై మట్టి విక్రయించేసి చేబులు నింపుకొని ఐదెకరాల భూమి ఆక్రమణకు పావులు కదిపాడు. నెల రోజులుగా ఈ ప్రక్రియ వేగం చేస్తున్నాడు. ఇటీవల దీనిపై "గుట్ట గుటుక్కు' శీర్షికతోలో కథనం ప్రచురితమైంది. స్పందించిన తహసీల్దారు కల్యాణి క్షత్రస్థాయిలో పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. ఆ భూములకు పట్టా ఉందని, తమకు రాజకీయ పలుకుబడి ఉందని చెప్పి భూ ఆక్రమణకు ఎవరూ అడ్డుపడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మళ్లీ ఆ వ్యక్తి బుధవారం నుంచి జేసీబీతో మట్టి తవ్వకాలు చేపట్టి కొండను చదును చేయడం మొదలుపెట్టాడు.

**ఆక్రమణదారులపై ఉపేక్షంచం..**

దిగువకండ్రిగ కొండగుట్ట తవ్వకాలు నిలిపేశాం. ఏవైనా రికార్డులు ఉంటే తీసుకురావాలని ఆదేశించా. వాటిని పరిశీలించి, ఆక్రమణ అని తేలితే చర్యలు తీసుకుంటాం. ఎవరినీ ఉపేక్షంచేది లేదు.

కల్యాణి, తహసీల్దార్, చిత్తూరు గ్రామీణ

# ఒకసారి పండితే చేతికొస్తూనే ఉంటుంది!



పెద్దపప్పూరు : వంటకాల్లో వడ్డించాక పక్కకు తీసేసే కరివేపాకునే. రైతులు మాత్రం నమ్మకమైన పంటగా దగ్గరకు తీసుకుంటున్నారు. శ్రమ, పెట్టుబడి తక్కువగా ఉండడంతోపాటు అనంతపురం జిల్లాలో రెండు వేల ఎకరాల్లో పంట సాగులో ఉండి వాణిజ్యపరంగా వేగంగా విస్తరిస్తోంది. తాడిపత్రి నియోజకవర్గంలో పంట సాగు తక్కువ సమయంలోనే వెయ్యి ఎకరాలకు చేరడం విశేషం.

**అనుకూలతలు..**

బిందుసేద్యానికి సరిపోయే పంట. మొదట పెట్టిన పొలంలో ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి ఉంటుంది.

సాగు చేసిన ఆరు నెలల్లో పంట చేతికి వచ్చేస్తుంది. ఏడాదికి రెండుసార్లు చేతికి వచ్చే నమ్మకమైన పంట.

పంటకు కాల పరిమితి లేదు. కోసిన అనంతరం నీటిని, ఎరువులను అందిస్తే చాలు మళ్లీ చేతి కొస్తూనే ఉంటుంది. అయితే డిసెంబరు నుంచి జనవరిలో చేతికి వచ్చే పంటకు అధిక ధర లభిస్తుంది. ప్రస్తుతం టన్ను ధర రూ.50 వేలు పలుకుతుండడంతో మంచి లాభాలున్నాయి.

**పొలాల వద్దకే ..**

తాడిపత్రి మండలంలో యర్రగుంటపల్లి, రావివెంకటాంపల్లి, పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట, పెద్దపప్పూరు, షేక్‌పల్లి, శింగనగుంటపల్లి, తబ్జుల తదితర గ్రామాల పరిధిలో అధికంగా పంట సాగు ఉంది.

దిగుబడి: ఎకరాకు 8 టన్నులు

**ఎగుమతి.. ఉపాధి** వ్యాపారస్థులు పొలాల వద్దకు వచ్చి నేరుగా పంటను కొనుగోలు చేస్తున్నారు. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై పట్టణాలకు వారు పంటను తరలించి విక్రయిస్తున్నారు. నవంబరు నుంచి ఫిబ్రవరి మధ్య తాడిపత్రి పరిధి నుంచి నిత్యం 80 టన్నుల దిగుబడి వస్తోంది. నిత్యం రూ.40 లక్షల వ్యాపారం జరుగుతోంది. వందల మంది కూలీలకు ఉపాధి లభిస్తోంది.

# తవ్వేసి.. దోచేసి!



తాడిపత్రి : తాడిపత్రి పరిసరాల్లోని పెన్నా నుంచి ఇసుకను యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. అక్రమార్కులు నదిలో నుంచి పట్టపగలే ట్రాక్టర్లతో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో పలు చోట్ల ప్రమాదకర రీతిలో గుంతలు ఏర్పడుతున్నాయి. ఈ దందా అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. పెన్నా సుమారు 64 కిలోమీటర్ల పొడవు, ఒక కిలోమీటరు వెడల్పుతో ఉంటుంది. తాడిపత్రి మండలంలో 12 కిలోమీటర్ల మేరకు విస్తరించింది. దాని పరిధిలో అనేక చోట్ల ఇసుకను తోడుతున్నారు. హుస్సేనాపురం, ఆలూరు, బోడాయిల్లి, అక్కన్నపల్లి, సజ్జలదిన్నె, తాడిపత్రి పట్టణంలోని పాత, కొత్త వంతెనలు, నందలపాడ, చిన్నపొలమడ తదితర ప్రాంతాల్లో దందా సాగుతోంది.


**నిల్వ ఉంచి..**

ఆయా ప్రాంతాల నుంచి రోజూ సుమారు 100 ట్రాక్టర్లు, టిప్పర్లలో ఇసుక తరలిపోతోంది. తాడిపత్రి పట్టణంతోపాటు ఇతర ప్రాంతాలలో ట్రాక్టర్ ఇసుకను రూ.1500-1700 వరకు విక్రయిస్తున్నారు. ఇక టిప్పర్లలో నంద్యాలకు అక్రమ రవాణా చేస్తున్నారు. అక్కడ ఒక టిప్పరు ఇసుక రూ.30 వేల వరకు అమ్ముతున్నారు. కొందరు రాత్రి వేళల్లో ఇసుకను తీసుకొచ్చి కొన్ని చోట్ల నిల్వ చేస్తున్నారు. దాన్ని తెల్లవారుజామున టిప్పర్ల సాయంతో తరలిస్తున్నారు. మరికొందరు సజ్జలదిన్నె, తాడిపత్రి పట్టణంలోని పలు ఇటుకల బట్టీలను కేంద్రాలుగా చేసుకుని.. నిల్వ ఉంచి అక్రమ రవాణా చేస్తున్నారు. గత ఏడాది అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు. అయినా ఎలాంటి ఫలితం కనిపించడం లేదు.

**ప్రత్యేక నిఘా ఉంచుతాం.. – రోహిత్‌కుమార్ చౌదరి, ఏఎస్పీ తాడిపత్రి**

పెన్నా నుంచి అక్రమంగా ఇసుక తరలించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతాం. ఆయా ప్రాంతాల్లో పోలీసు సిబ్బందితో తనిఖీలు నిర్వహించి డంప్‌లను జప్తు చేస్తాం. నదిలో సిబ్బందితో తనిఖీలు చేసి అక్రమంగా తరలించే వాహనాలను స్వాధీనం చేసుకుంటాం.

# పట్టని ఆరోగ్య కేంద్రాలు




పుట్టపర్తి : పట్టణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన పట్టణ ఆరోగ్య కేంద్రాలు గాడి తప్పాయి. ప్రస్తుతం వాటిని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌గా పిలుస్తున్నారు. ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన ఆసుపత్రులు వైద్యులు, సిబ్బంది, మందుల కొరతతో ఎవరికీ పట్టని ఆరోగ్య కేంద్రాలుగా మారాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ధర్మవరం 6, హిందూపురం 5, కదిరి 4, మడకశిర, పెనుకొండ, పుట్టపర్తిలలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 18 ఆరోగ్య కేంద్రాలున్నాయి. పెనుకొండలోని జీఐసీకాలనీలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న ఆరోగ్య కేంద్రం. రోజూ 30 మంది వరకు వస్తుంటారు. 10 పడకల కేంద్రం నిర్వహణకు భవనం సరిపోకపోవడంతో సామగ్రిని అటకెక్కించారు. అర్బన్‌కాలనీలో 2021, జూన్ 6న అప్పటి వైకాపా ప్రభుత్వం రూ.80 లక్షలతో భవన నిర్మాణం చేపట్టింది. 70 శాతం వరకు పూర్తి చేసి నిలిపేసింది.

శివాలయం వీధిలో ఏర్పాటు చేసిన పుట్టపర్తి పట్టణ ఆరోగ్య కేంద్రం ఇది. రోజూ 40 మంది వైద్యం కోసం వస్తుంటారు. ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో పరికరాలు నిరూపయోగంగాఉన్నాయి. మూడు నెలలుగా ఫార్మసిస్టు లేక స్టాఫ్‌నర్సే ఆ విధులూ నిర్వర్తిస్తున్నారు. భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్నారు.

**ఇన్‌ఛార్జిలే దిక్కు..**

జిల్లాలోని ఆయా కేంద్రాల్లో కేవలం 8 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. పుట్టపర్తి, పెనుకొండ, మడకశిరలో వైద్యులు లేరు. మిగిలినచోట్ల సగం మందే ఉన్నారు. లేనిచోట్ల ఇన్‌ఛార్జులు పని చేస్తున్నారు. దీంతో కింది స్థాయి సిబ్బందే సేవలందిస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్లను ఒప్పంద ప్రాతిపదికన నియమించినా జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదని వాపోతున్నారు.

ల్యాబ్ పరీక్షల్లో కీలకమైన సీబీపీ కిట్ల కొరత వేధిస్తోంది. చక్కెర వ్యాధి బాధితులకు ఇన్సులిన్ అందుబాటులో లేదు.

**సమయపాలన ఏదీ..?** పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, లాస్ట్‌గ్రేడ్ సర్వీసు (ఎల్‌జీఎస్) ఒక్కొక్కరు వంతున ఉండాలి. సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. చాలాచోట్ల ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు చేసి నివేదికలిస్తున్నారు. గుండె, థైరాయిడ్, కాలేయం, మూత్రపిండాలను సంబంధించి రక్త నమూనాలు సేకరించి ప్రాంతీయ ఆసుపత్రులకు పంపాల్సి వస్తోంది. రక్తహీనతతో బాధపడే గర్భిణులకు కొన్ని కేంద్రాల్లో ఐరన్ ఇంజెక్షన్లు అందుబాటులో లేవు.

**తగిన చర్యలు తీసుకుంటాం..**

– నాగేంద్రనాయక్, డీసీహెచ్‌వో

పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వానికి నివేదించాం. ప్రస్తుతం ఉన్నవారు సమయపాలన పాటించేలా చూస్తాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వైద్యపరీక్షలు, మందులు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

# అన్వేష.. నింగి దిశ

తిరుపతి: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) 2026లో తొలి ప్రయోగానికి సర్వం సిద్ధం చేసింది. దేశ రక్షణ రంగానికి అత్యంత కీలకమైన 'ఈఓఎస్-ఎన్1' లేదా 'అన్వేష' ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టేందుకు శాస్త్రవేత్తలు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి ఈ నెల 12న ఉదయం 10.17 గంటలకు పీఎస్‌ఎల్‌వీ-సీ62 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది.

**పీఎస్‌ఎల్‌వీ-సీ61 వైఫల్యం తర్వాత ఇదే..**

న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్(ఎన్‌ఎస్‌ఐఎల్) చేపట్టిన 9వ పూర్తిస్థాయి వాణిజ్య మిషన్ ఇది. పీఎస్‌ఎల్‌వీ సిరీస్‌లో ఇది 64వ ప్రయోగం కాగా, రెండు స్ట్రాప్-ఆన్ మోటార్లు కలిగిన డీఎల్ వేరియంట్‌లో ఇది 5వ మిషన్ కావడం విశేషం. గత ఏడాది మేలో జరిగిన పీఎస్‌ఎల్‌వీ-సీ61 వైఫల్యం తర్వాత జరుగుతున్న ప్రయోగం కావడంతో ఇస్రో దీనిని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.

**వినూత్నంగా 'కిడ్' రీ-ఎంట్రీ**

ఈ మిషన్‌లో అత్యంత ఆసక్తికరమైన అంశం 'కిడ్' ప్రయోగం. ఉపగ్రహాలను కక్ష్యలోకి వదిలిన తర్వాత, రాకెట్ నాలుగో దశ(పీఎస్4)ను తిరిగి మండించి భూమి వైపు మళ్లిస్తారు. అప్పుడు స్పెయిన్‌కు చెందిన 'కిడ్' క్యాప్సూల్ రాకెట్ నుంచి విడిపోయి, భూ వాతావరణంలోకి ప్రవేశించి, దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో పడేలా ప్లాన్ చేశారు. భవిష్యత్తులో పునర్ వినియోగ రాకెట్ల తయారీకి ఈ ప్రయోగం



కీలకం కానుంది.

**మిషన్ ముఖ్యాంశాలు ఇవే..**

ఈ ప్రయోగం ద్వారా మొత్తం 16 పేలోడ్లను అంతరిక్షంలోకి పంపనున్నారు. ఈ మిషన్‌లో ప్రధాన ఉపగ్రహం ఈఓఎస్-ఎన్1. రక్షణ, పరిశోధన, అభివృద్ధి సంస్థ కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ హైపర్ స్పెక్ట్రల్ ఇమేజింగ్ ఉపగ్రహం, సరిహద్దుల్లో నిఘాకు, వ్యవసాయం, విపత్తుల నిర్వహణకు ఉపయోగపడనుంది.

ప్రధాన ఉపగ్రహంతో పాటు భారత్, యునైటెడ్ కింగ్‌డమ్, థయ్‌లాండ్, బ్రెజిల్, స్పెయిన్, నేపాల్ తదితర దేశాలకు చెందిన 15 చిన్న ఉపగ్రహాలు కూడా నింగిలోకి వెళ్లనున్నాయి.

రాకెట్ సాంకేతిక వివరాలు

ఎత్తు: 44.4 మీటర్లు

బరువు: 260 టన్నులు దశలు: ఘన, ద్రవ ఇంధనాలతో కూడిన 4 దశలు. వేరియంట్: రెండు స్ట్రాప్-ఆన్ మోటార్లు కలిగిన పీఎస్‌ఎల్‌వీ-డీఎల్ రకం.

# అనధికార పెత్తనం.. అవినీతికి అందలం

తిరుపతి : జిల్లాలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో అనధికార ఉద్యోగుల పెత్తనం సాగుతోంది. రోజుకు 10 - 30 ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరిగే కార్యాలయాలలో ముగ్గురు, నలుగురు ఉద్యోగులే ఉంటున్నారు. పనిభారం పెరగడంతో సబ్ రిజిస్ట్రార్లు అనధికార ఉద్యోగులను నియమించుకుంటున్నారు. కొందరు వారితో అవినీతి దందాకు పాల్పడుతున్నారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన అనిశా దాడుల్లో అనధికార ఉద్యోగుల వద్ద నగదు లభ్యమైంది.

**సచివాలయ ఉద్యోగులు ఉన్నా..**

గత ప్రభుత్వం గ్రామ సచివాలయాలలో ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించింది. విధివిధానాల అమలు సరిగాలేకపోవడంతో పథకం అమలు నిర్వీర్యమైంది. సచివాలయ సిబ్బందిని అవసరం ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో విధులు కేటాయిస్తే.. బాధ్యతగా నిర్వహిస్తారు. దీంతో జవాబుదారీతనం పెరిగి.. అవినీతి తగ్గే అవకాశం ఉంటుంది.

**ప్రతిచోటా నలుగురైదుగురు..**

తిరుపతి జిల్లాలో 16 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. సబ్ రిజిస్ట్రార్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను మాత్రమే ప్రభుత్వం నియమిస్తోంది. అధిక సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరిగే కార్యాలయాలలో మరో జూనియర్ అసిస్టెంట్, ఒక అటెండర్‌తో భర్తీ చేస్తోంది. ఆ సిబ్బందే పత్రాల పరిశీలన, విలువకు తగ్గట్టుగా బ్యాంకులో చలనా చెల్లించారా అనే పర్యవేక్షణ, ఆ తర్వాత అసైన్ నంబరు ఇచ్చి.. క్రయ, విక్రయదారులు, సాక్షల బయోమెట్రిక్, వేలిముద్రలు తీసుకోవాలి. రిజిస్ట్రేషన్ అనంతరం పది నిమిషాల్లో డాక్యుమెంట్లు కొనుగోలుదారుడికి అప్పగించాలి. ఇలా జరిగే ప్రతి రిజిస్ట్రేషన్‌ను పర్యవేక్షంచాల్సి ఉంది. దీంతో ప్రతి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నలుగురు, ఐదుగురు ఉద్యోగులను విధుల్లో పెట్టుకుంటున్నారు. వారితో కీలకమైన బయోమెట్రిక్, చెక్ స్లిప్పులు, రికార్డుల పరిశీలన, ఈసీ, నకళ్లు అందజేసే పనులు అప్పగిస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్ లాగిన్ ద్వారా అనధికార ఉద్యోగులు చేసే పనుల్లో అవకతవకలకు పాల్పడే ఆస్కారం ఎక్కువగా ఉంది.

కనిపించని అనిశా నంబర్లు..

అవినీతి నిరోదక శాఖ (అనిశా) అధికారుల నంబర్లు జిల్లాలోని ఏ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ కనిపించడం లేదు. ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక చాలామంది నిమ్మకుండి పోతున్నారు.

ఫిర్యాదు చేయండి.. 94404 46130, 94404 46193

# నెట్టికంటయ్య భక్తులకు అల్పాహారం

గుంతకల్లు : ఎంతో ప్రసిద్ధి చెందిన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి సన్నిధికి మన రాష్ట్రంతోపాటు తెలంగాణ, కర్ణాటకల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. వారికి ఏ లోటూ లేకుండా తగిన సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇప్పటికే కోట్లది రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేపట్టిన అధికారులు... మరో ముందడుగు వేశారు. భక్తుల ఆకలి తీర్చేందుకు అల్పాహార పథకాన్ని తీసుకొచ్చారు. స్వామి వారి దర్శనానికి వచ్చి.. రాత్రి బస చేసే భక్తుల కోసం ఉచితంగా అల్పాహారం అందిస్తున్నారు. వృద్ధులు, పిల్లల కోసం వేడి పాలు పంపిణీ చేపట్టారు. ఈ సదుపాయం ప్రతి రోజూ రాత్రి 7.30 గంటల నుంచి 9.00 వరకు ఉంటుంది.

ఇక ప్రతి రోజూ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 3 గంటల



వరకు అన్నప్రసాదం అందిస్తున్నారు. అన్నం, పప్పు, రసం, కూరగాయలతో తాళింపు, పెరుగు వడ్డిస్తున్నారు.

**వెయ్యి మందికి అన్నప్రసాదం**

గతంలో 300 మంది భక్తులకు మాత్రమే మధ్యాహ్నం పూట ఉచితంగా అన్నప్రసాదం అందించేవారు. నాలుగు నెలల కిందట కొత్తగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణలో ప్రస్తుతం వెయ్యి మందికి పైగా భక్తులకు అన్నప్రసాదం అందజేస్తున్నారు.

**ఇబ్బందులు పడకూడదని..**

–విజయరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం, కసాపురం

నాణ్యమైన సోనామసూరి బియ్యం, కూరగాయలతో భక్తులకు రుచికరమైన అన్నప్రసాదం, అందిస్తున్నాం. స్వామి సన్నిధిలో రాత్రి నిద్ర చేయడానికి వచ్చే భక్తులు ఆకలితో ఇబ్బందులు పడకూడదని అల్పాహారంతో పాటు అవసరమైన వృద్ధులు, పిల్లలకు వేడి పాలు అందిస్తున్నాం. పథకాన్ని మరింత విస్తృత పరుస్తాం.

# మ్యాజిక్ డ్రెయిన్.. మురుగు ఇంకెన్

కల్లూరు : రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో మురుగునీటి సమస్యను పరిష్కరించడానికి మ్యాజిక్ డ్రెయిన్లను నిర్మిస్తోంది. ఇది తక్కువ ఖర్చుతో కూడిన, దుర్వాసన లేని పర్యావరణ అనుకూలమైన వ్యవస్థ. ఇది గృహ వ్యర్థ జలాలను సహజంగా మట్టిలోకి ఇంకేలా చేస్తుంది. పులిచెర్ల మండలంలో రాజులపల్లె పంచాయతీ పెద్దఎస్సీ కాలనీని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి మ్యాజిక్ డ్రెయిన్‌ను నిర్మించారు. ఇది విజయవంతం కావడంతో... మిగతా పంచాయతీకు విస్తరించనున్నారు.

**ఖర్చు తక్కువ**సాధారణ మురుగు కాలువ నిర్మాణానికి 100 మీటర్లకు రూ.4.50 లక్షలు ఖర్చవుతుంది. అదే మ్యాజిక్ డ్రెయిన్‌కు రూ.70 వేలు మాత్రమే అవుతుంది.

పెద్దఎస్సీ కాలనీలో 625 మీటర్ల మ్యాజిక్ డ్రెయిన్‌కు రూ.4.50లక్షల అంచనాతో ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతానికి 325 మీటర్ల పనులు పూర్తయ్యాయి.



**నిర్మాణం ఇలా**

అరమీటరు వెడల్పు 0.60 మీటర్ల లోతుతో కాలువ ఏర్పాటు చేస్తారు. 20 నుంచి 30 మీటర్లకు ఒకచోట మీటరు పైనే గుంత తవ్వుతారు. దీన్నే ఇంకుడు గుంతగా వ్యవహరిస్తారు.వంద మీటర్ల కాలువలో నాలుగు వరకు సిమెంటు పలకలు లేదా కడప బండలు పెడతారు.మొత్తం మూడు వరుసలు అంటే 75 నుంచి 100 ఎంఎం, 40 నుంచి 65 ఎంఎం, దానిపై 12 నుంచి 20 ఎంఎం కంకరను కాలువలో పరుస్తారు.ఇందులోకి వచ్చే ఏ నీరైనా సులువుగా ఇంకిపోతుందని ఏపీవో సౌభాగ్యవతి తెలిపారు. మధ్యలో ఉన్న ఇంకుడు గుంతలు నీటిని ఇంకింప చేసుకుంటాయని వివరించారు.

# సాగు యంత్రం.. సాగని ఉద్దేశం

చిత్తూరు : రైతులకు మేలు చేసే రూ.లక్షల విలువైన సాగు యంత్రాలు నిరుపయోగంగా మారి..పాడైపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీనికి నిదర్శనంగా చిత్తూరులోని ఏపీ ఆగ్రోస్ (వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ) నిలుస్తోంది. రైతుల శ్రేయస్సు కోసం ఆగ్రోస్ సంస్థను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేశారు. ఒకప్పుడు అన్నదాతకు ఎరువుల పంపిణీతో పాటు బుల్డోజర్, పొక్లెయిన్ లాంటి భారీ యంత్రాలను తక్కువ అద్దెతో ఇచ్చేవారు. ప్రస్తుతం అవి పాడవడంతో నిరుపయోగంగా మారాయి.

**చాలావరకు పాడయ్యాయి..**

వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు ఆధునాతన యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ట్రాక్టరు, వరి, వేరుసెనగ విత్తే యంత్రాలు, రొటోవేటరు, మడకలు, నూర్పిడి, గడ్డి కట్టలు కట్టే యంత్రాలను కొనుగోలు చేశారు. వీటికి సుమారు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలు ఖర్చు చేశారు. ఆరేళ్లుగా వినియోగించకపోవడంతో కార్యాలయంలో వృథాగా పడిఉన్నాయి.

ఒక్కరికే రెండు బాధ్యతలు జిల్లా భూసార సంరక్షణ శాఖ డీడీగా వ్యవహరిస్తున్న అధికారి ఆగ్రోస్ ఇన్‌ఛార్జి ఆర్ఎంగానూ కొనసాగుతున్నారు. ఈ విషయం ఇన్‌ఛార్జి ఆర్ఎం శశిచంద్రమౌళిరెడ్డి వద్ద ప్రస్తావించగా.. యంత్రాలను బాగు చేయించి, అద్దె ప్రాతిపదికన అందిస్తామన్నారు.

# గార్మెంట్స్‌కు మంచి రోజులు!



రాయదుర్గం : మాజీ రాష్ట్రపతి దివంగత డాక్టర్ అబ్దుల్ కలాం కలల సౌధం 'పుర'(ప్రొవిజన్ ఫర్ అర్బన్ ఫెసిలిటీ ఇన్ రూరల్ ఏరియా)లో భాగంగా రాయదుర్గంలో దశాబ్దాల కిందట రూ.1.50 కోట్లతో ఏర్పాటు చేసిన సీఎఫ్‌సీ(కామన్ ఫెసిలిటీ సెంటర్)కి మంచి రోజుల రానున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన వేలాది మంది మహిళలకు డీఆర్‌డీఏకు చెందిన వెలుగు సంస్థ ఆధ్వర్యంలో సీఎఫ్‌సీ పునఃప్రారంభానికి రంగం సిద్ధమైంది. దుర్గాదేవి మండల సమాఖ్యలోని సభ్యులకు శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. సీఎఫ్‌సీలోని కుట్టు యంత్రాలు, ఫ్యాన్లకు మరమ్మతులు చేస్తున్నారు. ట్యూబులైట్లు, తాగునీటి సౌకర్యం కల్పనకు చర్యలు చేపట్టారు.ఆరంభంలో సీఎఫ్‌సీ నిర్వహణ బాధ్యతలను ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ తీసుకున్నా.. ఆచరణలో సాధ్యం కాలేదు. తరువాత బెంగళూరుకు చెందిన ఒక ప్రైవేటు సంస్థకు బాధ్యతలు అప్పగించారు. కొన్నాళ్లపాటు అరకొరగా శిక్షణ కొనసాగినా.. నిర్వహణ లోపంతో మూతపడింది. దీంతో రూ.40 లక్షలతో ఏర్పాటు చేసిన 120 కుట్టు యంత్రాలు, ఇతర సామగ్రి నిరుపయోగంగా మారాయి.

**విస్తరణకు దోహదం**

మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త డిజైన్లతో దుస్తులు తయారు చేసి దేశంలోని ప్రముఖ కంపెనీలకు ఎగుమతి చేయటం.. మార్కెట్ సౌకర్యం కల్పించడం.. తద్వారా మహిళలకు ఉపాధి కల్పించే ఉన్నతాశయంతో ప్రారంభించిన సీఎఫ్‌సీని గాడిలో పెట్టే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సీఎఫ్‌సీ మళ్లీ అందుబాటులోకి వస్తే ఇక్కడ శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. దీంతో గార్మెంట్ విస్తరణకు మార్గం సుగమం కానుంది. మహిళలు ఉపాధితో ఆర్థిక స్వావలంబన పొందనున్నారు.

**అతి త్వరలోనే అందుబాటులోకి తెస్తాం**

– శైలజ, డీఆర్‌డీఏ పీడీ

సీఎఫ్‌సీని అతిత్వరలో పునఃప్రారంభిస్తాం. డీఆర్‌డీఏ, వెలుగు ఆధ్వర్యంలో మహిళలకు పకడ్బందీగా శిక్షణ కొనసాగిస్తాం. క్రమంగా వ్యాపారవేత్తల సహకారం తీసుకుంటాం. సరికొత్త డిజైన్లకు అనుగుణంగా కుట్లు, దుస్తుల తయారీపై తర్ఫీదు ఇప్పించి.. ఉపాధి పొందేలా చర్యలు తీసుకుంటాం.

# దిగుబడి దండిగా.. కొన్నది కొద్దిగా



అనంతపురం : పత్తితీతలు ఊపందుకున్నాయి. కూటమి ప్రభుత్వం పంటకు మద్దతు ధర ప్రకటించింది. జిల్లాలో తాడిపత్రి, గుత్తి వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేస్తామని పేర్కొంది. జిల్లా మార్కెటింగ్‌శాఖ సహకారంతో సీసీఐకు కొనుగోలు బాధ్యతలు అప్పగించింది. ఈనెల 3న అధికారులు గుత్తిలో కొనుగోళ్ల ప్రక్రియను ప్రారంభించారు. తాడిపత్రి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఇప్పటికీ మొదలు కాలేదు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. నాణ్యత పేరుతో తక్కువ ధరకు అమ్ముకోవాల్సి దుస్థితి వచ్చిందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా నల్లరేగడి నేలల్లో సాగవుతోంది. సుమారు తూర్పు, ఉత్తర మండలాల్లో ఎక్కువగా సాగైంది. గత ఖరీఫ్‌లో 30,110 హెక్టార్లలో సాగు చేశారు.

**మద్దతు ధర కల్పించినా..**

ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం పొడవు గింజ పత్తి రకం క్వింటాలు రూ.8,110, పొట్టి గింజ రకం క్వింటాలు రూ.7,770కు కొనుగోలు చేస్తున్నారు. కాగా తేమ, దుమ్ముధూళి, గుడ్డిపత్తి, రంగుమారిన, పురుగుపట్టిన కాయలు, విత్తన వడకలు తదితరాలను చూపుతా... పత్తి నాసిరకంగా ఉందంటూ సీసీఐ కొనుగోలు చేయడంలేదని రైతులు చెబుతున్నారు. మద్దతు ధర దక్కకపోవడంతో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని... నాణ్యత పేరుతో క్వింటాలు రూ.5వేల నుంచి 6 వేలకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో క్వింటాకు రూ.1500–2000 వరకు నష్టపోతున్నట్లు అన్నదాతలు వాపోతున్నారు.

**ఒక కేంద్రంతోనే సరిపెట్టి..**

గతంలో తాడిపత్రి, గుత్తి వ్యవసాయ మార్కెట్ యార్డుల నుంచి పత్తి కొనుగోలు చేసి... నంద్యాల, ఆదోనిలోని జిన్నింగ్ మిల్లులకు పంపారు. ఈ ఏడాది గుత్తిలో కొనుగోలు చేసే పత్తిని ఆదోని జిన్నింగ్ మిల్లులకు పంపుతున్నారు. తాడిపత్రిలో ఇప్పటికీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించకుండా అధికారులు చోద్యం చూస్తున్నారు. జిల్లా మార్కెటింగ్‌శాఖ, సీసీఐ నిర్లక్ష్యం ఫలితంగా పంటను అమ్ముకోలేకపోతున్నామని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కొనుగోలు చేయిస్తాం–రాఘవేంద్రకుమార్, సహాయ సంచాలకులు, మార్కెటింగ్ శాఖ**

తాడిపత్రి వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మాట వాస్తవమే. సిబ్బంది లేకనే కొనుగోళ్లు ప్రారంభించలేదని సీసీఐ ప్రతినిధులు అంటున్నారు. దీంతో పెద్దవడుగూరు మండలంలోని రైతులు గుత్తి కేంద్రానికి తీసుకొస్తున్నారు. తాడిపత్రిలో కేంద్రం ప్రారంభించాలని సీసీఐ ప్రతినిధులకు చెప్పాం. సాధ్యమైనంత మేరకు రైతులు పండించిన పత్తిని కొనుగోలు చేయించి మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకుంటాం.

# డిసిల్టింగ్ పేరు.. అక్రమాల జోరు



గూడూరు : డిసిల్టింగ్ పేరుతో స్వర్ణముఖిలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. భారీ యంత్రాలు ఉపయోగించి కొన్ని నెలలుగా తవ్వకాలు జరపడంతో నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న సహజ వనరులు ధ్వంసమవుతున్నాయి.

ఉమ్మడి గూడూరు డివిజన్లో స్వర్ణముఖి నదిలో కోట మండలం గూడలి, పెళ్లకూరు మండలం కలవకూరు ప్రాంతాల్లో 6,041 హెక్టార్లలో ఇసుక దిన్నెలు ఉన్నట్లు జలవనరులశాఖ అధికారులు గుర్తించారు. మానవశక్తి ద్వారా డిసిల్టింగ్ చేసేలా టెండర్లు పిలిచారు. ఇసుకను గనుల శాఖ గుర్తించిన యార్డుకు తరలించాలి. ఇందుకుగాను గుత్తేదారునికి టన్నుకు రూ.135 చెల్లించేలా నిర్ణయించారు. యార్డులో ఇసుకను గనులు, రెవెన్యూ శాఖల పర్యవేక్షణలో స్థానిక అవసరాలకు టన్ను రూ.250కు విక్రయించాలి. కానీ ఇందుకు భిన్నంగా డిసిల్టింగ్ పేరుతో తవ్వకాలు కొనసాగిస్తున్నారు.

**తీరంలో ఎక్కడబడితే అక్కడ**

డిసిల్టింగ్ ప్రాంతాల హద్దులు చూపకపోవడంతో కోట మండలంలో గూడలి, మెట్టు, రుద్రవరం, పెళ్లకూరు మండలంలో కలవకూరు, పుల్లూరు ప్రాంతాల్లో స్వర్ణముఖి తీరంలో ఎక్కడబడితే అక్కడ తవ్వకాలు జరుగుతున్నాయి. జలవనరుల శాఖ ఈఈ బాబుతో ప్రస్తావించగా డిసిల్టింగ్‌ను మళ్లీ కొంతకాలం పొడగించామన్నారు.యార్డులకు చేరవేయకుండానే తరలింపుడిసిల్టింగ్ పేరుతో తీసిన ఇసుకను యార్డులో అరకొరగా ఉంచుతున్నారు. నదిలో యంత్రాలతో 10–20 అడుగులు తవ్వి అక్రమంగా తరలిస్తున్నారు. ఏడాదిగా ఇదంతా సాగుతున్నా అధికారుల పర్యవేక్షణ లేదు. రైతుల పంపుసెట్లు ధ్వంసమవుతున్నాయి. మూడు ప్రాంతాల్లో నది పొర్లుకట్టలను ధ్వంసం చేసి రోడ్లు నిర్మించారు. డిసిల్టింగ్ పనులు పరపతి కలిగిన వ్యక్తులు దక్కించుకోవడం, రవాణాలో ముఖ్యనేతల జోక్యం ఉండడంతో అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. డిసిల్టింగ్ ఎక్కడన్నది భౌగోళికంగా నిర్ణయించకపోవడం, ఎన్ని టన్నులు తీశారు? యార్డులో ఎంత నిల్వ చేశారు? ఎంత విక్రయించారన్నది స్పష్టత లేదు. సీసీ కెమెరాల ఏర్పాటు నిబంధనా అమలు కావడం లేదు.

# చూడలేకున్నా.. పరిష్కారం చూపుతారు..!

పలమనేరు : చిన్న గాయమైతే నొప్పి అంటూ అల్లాడిపోతాం..జ్వరం వస్తే రెండు రోజులు పనులకు డుమ్మా కొడతాం..ఏమాత్రం అసౌకర్యంగా ఉన్నా విధులు చేయలేం..కానీ చూపు లేకపోయినా వీరు తమ పనిలో అద్భుతంగా రాణిస్తున్నారు. సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ.. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

కళ్లు లేనివారు ఒక్కరు ప్రభుత్వ ఉద్యోగం చేస్తుంటే ఆశ్చర్యంగా.. ఆసక్తిగా చూస్తాం. పలమనేరులోని మున్సిపల్ కార్యాలయంలో ఒకరు కాదు ఇద్దరు కాదు.. ముగ్గురు అంధులు పని చేస్తుండటం విశేషం. వారు చూడలేరు.. కానీ తమ కౌంటర్ వద్దకు వచ్చిన ప్రజలు చెప్పింది వింటారు.. సమస్యను తెలుసుకొని పరిష్కారాన్ని సమీప గుమస్తాకు చెబుతారు. కార్యాలయానికి చెందిన ప్రొసీడింగ్స్ ఎలా పంపాలి.. నోటీసులు ఎలా ఇవ్వాలనే విషయాలను సహ ఉద్యోగులకు నేర్పిస్తారు.

శంకర్: రెండు కళ్లు కనిపించని ఈయన 2018లో పలమనేరు



మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరారు. ఈయన తన గదిలో ఉంటూ సహోద్యోగులకు సూచనలు ఇస్తుంటారు. ప్రభుత్వ ఉత్తర్వులను తన చరవాణిలో రీడింగ్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఫొటోతీసి వింటారు. దానికి బదులు ఎలా పంపాలనే విషయాలను సహ ఉద్యోగికి చెబుతారు. శానిటేషన్ సమస్యలకు పరిష్కారం చూపుతుంటారు.

ఫౌజియాబి: గతంలో ఈమె నగరి, మదనపల్లె, పుంగనూరు మున్సిపాలిటీల్లో పనిచేశారు. సహోద్యోగులకు పని ఎలా చేయాలో సలహాలు ఇస్తుంటారు. 2024 నుంచి ఇక్కడ పని చేస్తున్నారు.

ఝాన్సీరాణి: ఈమె పబ్లిక్ హెల్త్‌లో పనిచేస్తారు. కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలు విని సిబ్బందికి చెబుతారు. ఈమె 2024 నుంచి ఇక్కడ ఉన్నారు. ఇలా ముగ్గురు అంధులు ఉద్యోగులుగా మున్సిపాలిటీలో పని చేస్తున్నారు. ముగ్గురిలోనూ కామన్‌గా ఉన్న లక్షణం.. ఆత్మస్థైర్యం.

# అవి'నీటి' నిర్వహణ

మంత్రాలయం: మంత్రాలయం ఎస్ఎస్ ట్యాంక్ దుస్థితి ఇది.. ఇక్కడ నీటిని శుద్ధి చేసి ఏడు గ్రామాలకు అందించాలి.. నిర్వహణకు ఏటా రూ.1.02 కోట్లు వెచ్చిస్తున్నారు. ఎనిమిదేళ్లుగా ఇసుక మార్చకపోవడం గమనార్హం.పల్లె ప్ర'జల' గొంతు తడపాల్సిన పథకాలు అవి'నిధి'మయంగా మారాయి. శుద్ధి చేయకుండానే సరఫరా చేస్తున్నారు.. నిబంధనల ప్రకారం.. పథకాల నిర్వహణ అంచనా వ్యయం కన్నా 5 శాతం ఎక్కువకు టెండర్లు దాఖలు చేస్తే రద్దు చేస్తారు. నీటి పథకాలకు సంబంధించి ఎంత తక్కువకు షెడ్యూళ్లు దాఖలు చేస్తే వారికే ఇస్తున్నారు. గోస్పాడు పథకాన్ని 21 శాతం తక్కువకు, ఆదోనిలో 30 శాతం తక్కువకు గుత్తేదారుడు దక్కించుకున్నారు. వీరు నీటిని ఎలా శుద్ధి చేస్తారో అధికారులకే తెలియాలి.

**రూ.46.04 కోట్ల కేటాయింపు**

ఎస్ఎస్ ట్యాంకులకు తుంగభద్ర దిగువ కాల్వ, కేసీ కాల్వ, కుందూ, ఎస్ఆర్ఎంసీ కాల్వల ద్వారా నీటిని సరఫరా చేస్తారు. అక్కడ రెండు దఫాలుగా శుద్ధి చేసిన తర్వాత ఓహెచ్ఆర్‌లకు పంపింగ్ చేస్తారు. అనంతరం కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేయాలి. వీటి నిర్వహణ బాధ్యతను గుత్తేదారులకు అప్పగిస్తారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి కర్నూలు జిల్లాకు రూ.25.52 కోట్లు, నంద్యాల జిల్లాకు రూ.20.52 కోట్లు కేటాయించారు.సిబ్బందిని నియమించడం లేదు. కేవలం నీటిని వదిలేందుకు ఇద్దరిని మాత్రమే ఏర్పాటు చేసుకున్నారు. పదుల సంఖ్యలో సిబ్బంది ఉన్నట్లు చెబుతూ వారి పేరుతో బిల్లులు పెట్టుకుంటున్నారు. నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ, మాయలూరు, టంగుటూరు, అవుకు పథకాలకు సంబంధించి భారీగా అవకతవకలు జరిగాయి. కర్నూలు జిల్లాలోని



ఓర్వకల్లు, మంత్రాలయం, నందవరం, కోడుమూరులో నిర్వహిస్తున్న పథకాలపై పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి.

**'ఇసుక'వేస్తే రాలనంత అక్రమాలు**

ఎస్ఎస్ ట్యాంకులకు చేరిన నీటిని పక్కనే ఉన్న ఫిల్టర్ బెడ్లలోకి పంపింగ్ చేస్తారు. అక్కడ ఇసుక, కంకర, ఇటుక ముక్కల్లోకి నీరు చేరుతుంది. అనంతరం ఆలం కలుపుతారు. క్లోరినేషన్ తర్వాత శుద్ధి జరిగాక గొట్టాల ద్వారా ఓహెచ్ఆర్‌లకు పంపింగ్ చేయాలి.

నీటి శుద్ధికి సముద్ర ఒడ్డు ఇసుకను వాడాలి.. గతంలో చీరాల నుంచి తెప్పించి వినియోగించేవారు. ఇది నాణ్యతగా ఉండటంతోపాటు శుద్ధి చేసేందుకు వీలుగా ఉంటుంది.

నిబంధనల ప్రకారం ఇసుక మార్చి ఎస్ఎస్ ట్యాంకుల్లో పూడిక తొలగించాల్సి ఉంది. గుత్తేదారులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. పాత ఇసుకనే జల్లెడ పట్టి వాడేస్తున్నారు.

ః పైపైనే క్లోరినేషన్ చేసి నేరుగా ఓహెచ్ఎస్ఆర్‌లకు సరఫరా చేస్తున్నారు. కానీ శుద్ధి చేసినట్లు లెక్కలు రాసుకొంటూ నిధులు బొక్కేస్తున్నారు.

**పనిచేయకున్నా పైసలిచ్చారు**

దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన ఫిల్టర్ బెడ్లు పనికిరావని అధికారులే నిర్ణయించారు. .ఇలాంటివి కర్నూలు జిల్లాలో 19, నంద్యాలలో 16 వరకు ఉన్నాయి. వీటి నిర్వహణకు మాత్రం బిల్లులు చెల్లిస్తున్నారు.

25 సీపీడబ్ల్యూ పథకాల పరిధిలో ఫిల్టర్ మీడియా (ఇసుక, కంకర కలిపి)లు కొత్తవి ఏర్పాటు చేసేందుకు జడ్పీ అధికారులు రూ.12.45 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీనిని పరిశీలిస్తే పథకాల నిర్వహణ ఎలా ఉందో చెప్పకనే చెబుతోంది.

ఎస్ఎస్ ట్యాంకులు : 39

నీటి నిల్వ సామర్థ్యం 0.590 సీపీడబ్ల్యూఎస్

పథకాలు : 59

లబ్ధి పొందే గ్రామాలు : 604

## చీరకట్టు.. పూల జడ.. ఆకట్టుకుంటున్న అమైరా దస్తూర్!

ఇండియన్ మోడల్.. సినీ హీరోయిన్ అయినటువంటి అమైరా దస్తూర్ ఎప్పటికప్పుడు తన హాట్ అందాలతో కుర్రకారుకు సెగలు పుట్టిస్తూ ఉంటుంది. హిందీ సినిమాల ద్వారా సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. ప్రస్తుతం సినిమాల్లో అవకాశాల కోసం ఎదురు చూస్తోంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ ఎల్లో కలర్ శారీలో ఫోటోలను తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసింది. ఈ ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి.. తాజాగా అమైరా దస్తూర్ ఎల్లో కలర్ శారీ ఫొటోస్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. ఇందులో అమైరా దస్తూర్ ఎల్లో కలర్ శారీతో పాటు తన పూల జడతో హైలెట్ అయింది. ముఖ్యంగా మల్లెపూలతో హెయిర్ స్టైల్ చేయించుకున్న ఈ ముద్దుగుమ్మని వెనక నుండి చూస్తే అచ్చ తెలుగు ఆడపిల్లలాగే కనిపిస్తోంది. ఇక స్లీవ్ లెస్ బ్లౌజ్ తో అందాలు హైలైట్ అయ్యేలా ఈ ముద్దుగుమ్మ తన శారీ ఫోటోలను ఇంస్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసింది. ఈ శారీలో అమైరా దస్తూర్ మరింత అందంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ ఫొటోస్ చూసిన చాలామంది నెటిజన్స్ ఫైర్ ఎమోజీలను షేర్ చేస్తూ అందమే దిగివచ్చినట్లు ఉంది అన్నట్లుగా కామెంట్లు పెడుతున్నారు. తన నడుము ఒంపు సొంపులు చూపిస్తూ ఫోటోలకు



ఫోజులు ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫొటోస్ సోషల్ మీడియాలో వైరల్ గా మారగా.. చాలామంది ఈ ఫోటోలు చూసి పలు కామెంట్లు పెడుతున్నారు.. అమైరా దస్తూర్ పర్సనల్ సినీ కెరియర్ విషయానికి వస్తే.. మోడలింగ్ ద్వారా సినిమాల్లోకి వచ్చిన ఈ ముద్దుగుమ్మ 2013లో వచ్చిన బాలీవుడ్ మూవీ ఇసాక్ తో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత హిందీ తో పాటు తెలుగు,తమిళ సినిమాల్లో కూడా నటించింది. ఇక అమైరా దస్తూర్ సందీప్ కిషన్ హీరోగా నటించిన మనసుకు నచ్చింది అనే మూవీతో టాలీవుడ్లోకి ఎంట్రీ ఇచ్చింది. అలాగే రాజ్ తరుణ్ హీరోగా వచ్చిన రాజుగాడు మూవీ లో కూడా హీరోయిన్ గా నటించింది.. ఆ తర్వాత మళ్ళీ తెలుగు సినిమాల్లో కనిపించలేదు. ఇక బాలీవుడ్ లో కొన్ని సినిమాల్లో నటించిన అమైరా దస్తూర్ చివరిగా తమిళంలో వచ్చిన భగీరా అనే సినిమాలో కనిపించింది.. అంతేకాకుండా పలు వెబ్ సిరీస్ లలో కూడా చేసింది. అలా సినిమాలు,వెబ్ సిరీస్ లు అంటూ ఇండస్ట్రీలో కొనసాగిన ఈ ముద్దుగుమ్మకి గత రెండు మూడు సంవత్సరాలు నుండి సినిమాల్లో ఎక్కువగా ఆఫర్స్ రావడం లేదు. అందుకే సినిమాల్లో ఆఫర్స్ అందుకోవడం కోసం ఇలా సోషల్ మీడియానే ప్రధానాయుధంగా మలుచుకొని తన ఫోటోలతో దర్శక నిర్మాతలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. మరి ఈ హీరోయిన్ అందాలు చూసైనా సినిమాల్లో ఏవైనా అవకాశాలు వస్తాయా అనేది చూడాలి.

## మమితా మరో సాయి పల్లవి అవ్వాలంటే..?

కొంతమంది హీరోయిన్స్ కి స్టార్ రేంజ్ వచ్చినా అది వాళ్ల గ్లామర్ తోనే అని తెలుస్తుంది. గ్లామర్ షోతో అలరించే భామలు కొందరైతే కేవలం తమ అభినయంతో మెప్పించే వారు ఇంకొంతమంది ఉంటారు. అలాంటి వారిలో మలయాళ భామ మమితా బైజు కూడా వస్తుంది. మమితా బైజు మలయాళ పరిశ్రమలో ఏడేళ్ల నుంచి సినిమా లు చేస్తుంది. ఐతే ప్రతి సినిమాలో మమితా తన టాలెంట్ తో అలరిస్తూ వస్తుంది. ప్రేమలు సినిమాతో ఆమె సౌత్ ఆడియన్స్ అందరికీ బాగా దగ్గరైంది. ప్రేమలు సినిమా తెలుగు ఆడియన్స్ కు కూడా బాగా నచ్చేసింది. అందుకే ఆమెను తెలుగు ప్రేక్షకులు కూడా ఇష్టపడుతున్నారు.

**ప్రదీప్ రంగనాథన్ తో డ్యూడ్..** ఐతే తెలుగులోనే కాదు తమిళంలో కూడా మమితాకు మంచి క్రేజ్ ఏర్పడింది. ఆల్రెడీ అమ్మడు అక్కడ సినిమాలు చేస్తుంది. దళపతి విజయ్ జన నాయగన్ తో సినిమా చేస్తున్న మమితా లేటెస్ట్ గా ప్రదీప్ రంగనాథన్ తో డ్యూడ్ లో ఆకట్టుకుంది. డ్యూడ్ సినిమాలో ఆమె రోల్ చూసిన ఆడియన్స్ మరోసారి మమితా ప్రేమలో పడిపోతున్నారు. ప్రతి పాత్ర కథ



విన్నప్పుడు ఎలా ఉన్నా తన అభినయంతో మెస్మరైజ్ చేస్తుంది మమితా బైజు. అందుకే ఆమెను సహజ నటిగా పొగిడేస్తున్నారు ఆడియన్స్. ఇక కొందరైతే మమితాను సాయి పల్లవితో పోల్చేస్తున్నారు. సాయి పల్లవి కూడా అంతే కేవలం పాత్ర ప్రాధాన్యత ఉంది అనిపిస్తే చాలు అది ఎలాంటి సినిమా అయినా చేస్తుంది. ఐతే సాయి పల్లవి తన కెరీర్ లో చాలా ప్రయోగాలు చేసింది. కానీ మమితా ఇప్పుడే కెరీర్ మొదలు పెట్టింది కాబట్టి ఆమెకు ఇంకా అలాంటి ఛాన్స్ లు రాలేదు. కచ్చితంగా సౌత్ ఆడియన్స్ మమితా మీద చూపిస్తున్న ప్రేమ చూస్తుంటే సాయి పల్లవి తర్వాత ఆమె అనిపించేలా క్రేజ్ తెచ్చుకుంటుంది.

**అభినయంతో ఆడియన్స్ ని మెప్పిస్తూ..** మమితా కూడా ఆడియన్స్ లో తనపై ఉన్న నమ్మకాన్ని తగ్గించకూడదని ఫిక్స్ అయ్యింది. గ్లామర్ షో చేయడం వల్ల సినిమా ఛాన్స్ లు వస్తాయేమో కానీ ఒక ఐదారు సినిమాల తర్వాత బోర్ కొట్టేస్తారు. కానీ అభినయంతో ఆడియన్స్ ని మెప్పిస్తూ.. సినిమా సినిమాకు.. ప్రతి పాత్రలో కొత్తగా కనిపిస్తే మాత్రం వాళ్లకి ఎక్కువ కెరీర్ ఉంటుంది. సో మమితాకు కచ్చితంగా మలయాళం మాత్రమే కాదు మిగతా సౌత్ భాషల్లో కూడా మంచి ప్రేక్షకాదరణ లభిస్తుందని చెపడంలో సందేహం లేదు.

తెలుగులో వెంకీ అట్లూరి సూర్య సినిమాలో మమితా హీరోయిన్ గా సెలెక్ట్ అయ్యింది. ఆ సినిమాతో మరోసారి తెలుగు, తమిళ ప్రేక్షకులను అలరించనుంది అమ్మడు.




## ఓటీటీలో 'కానిస్టేబుల్ కనకం: సీజన్2' రికార్డు..




తొలి సీజన్‌ను మించి ట్విస్ట్‌లతో ఓటీటీ ప్రేక్షకులను అలరిస్తోంది 'కానిస్టేబుల్ కనకం: సీజన్2'. వర్ష బొల్లమ్మ, మేఘ లేఖ, రాజీవ్ కనకాల తదితరులు కీలక పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌కు ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వం వహించారు.

ఇటీవల తెలుగు ఓటీటీ వేదిక 'ఈటీవీ విన్'లో స్ట్రీమింగ్‌కు వచ్చిన సీజన్2 తక్కువ సమయంలోనే రికార్డు వ్యూస్‌ను సొంతం చేసుకుంది. ఇప్పటివరకూ 100o మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్‌తో రికార్డు సృష్టించినట్లు ఈటీవీ విన్ తెలిపింది. ఈ సందర్భంగా ఓ బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఇప్పటివరకూ ఎవరైనా సీజన్-1 చూడకపోతే, ఎలాంటి సబ్‌స్క్రిప్షన్ లేకుండా అన్ని ఎపిసోడ్స్ ఉచితంగా చూడొచ్చు. ఇక కొత్తగా చందా తీసుకునేవాళ్లకూ ఓ ఆఫర్ ఇచ్చింది. నెలవారీ చందాపై 'ఔ×చీ50' కోడ్‌ను ఉపయోగించి రూ.50 రాయితీ పొందవచ్చు. అలాగే వార్షిక ప్రీమియం తీసుకోవాలనుకుంటే, 'WIN100' కోడ్‌తో రూ.100 డిస్కౌంట్ పొందవచ్చు. దీని ద్వారా ప్రీమియం ప్లస్ ప్యాక్‌ను పొందే అవకాశం లభిస్తుంది.


**ఇంతకీ కథేంటంటే..** శ్రీకాకుళం జిల్లా రేపల్లె గ్రామ సమీపంలోని అడవిగుట్ట వైపు వెళ్లిన మహిళలు కనిపించకుండా పోతారు. ఆ మిస్టరీని మహిళా కానిస్టేబుల్ కనక మహాలక్ష్మి అలియాస్ కనకం (వర్ష బొల్లమ్మ) ఛేదిస్తుంది. అయితే, తన ప్రాణానికి ప్రాణమైన స్నేహితురాలు చంద్రిక (మేఘ లేఖ) ఆచూకీని మాత్రం కనుగొనలేకపోతుంది. అందరూ చంద్రిక చనిపోయిందని అనుకుంటారు.

పోలీసులు కూడా ఆ కేసును సీపీ ఆఫీస్‌కు పంపేస్తారు. అయితే, చంద్రిక బతికే ఉందని కనకం బలంగా నమ్ముతుంది. మరి కనకం భావిస్తున్నట్లు చంద్రిక బతికే ఉందా? ఉంటే ఎక్కడ ఉంది? ఆ మిస్టరీని కనకం ఎలా ఛేదించింది? అన్నదే సీజన్-2 కథ.

## ఆయన వల్ల నా లైఫ్ లో బిజీగా ఉన్నా







లైఫ్ లో ఎప్పుడేం జరుగుతుందో ఎవరూ చెప్పలేం. అందుకే లైఫ్ ఈజ్ అన్‌ప్రెడిక్టబుల్ అంటుంటారు. సినీ ఇండస్ట్రీలో ఆ ప్రిడిక్షన్ ఇంకా దారుణంగా ఉంటుంది. ఎవరెప్పుడు ఎలా మారిపోతారో ఎవ రూ చెప్పలేం. ఒక్క ఛాన్స్ కొందరి లైఫ్ ను వెనక్కి తిరిగి చూసుకునే పన్లేకుండా మార్చేస్తే, అదే ఛాన్స్ మరికొందరి లైఫ్ ను తలకిందులు చేస్తుంది.

**సీరియల్స్ నుంచి సినిమాల వరకు..** తన లైఫ్ కూడా అలా ఒక్క ఛాన్స్ తోనే మొత్తం మారిపోయిందని చెప్తున్నారు నటి హరితేజ. తెలుగు బుల్లితెర ప్రేక్షకులకు హరితేజ ఎవరో కొత్తగా పరిచయం చేయనక్కర్లేదు. పలు సీరియల్స్, టీవీ షోల్లో నటించిన హరి తేజ, బిగ్ బాస్ రియాలిటీ షో తో ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. బిగ్ బాస్1 ద్వారా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని పాపులరయ్యారు హరితేజ.

**అ..ఆలో పనిమనిషి పాత్రలో..** సీరియల్స్ తో పాటూ వంటల షో కు హెూస్ట్ గా వ్యవహరించిన హరి తేజ ఇప్పుడు ఎక్కువగా సినిమాలపైనే ఫోకస్ చేశారు. ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్టుగా పలు సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్న హరి తేజకు వరుస అవకాశాలు రావడానికి కారణం డైరెక్టర్ త్రివిక్రమేనని ఆమె చెప్తున్నారు. అ..ఆ సినిమాలో త్రివిక్రమ్ పని మనిషి క్యారెక్టర్ ఇవ్వడం వల్ల తన లైఫ్ మొత్తం మారిపోయిందని హరితేజ తెలిపారు.

**వారమైనా ఫోన్ రాలేదు...** త్రివిక్రమ్ పని మనిషి క్యారెక్టర్ కోసం వెతుకుతున్న టైమ్ లో ఓ రోజు టీవీ చూస్తున్నప్పుడు వంటల షోలో తనను చూసి, ఆ జోక్స్, కామెడీ విని ఈ అమ్మాయిని తీసుకురమ్మని తన టీమ్ కు చెప్పారని, తనకు ఫోన్ చేసి త్రివిక్రమ్ సినిమా అని చెప్పగానే షాకయ్యానని హరితేజ చెప్పారు. కానీ ఆ క్యారెక్టర్ కోసం ఆడిషన్ ఇచ్చాక తనకు ఏమీ చెప్పలేదని, వారం రోజులయ్యాక ఇక ఆఫర్ పోయినట్టేలే అనుకుంటున్న టైమ్ లో ఫోన్ చేసి డేట్స్ కావాలని అడిగారని, కనీసం కథేంటో కూడా అడక్కుండానే తాను ఆ సినిమాకు ఒప్పుకున్నట్టు హరితేజ చెప్పారు. అ..ఆ మూవీ చేసేటప్పుడే ఈ సినిమా తర్వాత తన లైఫ్ మారిపోతుందని చెప్పారని ఆమె పేర్కొన్నారు.

## రెడ్ గౌన్‌లో రకుల్.. గ్లామర్‌తో కట్టిపడేస్తోందిగా..

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు తనకంటూ ఓ ప్రత్యేకమైన ఫాలోయింగ్ సంపాదించుకున్న బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్. నటనతోనే కాకుండా తన ఫిట్‌నెస్, యూనిక్ స్టైల్ స్టేట్ మెంట్లతో ఎప్పుడూ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంటుంది. లేటెస్ట్ గా ఆమె షేర్ చేసిన ఫొటోలు ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటున్నాయి. లేటెస్ట్ ఫొటోషూట్‌లో రకుల్ స్ట్రాప్ లెస్ రెడ్ గౌన్‌లో మెరిసిపోయింది. థై హై స్లిట్‌తో ఉన్న ఈ స్టైలిష్ అవుట్‌ఫిట్‌లో ఎంతో గ్లామరస్‌గా కనిపిస్తోంది. "ఈ అవుట్‌ఫిట్, ఈ సాంగ్‌తో ప్రేమలో పడిపోయా" అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్‌ను బట్టి ఈ లుక్‌ను ఎంతగా ఇష్టపడిందో అర్థమవుతోంది.



ఆమె పోజులకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సినిమాతో టాలీవుడ్‌లో బ్రేక్ అందుకున్న రకుల్, ఆ తర్వాత 'నాన్నకు ప్రేమతో', 'సరైనోడు' వంటి వరుస హిట్లల్లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. తెలుగులో టాప్ లీగ్‌లో ఉండగానే బాలీవుడ్‌పైనా దృష్టి సారించి, అక్కడ కూడా వరుస ఆఫర్లతో తనకంటూ ఓ స్థానాన్ని సంపాదించుకుంది. ప్రస్తుతం రకుల్ కెరీర్ సౌత్, నార్త్ అనే తేడా లేకుండా ఫుల్ స్వింగ్‌లో కొనసాగుతోంది. ఆమె చేతిలో పలు క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. ముఖ్యంగా, కమల్ హాసన్, శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'ఇండియన్ 3' లో కూడా రకుల్ కీలక పాత్ర పోషిస్తోంది. అయితే ఈ సినిమా ఇంకా హెూల్డ్ లోనే ఉంది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం రకుల్ ఎప్పుడూ చురుగ్గా ఉంటుంది. తన లేటెస్ట్ ఫొటోషూట్లు, ఫిట్‌నెస్ అప్‌డేట్లతో ఫ్యాన్స్‌కు నిత్యం టచ్‌లో ఉంటూ తన క్రేజ్‌ను ఏమాత్రం తగ్గకుండా చూసుకుంటోంది.

## కీర్తి సురేష్ బయోపిక్ టైటిల్ అది పెట్టాలట..!

మహానటి సినిమాతో తనలోని మహానటిని ప్రేక్షకులకు పరిచయం చేసి అవార్డులను సైతం అందుకుంది కీర్తి సురేష్. మలయాళంలో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్న కీర్తి సురేష్ తెలుగు, తమిళ భాషల్లో సినిమాలు చేస్తూ స్టార్ క్రేజ్ తెచ్చుకుంది. లాస్ట్ ఇయర్ బేబీ జాన్ సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ కూడా ఇచ్చింది కీర్తి సురేష్. ఇక రీసెంట్ గా అమ్మడు ఒక ఇంటర్వ్యూలో తన బయోపిక్ తీస్తే ఎలాంటి టైటిల్ పెట్టాలో చెప్పింది. సీనియర్ యాక్టర్ జగపతి బాబు హెూస్ట్ గా ఒక స్పెషల్ చిట్ చాట్ షో నిర్వహిస్తున్నారు.

**పెళ్లి తర్వాత కీర్తి సురేష్..** ఈ చిట్ చాట్ లో ఇప్పటికే చాలామంది స్టార్స్ అటెండ్ అయ్యారు. రీసెంట్ గా కీర్తి సురేష్ కూడా ఆ షోకి వచ్చింది. షోలో జగ్గు భాయ్ ప్రశ్నలకు కీర్తి సురేష్ తెలివైన సమాధానాలు ఆడియన్స్ ని అలరించాయి. ఇక ఈ క్రమంలో సావిత్రి



గారి బయోపిక్ మహానటిలో నువ్వు చేశావ్.. నీ బయోపిక్ చేస్తే దానికి ఏ టైటిల్ పెట్టాలని నువ్వు అనుకుంటున్నావ్ అంటే కాస్త ఆలోచించి ప్రసిద్ధి అని చెప్పింది కీర్తి. అంటే తన పేరులోని కీర్తి ప్రతిష్ట ప్రసిద్ధి ఇలా వాటికి సూటయ్యేలా టైటిల్ ఎంపిక చేసుకుందన్నమాట. కీర్తి సురేష్ బయోపిక్ చేస్తే కచ్చితంగా ఆ టైటిల్ పెట్టినా డౌట్ పడనక్కర్లేదు. ఈమధ్య కెరీర్ లో కాస్త వెనకపడింది కీర్తి సురేష్. పెళ్లి తర్వాత ఈ బ్రేక్ కామనే అయితే మళ్లీ తిరిగి ఫాం లోకి రావాలని చూస్తుంది అమ్మడు.

**విజయ్ దేవరకొండతో రౌడీ జనార్ధన్..** ప్రస్తుతం తెలుగులో విజయ్ దేవరకొండతో రౌడీ జనార్ధన్ తో పాటుగా వేణు యెల్దండి ఎల్లమ్మ సినిమాలో కూడా కీర్తి సురేష్ నటిస్తుంది. ఈ రెండు సినిమాలతో అమ్మడు మళ్లీ తన సత్తా చాటాలని చూస్తుంది. కీర్తి సురేష్ కూడా తన ఫోకస్ అంతా ఇప్పుడు ఈ రెండు సినిమాల మీదే పెట్టింది. తమిళ్ లో సినిమాలు కాస్త తగ్గాయి కాబట్టి అవకాశం ఇస్తున్న తెలుగు లో మళ్లీ రాణించాలని చూస్తుంది అమ్మడు. ఎలాంటి పాత్ర ఇచ్చినా దానికి నూటికి నూరు పాళ్లు న్యాయం చేస్తున్న కీర్తి సురేష్. ఆఫ్టర్ మ్యారేజ్ కూడా తన సత్తా చాటాలని చూస్తుంది. ఐతే ప్రస్తుతం కమిటైన సినిమాలతో కీర్తి సురేష్ చాలా కాన్ఫిడెంట్ గా ఉంది. ఓ పక్క కమర్షియల్ సినిమాలు చేస్తూ ఫిమేల్ సెంట్రిక్ సినిమాలు చేసిన కీర్తి సురేష్. మళ్లీ లేడీ ఓరియెంటెడ్ కథలను కూడా టచ్ చేయాలని చూ స్తుంది. ఐతే పూర్తిగా అలాంటి సినిమాలే కాకుండా కమర్షియల్ సినిమా లతో ఆడియన్స్ ని అలరించాలని ఫిక్స్ అయ్యింది. వేణుతో చేస్తున్న ఎల్లమ్మ సినిమాలో కీర్తి సురేష్ రోల్ సర్ ప్రైజ్ చేస్తుందని అంటున్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536